సాక్షి 24|7

మంచిర్యాల

బుధవారం 3-1-2018

మ్యాంగో మార్కెట్‌లో నిర్మాణ దశలో ఉన్న షెడ్డు



ఊరిస్తున్న

మ్యాంగో మార్కెట్

మార్కెట్ వివరాలు

అంచనా వ్యయం రూ.2 కోట్లు

మంజూరైన నిధులు రూ.1.26 కోట్లు

భూ విస్తీర్ణం 5 ఎకరాలు

పనుల ప్రగతి 80శాతం

- ఉమ్మడి జిల్లా కేంద్రంగా బెల్లంపల్లిలో నిర్మాణం
- రెండేళ్లలో 80 శాతం పూర్తయిన పనులు
- వచ్చే సీజన్‌లో అయినా పూర్తయ్యేనా..?
- లేకుంటే మామిడి రైతులు మళ్లీ నాగ్‌పూర్ బాటే..

ఉమ్మడి జిల్లాలో మామిడి తోటలు, దిగుబడి వివరాలు..

నాలుగు జిల్లాల్లో విస్తీర్ణం	33,000	(ఎకరాలు)
కాపునకు వచ్చిన తోటలు	28,000	
ఐదేళ్ల లోపు తోటలు	5,000	
ఎకరాకు వచ్చే దిగుబడి	5-7టన్నులు	
ఉమ్మడి జిల్లాలో దిగుబడి	2 మిలియన్ టన్నులు	
టన్నుకు ధర	రూ.20,000	
వ్యాపారం విలువ	రూ.400 కోట్లు	

(టన్నుకు రూ.20వేల అంచనాతో)

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో రెండేళ్ల క్రితం మంజూరైన మ్యాంగో మార్కెట్ నిర్మాణ పనులు నత్తన డకన కొనసాగుతున్నాయి. గతేడాది సీజన్ లోనే మార్కెట్‌ను పూర్తి చేసి కొనుగోళ్లు చేప డుతామని మార్కెటింగ్ శాఖ మంత్రి హరీష్‌రావు ప్రకటించినా అమలుకు నోచు కోలేదు. వచ్చే సీజన్ నాటికైనా మార్కెట్‌ను పూర్తి చేయకుంటే మామిడి రైతులు మళ్లీ నాగ్‌పూర్ బాట పట్టాల్సిందే. రూ.2కోట్లతో మార్కెట్ మంజూరు కాగా.. ఇప్పటివరకు రూ.1.26 నిధులు విడుదల అయ్యాయి. మిగిలిన నిధులు విడుదల చేసి పనులు వెంటనే పూర్తి చేయాలని ఈ ప్రాంతంలోని మామిడి రైతులు కోరుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మ్యాంగో మార్కెట్ లేకపోవడంతో మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులు - మిగతా 2లో



మొక్కల పెంపకం

- హరితహారం నాలుగో విడతకు..
- నర్సరీల్లో మొక్కల పెంపకంపై దృష్టి
- పెంచేవి 1.10 కోట్లు, నాటేవి 95 లక్షలు
- శాఖల వారీగా లక్ష్యాలు కేటాయింపు

2 లో



బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌గా

రాహుల్ రాజ్

- తొలిసారి ఐఏఎస్‌ను నియమించిన ప్రభుత్వం

2 లో

మన నిధులు మనకే..

- బీఆర్ఎస్, ఎల్ఆర్ఎస్ కింద రూ.15.15 కోట్ల వసూలు
- క్రమబద్ధీకరణ నిధుల్లో సగం తాగునీటికే
- రోడ్లు, డ్రెయినేజీలు, ఇతర పనులకు కేటాయింపు
- నిధుల వినియోగంపై ప్రభుత్వం ఉత్తర్వులు
- కౌన్సిల్ తీర్మానం తర్వాత ప్రతిపాదనలు

2లో

మంచిర్యాల మున్సిపాలిటీ



మినీ FOCUS అందని ద్రాక్ష..! 7లో

బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌గా రాహుల్ రాజ్

బెల్లంపల్లి: బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌గా రాహుల్ రాజ్ నియామకం అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా ఐఏఎస్ అధికారిని బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌గా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ ఎస్పీ సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం బెల్లంపల్లి ఆర్డీఓగా వీరన్న విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఉద్యోగ విరమణకు చేరువలో ఉన్న క్రమంలో ప్రభుత్వం ఐఏఎస్ అధికారిని బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌గా నియమించింది. కొత్త జిల్లాల పునర్విభజనలో భాగంగా గతేడాది బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడింది. తొలి ఆర్డీఓగా పాండురంగా నియామకం కాగా కొన్ని నెలల వ్యవధిలోనే ఆయన బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నెన్నెల తహసీల్దార్‌గా పని చేస్తున్న వీరన్న పదోన్నతితో బెల్లంపల్లి ఆర్డీఓగా నియమితులయ్యారు. తాజాగా బెల్లంపల్లికి సబ్ కలెక్టర్‌ను నియమించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

సాఫ్ట్‌వేర్ టు సివిల్ సర్వీసెస్

హైదరాబాద్‌కు చెందిన రాహుల్‌రాజ్ ఇంజనీరింగ్ 2009లో జేఎన్‌టీయూ(హెచ్)లో పూర్తి చేశారు. తర్వాత మూడున్నర సంవత్సరాల పాటు టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేశారు. 2014లో మొదటి సారి సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాసి ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. 2015లో రెండో ప్రయత్నంలో ఆలిండియా 375 ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు.

ఊరిస్తున్న మ్యాంగో మార్కెట్

▶మొదటిపేజీ తరువాయి

పడుతున్నారు. ప్రతి ఏటా వచ్చిన మామిడి దిగుబడులను అనేక వ్యయప్రయాసలకోర్చి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ మార్కెట్‌కు తరలించి అమ్ముకుంటున్నారు. అక్కడ ఏజెంట్లు, వ్యాపారుల మోసాలతో రైతులు నష్టపోతున్నా ఏమీ చేయలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాల క్రితం బెల్లంపల్లిలో మ్యాంగో మార్కెట్‌ను మంజూరు చేసింది. మంచిర్యాల జిల్లాలో మామిడి తోటలు ఎక్కువగా ఉండటంతో ఇక్కడ మార్కెట్ ఏర్పాటుకు నిర్ణయించింది. మార్కెట్ నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించగా తొలివిడతగా రూ.1.26 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఈ మేరకు మార్కెట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వాస్తవానికి గతేడాదిలోనే మార్కెట్ నిర్మాణ పనులు పూర్తికావల్సి ఉండగా జాప్యం జరిగింది. ప్రస్తుతం కూడా పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఇప్పటివరకు మార్కెట్ షెడ్ల నిర్మాణాలు దాదాపు పూర్తి కావచ్చాయి. షెడ్ల అంతర్భాగంలో ఫ్లోరింగ్ పనులు జరగాల్సి ఉంది. మార్కెట్ ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి అంతర్గతంగా రోడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. షెడ్లకు గోడలు కట్టాల్సిన పనులు మిగిలి ఉన్నాయి. ఇప్పటివరకు 80శాతం పనులు పూర్తి కాగా, మిగిలిన 20 శాతం పనులను ఒకట్రెండు నెలల్లో పూర్తి చేయడానికి వీలున్నా మూడు నెలల గడువుతో పూర్తి చేసి మామిడి సీజన్‌కు ముందే మార్కెట్‌ను ప్రారంభిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో మామిడితోటలు

ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్‌లో వెయ్యి, కుమురం భీం జిల్లాలో రెండు వేలు, నిర్మల్ జిల్లాలో ఎనిమిది వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. అత్యధికంగా ,మంచిర్యాల జిల్లాలో 17వేల ఎకరాల్లో తోటలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 28వేల ఎకరాల్లో కాపునకు వచ్చే మామిడి తోటలు ఉండగా, మరో ఐదు వేల ఎకరాల్లో ఐదేళ్లలోపు మామిడి మొక్కలు ఉన్నట్లు ఉద్యానవనశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఏటా రెండు మిలియన్ టన్నుల ఉత్పత్తి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక రకాల మామిడి తోటలు ఉన్నాయి. మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉన్న దశేరి, బంగెనపల్లి, హిమాయత్, చక్కెరకేళి తదితర రకాల మామిడి తోటలను పెంచుతున్నారు. ఎకరానికి ఐదు నుంచి ఏడు టన్నుల చొప్పున మామిడి దిగుబడి వస్తున్నట్లు ఉద్యానవన అధికారుల అంచనా. ఈ లెక్కన ప్రతి సంవత్సరం రెండు మిలియన్ టన్నుల వరకు మామిడి కాయలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటితోపాటు తోతపురి, మల్లిక, ఏనుగుతొండం తదితర రకాల తోటలు ఉన్నాయి. వీటికి మద్దతు ధర అంతంత మాత్రంగా ఉంటుంది.

ఏటా రూ.400 కోట్ల వ్యాపారం

మామిడి కాయలు టన్నుకు రూ.20వేల మద్దతు ధర లభించినా ప్రతి సంవత్సరం రూ.400 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందనేది వ్యాపార వర్గాల అంచనా. ఏళ్ల తరబడి నుంచి అంత భారీ స్థాయిలో మామిడి వ్యాపారం జరుగుతున్నా ఇన్నాళ్లుగా ఉమ్మడి జిల్లాలో మార్కెట్ ఏర్పాటు చేయకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది.

నాగ్‌పూర్ మార్కెట్‌లో దోపిడీ

మామిడి రైతులు పక్కనున్న నాగ్‌పూర్ మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్మకాలు చేస్తున్నారు. అక్కడ మామిడి కాయలు అమ్మిపెట్టే దళారులు, కొనుగోలు చేసే వ్యాపారులు కుమ్మక్కై జిల్లా రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. సిండికేట్‌గా మారి తక్కువ ధర చెల్లిస్తున్నారు. దీంతో మామిడి తోటలను నమ్ముకున్న రైతులు కష్టనష్టాల పాలవుతున్నారు. బెల్లంపల్లిలో మామిడి మార్కెట్ ప్రారంభమైతే రైతులకు వ్యయ ప్రయాసాలు తీరడంతో పాటు మద్దతు దక్కే అవకాశం ఉంటుందని ఆశపడుతున్నారు.

ఘనంగా పౌర్ణమి జాతర



సత్యనారాయణ వ్రతాలు నోముతున్న దంపతులు

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమి జాతర ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గోదావరిలో స్నానాలు అచరించారు. గుట్టపై గల రమాసహిత సత్యనారాయణ స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వంద జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. సుమారుగా పదివేలకు వరకు భక్తులు హాజరయినట్లు అధికారులు అంచనా వేశారు.

మన నిధులు మనకే..

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలకు ప్రభుత్వం ఓ చక్కని అవకాశాన్ని ఇచ్చింది. బీఆర్‌ఎస్ (భవనాల క్రమబద్ధీకరణ పథకం), ఎల్‌ఆర్‌ఎస్ (స్థలాల క్రమబద్ధీకరణ పథకం) కింద మున్సిపాలిటీలకు వసూలైన నిధుల్లో సగం తాగునీటికి, మిగతా నిధులు ఇతర అవసరాలకు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించింది. ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో మంచిర్యాల, బెల్లంపల్లి మున్సిపాలిటీలకు నిధుల కొరత నుంచి కొంత ఊరట లభించింది.

రూ.15.15 కోట్ల ఆదాయం..

ఎల్‌ఆర్‌ఎస్ కింద మంచిర్యాలలో 4,539 దరఖాస్తులకుగాను రూ.15 కోట్లు, బెల్లంపల్లిలో 82 దరఖాస్తులకుగాను రూ.15 లక్షల ఆదాయం సమకూరింది. ఈ నిధులను మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానించిన అనంతరం ఖర్చు చేసేందుకు అవకాశం ఏర్పడింది. కౌన్సిల్‌లో తీర్మానం చేసిన తర్వాత డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ రివ్యూ కమిటీ చైర్మన్ ఆమోదించాలి. ఆ తర్వాత ప్రతిపాదనలు తయారు చేసి సీడీఎంఏకు పంపుతారు. వారి నుంచి ప్రొసీడింగ్ రాగానే పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు మూడుసార్లు గడువు ఇచ్చి చివరికి 2016 డిసెంబర్ వరకు కూడా 20 శాతం జరిమానా అవకాశం కల్పించారు. మొదట రూ.10 వేల డీడీ చెల్లింపు, ఆ తర్వాత స్థలం మార్కెట్ విలువలో 20 శాతం డాక్యుమెంట్లలో విలువ ప్రకారం 14 శాతం చొప్పున డబ్బులు కట్టించుకున్నారు. బీఆర్‌ఎస్‌కు మాత్రం ధరఖాస్తుదారుడు రూ.10 వేల చొప్పున చెల్లించగా, భవనం కొలతలను మార్కెట్ విలువ ప్రకారం డబ్బులు చెల్లించాలని ఆదేశాలు రాగా, ఆ తర్వాత ఎలాంటి ఆదేశాలు జారీ కాకపోవడంతో బీఆర్‌ఎస్ స్కీం పూర్తికాలేదు.

మంచిర్యాలలో తాగునీటికే రూ.13 కోట్లు

మంచిర్యాల మున్సిపాలిటీకి ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి నీటిని అందించేందుకు రూ.27 కోట్ల నిధులతో చేపట్టిన తాగునీటి పథకం అస్తవ్యస్తంగా మారింది. పైప్‌లైన్ పనులు నాసిరకంగా ఉండడంతో తరచూ లీకేజీలు ఏర్పడి పట్టణ ప్రజలకు తాగునీటిని అందించడంలో మున్సిపాలిటీ విఫలమవుతోంది. గత రెండేళ్లుగా ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పైప్‌లైన్‌ను మార్చాలని ఎన్నోసార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కానీ ప్రభుత్వం ఇదివరకే నిధులను కేటాయించడంతో మరోసారి నిధులను ఇవ్వలేదు. దీంతో గత రెండేళ్లుగా పైపులు పగిలిపోతుంటే మున్సిపల్ నిధులతోనే మరమ్మతులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్ నిధుల నుంచి రూ.13 కోట్లను తాగునీటి పనులకే కేటాయించినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. ఇందులో రూ.8.70 కోట్లను ముల్కల్ల నుంచి మంచిర్యాల వరకు పైప్‌లైన్‌ను పూర్తిగా మార్చేందుకు కేటాయించారు. రూ.4.30 కోట్లను మిషన్ భగీరథ పనుల కోసం కేటాయించారు. తిలక్‌నగర్‌లో మిషన్ భగీరథ పథకంలో వంద ఫీట్ల రోడ్డు తవ్వకంపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో పైప్‌లైన్ డిజైన్ మార్పు వల్ల అయ్యే ఖర్చును మున్సిపాలిటీనే చెల్లించేందుకు డిసెంబర్ 30న జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. ఈ మేరకు రూ.4.30 కోట్లను మిషన్ భగీరథకు ఖర్చు చేయనున్నారు.

మొక్కల పెంపకం

మంచిర్యాలఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో భాగంగా ఈ ఏడాది నాలుగో విడత కార్యక్రమానికి అధికారులు ఇప్పటినుంచే కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో నాలుగో విడతలో 1.10 కోట్ల మొక్కలను నర్సరీల్లో పెంచాలని నిర్ణయించగా, వీటిలో 95 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేశారు. మొక్కల పెంపకం బాధ్యతలను ఆయా శాఖలకు కేటాయించారు. గత సంవత్సరం మూడో విడత కోసం 1.17 కోట్ల మొక్కలు పెంచగా.. ఈసారి ఆయా శాఖలు, సంస్థలు 1.10 కోట్ల మొక్కలను నర్సరీల్లో పెంచనున్నాయి. వీటిలో అటవీశాఖ ఆధ్వర్యంలో 79లక్షలు మొక్కల పెంపకం చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకోసం మంచిర్యాల, జన్నారం, చెన్నూర్, బెల్లంపల్లి డివిజన్‌లోని 11 రేంజ్‌ల పరిధిలోని 97 నర్సరీల్లో మొక్కల పెంపకం పనులకు శ్రీకారం చుట్టారు. 170 రకాల వివిధ జాతుల మొక్కల పెంచనున్నారు. డీఆర్‌డీవో ఆధ్వర్యంలో 34 నర్సరీల్లో 20 లక్షలు టేకు మొక్కలు పెంచాలని లక్ష్యం నిర్దేశించారు. ఐటీడీఏ 50 వేలు, ఉద్యానవన శాఖ 50 వేలు పండ్ల మొక్కలు, సింగరేణి ఆధ్వర్యంలో 10 లక్షలు మొక్కల పెంపకం చేపట్టనున్నారు. అలాగే ఆయా శాఖలు, సంస్థల ఆధ్వర్యంలో ఎన్ని మొక్కలు నాటాలో కూడా ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లావ్యాప్తంగా 95 లక్షల మొక్కలు నాటడం లక్ష్యం కాగా.. ఇందులో అటవీశాఖ 40 లక్షలు, డీఆర్‌డీఏ 40 లక్షలు, సింగరేణి 10 లక్షలు, ఎక్సైజ్ శాఖ 2లక్షలు, పురపాలక సంఘాలు లక్షన్నర, పోలీస్‌శాఖ లక్ష, విద్యాశాఖ 25వేలు, పరిశ్రమల శాఖ 25వేల చొప్పున మొక్కలు లక్ష్యం కేటాయించారు. కాగా.. గత మూడు విడతలుగా ప్రజాప్రతినిధులు, అధికారులు హరితహారం కార్యక్రమాన్ని అర్భాటంగా చేపట్టినా అనుకున్న లక్ష్యం నెరవేరలేదు. మొక్కలు నాటడంలో చూపిన ఉత్సాహం సంరక్షణలో చూపకపోవడం వల్ల చాలావరకు మొక్కలు చనిపోయి గుంతలు మాత్రమే మిగిలాయి. మొక్కలకు జియోట్యాగింగ్ చేయాలని ప్రభుత్వ ఆదేశాలున్నా అమలులో అసక్తి చూపలేదు. అటవీశాఖ మాత్రమే అక్కడక్కడ జియోట్యాగింగ్ చేస్తుండగా ఇతర శాఖలు అసలు పట్టించుకోవడం లేదు. మూడో విడతలో 95లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం కాగా 96లక్షలు నాటినట్లు అధికారులు చెబుతున్నారు. వీటిలో 80 శాతం మొక్కలు పెరిగినట్లు దస్త్రాల్లో మాత్రమే కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే హరితహారం నాలుగో విడతకు ఇప్పటినుంచే నర్సరీల్లో మొక్కల పెంపకం చేపడుతున్నారు.

ఆసుపత్రులు బంద్ చేసి వైద్యుల నిరసన

మంచిర్యాలటౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు మంచిర్యాల పట్టణంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులను మంగళవారం బంద్ చేసి ఐఎంఏ మంచిర్యాల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఐఎంఏ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ జాతీయ వైద్య కమిషన్ బిల్ 2017లో అనేక లోపాలు ఉన్నాయన్నారు. ఐఎంఏ అభ్యంతరాలను పరిశీలించి, పార్లమెంటులో ఈ బిల్‌కి వ్యతిరేకంగా ఎంపీలు గళం విప్పాలని కోరారు. దేశంలోని 7లక్షల మంది డాక్టర్ల చేత ఎన్నికై 130 మంది సభ్యులతో పనిచేసే ఎంసీఐని భ్రష్టు పట్టి అవినీతిలో కూరుకు పోయిందనే నెపంతో దానిని రద్దు చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. రాజకీయ పార్టీల చేత నియమించబడే 25 మంది నాన్ మెడికల్ వ్యక్తులతో పనిచేసే జాతీయ వైద్య కమిషన్‌ను ఏర్పాటు చేయనుందని తెలిపారు. అవినీతి, ఆశ్రిత పక్షపాతమే ఎంసీఐ రద్దుకు కారణమైతే మన వ్యవస్థలోని అన్ని సంస్థలను రద్దు చేయాలని కోరారు. మెడికల్ మాఫియాకు ఊతమిచ్చి మరింత అవినీతిని ప్రోత్సహించేలా జాతీయ వైద్య కమిషన్‌ను ఏర్పాటు చేయడాన్ని ఐఎంఏ వ్యతిరేకిస్తోందన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ సురేందర్‌రావుకు వినతిపత్రంను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి మూర్తి, సీనియర్ డాక్టర్లు ఎన్.మల్లేశ్, రమణ, రాఘవరావు, రవిప్రసాద్, నర్సయ్య, అన్నపూర్ణ, పద్మ, స్వరూప, రఘునందన్, మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు తొగరు సుధాకర్, రాజేందర్, సేల్స్ రిప్రజంటేటివ్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాబాపురెడ్డి, లాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రశాంత్ పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు

మాయగాళ్లు

- ఉమ్మడి జిల్లాలో ఉద్యోగాల పేర్లతో నిరుద్యోగుల నుంచి వసూళ్లు
- ప్రజాప్రతినిధుల పేర్లను వాడుకుంటున్న వైనం
- ఇటీవల జిల్లా కేంద్రంలో పట్టుబడ్డ నిందితుడు
- గతంలో సైతం పలు సంఘటనలు..
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



ఆదిలాబాద్: ఉమ్మడి జిల్లాలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులకు మోసగాళ్లు గాలం వేస్తున్నారు. దీనికి ప్రజాప్రతినిధుల బంధవులమంటూ నమ్మబలకడం మరో ఎత్తు. ఇలా నిరుద్యోగుల నుంచి లక్షల రూపాయాలు వసూలు చేస్తున్నారు. పోలీసులు ఇలాంటి ముఠాలపై దృష్టి సారించకపోవడంతో అమాయకులు మోసపోతున్నారు. గత నవంబర్‌లో తపాలా శాఖలో డాటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలు పడ్డాయని, మీ బయోడేటా ఇవ్వండంటూ ఉమ్మడి జిల్లాలో నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. కొంతమంది నిరుద్యోగులు నేరుగా తపాలా శాఖ కార్యాలయానికి ఫోన్ చేసి తెలుసుకోవడంతో ఇది అబద్ధమని తెలిసింది. దీనిపై ఆ శాఖ సూపరింటెండెంట్ సైతం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. ఈ ఉద్యోగం కోసం రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఈ సంఘటనను 'సాక్షి' వెలుగులోకి తీసుకురావడంతో వసూళ్ల పర్వం నిలిచిపోయింది. ఇప్పటికీ ఏదైనా ప్రభుత్వ కార్యాలయాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు భర్తీ చేసినప్పుడల్లా నిరుద్యోగుల నుంచి భారీ మొత్తంలో వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి వారిపై నిరుద్యోగులు, ఇతర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

ప్రజాప్రతినిధుల పేర్లతో మోసాలు..

గతంలో ఉమ్మడి జిల్లాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసేవారిలో చాలామంది ఆయా శాఖల్లో పనిచేసే ఉద్యోగులు లేదా అధికారుల చేతివాటం ఉండేది. 2016లో ఫారెస్టు శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆదిలాబాద్‌లో ఆ శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి ఒక్కో నిరుద్యోగి నుంచి రూ.6 లక్షలకు పైగా వసూలు చేసి పోలీసులకు చిక్కిన సంఘటనలు ఉన్నాయి. దీంతోపాటు ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు డబ్బులు లేనిదే ఉద్యోగం రావడం లేదు. ఇప్పుడు పరిస్థితి మారింది. ఏకంగా ప్రజాప్రతినిధులనే మోసగాళ్లు వాడుకోవడం గమనార్హం. ఒక ఉద్యోగాలకే కాదు.. రైతులకు పట్టాలు ఇప్పిస్తామని, ఇసుక రీచ్‌లు ఇప్పిస్తామంటూ మంత్రుల బంధువుల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల పట్టుబడ్డ నిందితుడు సమ్మయ్య ఉద్యోగాలు, చెన్నూర్, కోటపల్లి మండలాల్లో రైతులకు పట్టాలు ఇప్పినని డబ్బులు చేసినట్లు తెలిసింది. దీనికి ఎమ్మెల్యేలు, మంత్రుల పేర్లు వాడుకున్నాడు. ఇతనితోపాటు లక్సెట్టిపేట మండలం చందారం గ్రామానికి చెందిన కె.మల్లారెడ్డి తాను మంత్రి బంధువు స్నేహితుడినని, ఇసుక రీచ్‌లు ఇప్పిస్తానని ఇసుక వ్యాపారుల నుంచి రూ.63 లక్షలు వసూలు చేశాడు. చివరకు గత జూలై 7న పోలీసులకు చిక్కాడు. మల్లారెడ్డి హైదరాబాద్‌లో ప్రాంతాల్లో కొంతమంది నిరుద్యోగుల నుంచి సైతం జెన్‌కోలో ఉద్యోగాలు పెట్టిస్తానంటూ డబ్బులు చేసి మోసం చేశాడు. ఇవి పోలీసుల అరెస్టుతో బయటపడ్డవి మాత్రమే. ఇంకా వెలుగులోనికి రానివారు ఎందరో ఉండొచ్చని అనుమానాలు కలుగుతున్నాయి. ఉద్యోగాలు రాక నిరాశగా ఉండే నిరుద్యోగులను అసరా చేసుకొని ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.



నిరుద్యోగులు మోసపోవద్దు..

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా డబ్బులు అడిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అసలు ఉద్యోగాలు ఉన్నాయా.. లేదా.. అనే విషయాలు తెలుసుకోకుండా డబ్బులు ఇచ్చి మోసపోవద్దు. నేరుగా సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలి. ఒకవేళ ఉద్యోగాలు ఉన్నప్పటికీ డబ్బులు అడిగితే వారిపై చర్యలు తీసుకుంటాం. నిరుద్యోగులు ఎవరైనా ఫోన్ చేసినప్పుడు జాగ్రత్తగా ఉండాలి. తొందరపడి మోసగాళ్లు చెప్పే మాటలను నమ్మకూడదు.

– నర్సింహారెడ్డి, ఆదిలాబాద్ డీఎస్పీ

- గతేడాది జనవరి 9న సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి అమాయకుల నుంచి డబ్బులు వసూలు చేసిన బెల్లంపల్లికి చెందిన సంతోష్‌ను రెబ్బెన పోలీసులు అరెస్టు చేశారు. వృత్తిరీత్యా సింగరేణి ఉద్యోగి అయిన సంతోష్ గోలేటికి చెందిన ఆటోడ్రైవర్ అశోక్ నుంచి రూ.6.75 లక్షలు వసూలు చేశాడు.
- మంత్రి కుమారుడిని మాట్లాడుతున్నానంటూ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెన్నూర్ మండలం కొమ్మెర గ్రామానికి చెందిన జనగం సమ్మయ్య నిరుద్యోగులకు గాలం వేశాడు. ఇందులో భాగంగానే ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ముజాయిద్‌ఖాన్‌కు ఫారెస్టు బీట్ ఆఫీసర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.7 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అడ్వాన్స్‌గా సదరు యువకుడు రూ.2.15 లక్షలు ముట్టచెప్పాడు. మిగతా డబ్బుల కోసం డిసెంబర్ 26న ఆదిలాబాద్‌కు వచ్చిన సమ్మయ్యను పోలీసులు అరెస్టు చేయడంతో అసలు విషయం బయటకొచ్చింది. సమ్మయ్య గతంలో కూడా ఎంతో మంది ఉద్యోగులను, భూములు ఇస్తామని లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేశాడు.

మద్యం తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్



పట్టుబడిన మద్యం, నిందితులను చూపిస్తున్న జీఆర్పీ పోలీసులు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల నుంచి మహారాష్ట్రకు అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను మంచిర్యాల జీఆర్పీ పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్ఐ జితేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మంచిర్యాల రైల్వే స్టేషన్లో ఒకటో నెంబర్ ప్లాట్ ఫాంపై సోమవారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులు మహారాష్ట్రకు చెందిన తిరుపతి వ్యాంకటి దండేకర్, అతీశ్ అశోక్‌కుమార్, మరో బాలుడిని జీఆర్పీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా అజ్ని ప్యాసింజర్ రైలు ద్వారా అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 280 మద్యం బాటిల్స్ సుమారు రూ. 19 వేల విలువైన మద్యం స్వాదీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి కాజిపేట రైల్వే కోర్టుకు రిమాండ్ చేశారు. ఈ తనిఖీల్లో జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ జగన్, రాజాగౌడ్ సిబ్బంది ఉన్నారు.

డెంగీ జ్వరంతో ఒకరి మృతి

- వివాహమైన ఆర్నెళ్లకే విషాదం
- మిన్నంటిన రోదనలు

ఆర్నెళ్ల క్రితం ఓ పేదింట్లో వేడుక.. కుటుంబ సభ్యులంతా కలిశారు. నూతన జంటను ఆశీర్వదించారు. ఆ కుటుంబం ఆనంద క్షణాల్ని మరిచిపోకముందే ఆ ఇంట్లో విషాదం.. ఆర్నెళ్ల కిత్రం వివాహం చేసుకున్న యువకుడిని డెంగ్యూ కబలించింది. శోక సంద్రంలో కుటుంబీకులు మునిగిపోయారు.



హనోక్(ఫైల్)

ఆసిఫాబాద్‌క్రైం: మండలంలోని రవిచంద్ర కాలనీకి చెందిన వస్తం హనోక్(22) మంగళవారం డెంగ్యూ జ్వరంతో మృతి చెందాడు. హనోక్ కొన్నేళ్లుగా మండలంలో స్క్రాప్ కొని అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. అంతే కాకుండా ఓ విద్యార్థి సంఘంలో హనోక్ కీలకంగా వ్యవహరిస్తున్నాడు. ఆర్నెళ్ల క్రితం జిల్లాకు చెందిన ప్రమీలతో వివాహం జరిగింది. వారం రోజులుగా డెంగ్యూ జర్వం రావడంతో అతడిని డిసెంబర్ 31న కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్సను అందించారు. చికిత్స పొందుతున్న క్రమంలో పరిస్థితి విషమించి మంగళవారం హనోక్ మృతి చెందాడు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

తలమడుగు(బోథ్): బీంపూర్ మండలం బేల్సరి రాంపూర్ గ్రామానికి చెందిన నాగోరావు(40) భార్య మందలించిందని పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. నాగోరావు కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈనేపథ్యంలో 'ఇంట్లో చిన్న పిల్లలు ఉన్నారు. మద్యం తాగితే ఎలా పిల్లలను ఎలా పోషిస్తావు. కుటుంబ పోషణ ఎలా' అని భార్య లక్ష్మి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన నాగోరావు మద్యం మత్తులో బయటికెళ్లి పురుగుల మందు తాగి ఇంటికొచ్చాడు. తెల్లవారి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లేశ్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమర్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు.

నిల్వ ఉంచిన కలప పట్టివేత

సారంగపూర్(నిర్మల్): సారంగపూర్ మండలం నాగపూర్ తండాలో తరలించడానికి సిద్ధంగా ఉంచిన కలపను మంగళవారం ఎఫ్ఎస్‌వో ఖదీర్ స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగాపూర్ తండాలో తరలించడానికి సిద్ధంగా ఉంచిన కలప దుంగలు నిల్వ ఉంచారని వచ్చిన సమాచారం మేరకు ఎఫ్ఎస్‌వో ఖదీర్, ఎఫ్‌బీవో అన్నపూర్ణ నాగాపూర్ తండాకు చేరుకున్నారు. తండా పరిసరాల్లో సోదాలు నిర్వహించగా అక్కడ పొదల మాటున లభ్యమైన 26 కలప దుంగలను గుర్తించి వాటిని జామ్ గ్రామంలోని అటవీ అధికారి నివాసానికి తరలించారు. వీటి విలువ రూ. లక్షా 20 వేలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య



రమాదేవి మృతదేహం

లక్సెట్టిపేట(మంచిర్యాల): లక్సెట్టిపేట మండలం అంకతిపల్లి గ్రామానికి చెందిన వివాహిత ఎంబడి రమాదేవి(28) సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గంపలపల్లి గ్రామానికి చెందిన రమాదేవికి అంకతిపల్లికి చెందిన ఎంబడి అంజయ్యకు పన్నెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. గత కొద్ది రోజుల నుంచి అంజయ్య తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో సోమవారం మద్యం సేవించి రాత్రి ఇంటికి వెళ్లాడు. నూతన సంవత్సరం రోజున కూడా మద్యం తాగొచ్చావని రమాదేవి భర్తను మందలించింది. దీంతో ఇద్దరి మధ్య చిన్న తగాదా జరిగింది. మనస్తాపానికి గురైన రమాదేవి సోమవారం రాత్రి పది గంటలకు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబీకులు మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ రమాదేవి మృతి చెందింది. మృతురాలు తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సమ్మయ్య తెలిపారు.

చర్చిలో అగ్ని ప్రమాదం



కాలిపోయిన గృహోపకరణాలు

ఆసిఫాబాద్‌రూరల్: పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలోని భేతనీయ చర్చిలో మంగళవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగింది. దట్టమైన పొగలు వ్యాపించడంతో స్థానికులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న ఫైర్ సిబ్బంది సకాలంలో మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రిఫ్రిజిరేటర్, డ్రెస్సింగ్ టేబుల్ కాలిపోయాయి. రూ.20 వేలు ఆస్తి నష్టం వాటిల్లింది.

వాతావరణం

రానున్న 24 గంటల్లో అండమాన్, నికోబార్ దీవుల్లో ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈశాన్య రాష్ట్రాలు, తమిళనాడు, కేరళల్లోని దక్షిణ తీర ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. ఉత్తర, వాయవ్య భారతం, తూర్పు రాష్ట్రాలు, ఢిల్లీలో దట్టమైన నుంచి అతి దట్టమైన పొగ మంచు ఆవరించి ఉంటుంది. వాయవ్య భారతంలో చలిగాలులు వేచే అవకాశం ఉంది.

గుంటూరు వాతావరణం / ఆదిలాబాద్ వాతావరణం

గరిష్టం కనిష్టం

33.0°/15.2° / 30.1°/07.4°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	17.7	08.4
కోల్‌కతా	24.8	15.0
బెంగళూరు	29.0	17.8
ముంబై	28.7	14.1
చెన్నై	30.6	22.4

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
అనంతపురం	33.2/17.3	విజయవాడ	30.2/20.0
గుంటూరు	33.0/15.2	వరంగల్	30.1/16.0
కర్నూలు	32.5/18.7	ఆదిలాబాద్	30.1/07.4
మహబూబ్‌నగర్	32.3/18.0	ఏలూరు	29.8/20.9
కడప	32.2/18.0	రాజమండ్రి	29.8/20.9
ఒంగోలు	31.6/22.1	తాడేపల్లిగూడెం	29.8/20.9
నెల్లూరు	31.5/22.5	కాకినాడ	29.7/21.5
మెదక్	31.3/12.0	హైదరాబాద్	29.6/15.8
చిత్తూరు	31.2/18.4	రంగారెడ్డి	29.6/15.8
తిరుపతి	31.2/18.4	నల్లగొండ	29.4/15.0
ఖమ్మం	31.0/14.4	విశాఖపట్నం	29.0/21.4
నిజామాబాద్	30.9/14.8	శ్రీకాకుళం	27.0/17.5
కరీంనగర్	30.5/13.3	విజయనగరం	27.0/17.5

బుల్లితెర

www.sakshi.com

SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 గుడ్ మార్నింగ్
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.08.30 న్యూస్ ఫీచర్
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.00 సాక్షి న్యూస్
ఉ.10.30 న్యూస్ ఫీచర్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజీన్ స్టోరీ
రా.10.30 స్క్రీన్‌ప్లే
రా.11.30 న్యూస్ ఫీచర్

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 పాండు
ఉ.09.30 కొడుకు
మ.12.00 అన్నయ్య
సా.06.00 నాయకుడు
రా.09.00 శ్రీరామ్



మూవీస్ నౌ
ఉ.08.55 థోర్
మ.01.35 ద మాస్క్
మ.03.15 డై అనదర్ డే
సా.05.30 ఫైనల్ డెస్టినేషన్ 3
రా.09.00 రష్ అవర్ 3




హెచ్‌బీవో
ఉ.06.00 మునిచ్
ఉ.08.47 ద అకౌంటెంట్
మ.01.47 టవర్ ఆఫ్ డెత్
సా.05.01 ఐరన్ మ్యాన్
రా.09.00 సూసైడ్ స్క్వాడ్



స్టార్ మూవీస్
ఉ.08.16 ద వోల్వరిన్
ఉ.10.40 జూటాపియా
మ.12.38 ప్రిడేటర్
సా.04.43 కుంగ్‌ఫు పాండా 3
రా.09.00 స్పైడర్-మ్యాన్



మా మూవీస్
ఉ.07.00 రామదండు
ఉ.09.00 ఎస్.పి.పరశురాం
మ.12.00 మొదటి సినిమా
సా.06.00 నువ్వు లేక నేను లేను
రా.09.00 మన్మథ



జీ సినిమా
ఉ.04.45 షాదీ సే పెహ్లే
ఉ.08.30 దిల్‌దార్: ద ఆర్య
ఉ.11.28 హసీనా మాన్ జాయేగీ
రా.09.00 బిజినెస్‌మ్యాన్ 2
రా.11.54 త్రిపుర

తిరుమల సమాచారం

తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు	–	ఖాళీ లేవు
రూ.50 గదులు	–	05 ఖాళీ
రూ.100 గదులు	–	20 ఖాళీ
రూ.500 గదులు	–	ఖాళీ లేవు

సేవలు

సహస్ర దీపాలంకరణ	–	ఖాళీ లేవు
వసంతోత్సవం	–	ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం	–	ఖాళీ లేవు

బుధవారం ప్రత్యేక సేవ : సహస్రకలశాభిషేకం



బాసర ఆలయ సమాచారం

బాసర : అన్నదానం రోజు 12.30 గంటలకు ప్రారంభం

శ్రీసరస్వతీ అమ్మవారి ఆలయంలో నిత్యపూజలు ..దర్శన వేళలు

ఉదయం : 04.00 దేవాలయం తెరుచుట, 07.30 గం॥ వరకు శ్రీ అమ్మవారి అభిషేకం, అలంకరణ, హారతి, ప్రసాదాల వితరణ 07.30–12.30గం వరకు సర్వదర్శనం

మధ్యాహ్నం: 12గం॥–12,30 గ॥ వరకు నివేదన హారతి, 12.30 నుండి 2 వరకు ద్వారబంధనం, 2 గంటల నుంచి 6 గంటల వరకు సర్వదర్శన, ఇతర పూజలు


సాయంత్రం : 6.30నుంచి ప్రదోషపూజ, 10.30 గంటలకు మహా– హారతి తీర్థప్రసాదం, ద్వారబంధనం, ఇతర పూజలు

అమ్మవారి ఆలయంలో ముఖ్య పండుగలు

శ్రీవ్యాసపౌర్ణమి–దసరా నవరాత్రోత్సవాలు
శ్రీ వసంత పంచమి – మహాశివరాత్రి

ఫోన్ నంబర్లు ....

గదుల కొరకు	08752–255503
ఈవో కార్యాలయం	255550
కార్యనిర్వహణాధికారి	255903
రైల్వేస్టేషన్	255504
పోలీస్ స్టేషన్	255120
వైశ్యసత్రం	255521
బ్రాహ్మణ సత్రం	255522







Padi-Panta

రబీలో మొక్కజొన్న సాగు

చెన్నూర్‌రూరల్: రబీ సీజన్‌లో రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకుంటే మంచి లాభాలు ఉంటాయి. రైతులు ప్రతీ ఏటా రబీలోఎక్కువగా మొక్కజొన్న సాగువైపు దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే మొక్క జొన్న పంటలను రైతులు కొన్ని ప్రాంతాలలో సాగు చేశారు. మొక్క జొన్న పంట సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో ప్రేమ్‌కుమార్ వివరించారు.



సాగవుతున్న మొక్కజొన్న

ప్రేమ్‌కుమార్, ఏవో, చెన్నూర్

కలుపు యాజమాన్యం..

మొక్కజొన్నలో పంట విత్తిన తర్వాత రెండ్రోజుల్లోపు, అట్రజిన్ కలుపు మందును తేలిక పాటి నేలలో 800 గ్రాములు, బరువు నేలలో 1200 గ్రాములు, 200 లీటర్ల నీటిలో కలిపి విత్తనాలు విత్తిన నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. ఇది వెడల్పాటి ఆకుల కలుపును, గడ్డిజాతి కలుపును నెల వరకు మొలవకుండా అదుపు చేస్తుంది. విత్తనాలు విత్తిన నెల రోజుల తర్వాత వెడల్పాటి కలుపు మొక్కలు ఉంటే, 2,4–డి సోడియం సాల్ట్‌ను ఎకరాకు 500 గ్రాములు, 200ల లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. విత్తనాలు విత్తిన 30–35 రోజులకు అంతర కృషి చేస్తే కలుపును నివారించడంతో పాటు మొక్క కుదుళ్లకు మట్టి చేరి మొక్క దృఢంగా ఎదుగడానికి ఉపయోగపడుతుంది. మొక్క జొన్న పంటకు ముఖ్యంగా నాలుగు తెగుళ్ల ఆశిస్తాయి. ఇందులో కాండం తొలిచే తెగులు, తుప్పు తెగులు, కాండం కుళ్లు తెగులు, పాము పొడ తెగులు ఆశిస్తాయి. సస్య రక్షణ చర్యలు చేపడితే పంటను కాపాడు కోవచ్చు.

సస్యరక్షణ చర్యలు..

మొక్కజొన్నకు ముఖ్యంగా కాండం తొలిచే పురుగు ఆశిస్తుంది. మొలకెత్తిన 10–15 రోజుల మొక్కలను ఈ పురుగు ఆశిస్తుంది. పిల్లపురుగులు మొదట ఆకులను గోకి పత్రహరితాన్ని తింటాయి. తర్వాత ముడుచుకొని ఉన్న ఆకులను రంధ్రం చేసుకొని కాండం లోనికి దూరుతాయి. ఆకులు విచ్చుకున్న తర్వాత గుండ్రటి రంధ్రాల వరుసను ఆకులకు అడ్డంగా గమనించవచ్చును. దీని లార్వాలు ఎదిగే అంకురాన్ని తినడం వలన మొవ్వు చని పోయి మొక్క ఎండి పోతుంది. కాండం లోపలే ఈ పురుగు ఉంటూ కాండాన్ని తింటూ సొరంగం ఏర్పరుచుకొని మొక్క ఎదుగుదలను క్షీణింపజేసి దిగుబడిని తగ్గిస్తుంది. దీని నివారణకు పొలం చుట్టూ 2–4 వరుసలలో జొన్న పంటను ఎరపంటగా సాగు చేసి 45 రోజుల తర్వాత జొన్న పంటను తీసేయాలి. ఇలా చేయడం ద్వారా నివారించవచ్చు. మోనోక్రోటోఫాస్ 36 ఎస్ఎల్ ఎకరాకు 400ఎంఎల్ ద్రావణాన్ని 200ల లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరాకు నాలుగు కిలోల చొప్పున ఆకుల సుడులలో వేయడం ద్వారా నివారించవచ్చు. ఆకులపై రెండు వైపులా గుండ్రని లేక పొడవాటి గోధుమ రంగు వర్ణపు పొక్కుల మాదిరిగా తుప్పు తెగులు లక్షణాలు కనిపిస్తాయి. పంట పెరగిన కొద్ది ఆకులపైన పొక్కుల గోధుమ రంగు వర్ణం నుంచి నలుపు వర్ణానికి మారుతాయి. పూత సమయంలో తెగులు లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి.

చలికాలంలో తెగులు ఉధృతి..

అధిక తేమ(చలి కాలంలో) వాతావరణంలో తెగులు ఉధృతి, వ్యాప్తి చెందుతుంది. దీని నివారణకు మాంకోజెబ్ ఎకరాకు 500గ్రాములు 200లీటర్ల నీటికి కలిపి తెగులు తీవ్రతను బట్టి ఒకటి లేక రెండు సార్లు పిచికారి చేస్తే అరికట్ట వచ్చు. నేలలోని శిలీంద్రాలు మొక్కల వేర్ల ద్వారా కాండం కుళ్లు తెగులు కాండం పై భాగానికి వ్యాపిస్తుంది. కాండంపై గోధుమరంగు చారలు ఏర్పడుతాయి. ఈ తెగులు వలన పంటకోత దశకు రాకముందే కాండం బాగం విరిగి మొక్కలు నేలకొరుగుతాయి. తెగులు ఎక్కువగా సోకే ప్రాంతాలలో పంట చేసే ముందు పచ్చిరొట్ట పైరును సాగుచేసి నేలలో కలియదున్నాలి. కాండంపై ఏర్పడిన తెగులు లక్షణాలు వలన కణువుల వద్ద మొక్కలు విరిగి నేలపై పడి పోతాయి. తెగులును కలుగజేసే శిలీంద్రం మొక్కల అవశేషాలలో, కలుపు మొక్కలపై జీవించి ఉంటాయి. దీని నివారణకు నేలకు దగ్గరగా ఉన్న తెగులు సోకిన ఒకటి లేక రెండు ఆకులను తీసి వేయాలి. 200 గ్రాముల కార్బండైజమ్ లేక 200 మిల్లీ లీటర్ల ప్రోపికొనజోల్ మందును 200ల లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేస్తే నివారించవచ్చు. 10 రోజుల వ్యవధిలో రెండవ సారి మందును పిచికారీ చేస్తే ఏ తెగులునైనా, ఏ కీటకాలనైనా సమర్థవంతంగా అరికట్టి పంటను రక్షించుకోవచ్చు.



చికెన్ (సుగుణ)	స్కిన్	స్కిన్‌లెస్
	120	140

భవిష్యం

మేషం: వ్యయ ప్రయాసలు. బంధువులతో మాటపట్టింపులు. దేవాలయాలు సందర్శిస్తారు. అనుకోని ఖర్చులు. వృత్తి, వ్యాపారాలలో ఇబ్బందులు.

వృషభం: కొత్త కార్యక్రమాలకు శ్రీకారం. శుభవార్తలు. మిత్రుల నుంచి ధనలాభం. విలువైన వస్తువులు సేకరిస్తారు. వ్యాపారాలలో లాభాలు. ఉద్యోగులకు పనిభారం తగ్గుతుంది.

మిథునం: ఆదాయానికి మించి ఖర్చులు చేస్తారు. పనుల్లో జాప్యం జరగవచ్చు. కష్టపడ్డా ఫలితం ఉండదు. కుటుంబ సభ్యులతో విభేదాలు రావచ్చు. వ్యాపార, ఉద్యోగాలు మందకొడిగా సాగే అవకాశం ఉంది.



కర్కాటకం: విద్యార్థులకు అనుకూల సమాచారం. విందువినోదాలు. కార్యసిద్ధి. పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలలో ఊహించని లాభాలు. ఉద్యోగులకు పదోన్నతులు.

సింహం: మిత్రులతో కలహాలు. కొత్త రుణాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు. పనుల్లో ఆటంకాలు. వ్యాపారాలు, ఉద్యోగాలు నిరాశ పరుస్తాయి.

కన్య: దూరపు బంధువుల కలయిక. విందు వినోదాలు. చిన్ననాటి సంఘటనలు గుర్తుకు వస్తాయి. శుభవార్తలు. వృత్తి, వ్యాపారాలు సాఫీగా సాగుతాయి.

తుల: సన్నిహితులతో వివాదాలుసర్దుబాటు కాగలవు. ఆర్థికాభివృద్ధి. పనుల్లో పురోగతి. శుభకార్యాలకు హాజరవుతారు. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూలత.

వృశ్చికం: ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. వ్యయప్రయాసలు. కుటుంబసభ్యులతో వివాదాలు. వృత్తి, వ్యాపారాలు సాధారణంగా ఉంటాయి.

ధనుస్సు: మిత్రులతో మాటపట్టింపులు. శ్రమాధిక్యం. పనులు ముందుకు సాగవు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. వృత్తి, వ్యాపారాలలో చికాకులు పెరుగుతాయి.

మకరం: ఇంటాబయటా అనుకూలం. కొత్త విషయాలు తెలుసుకుంటారు. పరిచయాలు పెరుగుతాయి. ఉద్యోగులు సమర్థత చాటుకుంటారు. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి.

కుంభం: వ్యవహారాలలో విజయం. ఆహ్వానాలు రాగలవు. ఆస్తి వివాదాల నుంచి విముక్తి. సంఘంలో గౌరవం. వ్యాపారాలు, ఉద్యోగాలలో కొత్త అవకాశాలు.

మీనం: మిత్రులతో కలహాలు. దూర ప్రయాణాలు. కుటుంబంలో ఒత్తిడులు. ఆలయాల సందర్శన. వ్యాపారులకు ఒత్తిళ్లు. ఉద్యోగులు పనిభారంతో సతమతమవుతారు.

– సింహంభట్ల సుబ్బారావు

హలో సాక్షి..

మంచిర్యాల టౌన్(ఆర్సీ)	9010204423
మంచిర్యాల సిటీ	9603505050
మంచిర్యాల క్రైం	9704646937
మంచిర్యాల అర్బన్	9866342353
మంచిర్యాల అగ్రికల్చర్	9985600781
హాజీపూర్	9849248188
శ్రీరాంపూర్	9030777044
నస్పూర్	9177778751
లక్షెట్టిపేట	9849954456
దండేపల్లి	9963306884
జన్నారం	9492132722

సాక్షి మంచిర్యాల

బుధవారం | జనవరి | 3 | 2018



కలగానే డబుల్ బెడ్రూం

- లబ్ధిదారులు ఎంపికై రెండేళ్లు
- నిర్మాణాల కోసం ఎదురు చూపులు

దండేపల్లి: ప్రభుత్వ ఎన్నికల హామీ డబుల్ బెడ్రూం పథకం అమలు మండలంలో కలగానే మారింది. 2015 దసరా రోజు మండలంలోని రెబ్బనపలిలో డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్రావు భూమిపూజ చేశారు. 2016 ఫిబ్రవరిలో ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులు అధిక సంఖ్యలో రావడంతో డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక చేపట్టారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తయి రెండేళ్లు సమీపిస్తున్నా నేటికీ ఇండ్ల నిర్మాణాలు కలగానే మిగిలాయి. ఎంపికైన లబ్ధిదారులు ఇండ్ల కోసం ఎదురుచూస్తున్నారు.

లబ్ధిదారుల ఎదురుచూపులు..

మండలంలో డబుల్ బెడ్రూం ఇళ్ల పథకానికి ఏడు గ్రామాలను ఎంపిక చేసి 113 ఇండ్లు మంజూరు చేశారు. మొత్తం 1,437 మంది దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో లబ్ధిదారుల ఎంపిక అధికారులకు ఇబ్బందికరంగా మారింది. ఎంపిక ప్రక్రియను సజావుగా చేసేందుకు డ్రా పద్ధతి ఎంచుకున్నారు. డ్రా లో ఎంపికయిన వారికి ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు అధికారులు గ్రామసభలోనే ప్రకటించారు. అయితే ఏడు గ్రామాలు ఎంపిక చేసినప్పటికి అందులో కేవలం ఆరు గ్రామాల్లో మాత్రమే లబ్ధిదారుల ఎంపిక పూర్తయ్యింది. గూడెంలో ఇంకా లబ్ధిదారుల ఎంపిక చేపట్టలేదు. ఇక్కడ గ్రామసభ నిర్వహించినా పలువురు అడ్డుకోవడంతో పూర్తికాలేదు. నాలుగు గ్రామాల్లో స్థల పరిశీలన కూడా పూర్తయ్యింది. మిగతా మూడు గ్రామాల్లో ఇంకా స్థల పరిశీలన జరగలేదు.



రెబ్బనపల్లిలో రెండేళ్ల క్రితం భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్రావు(ఫైల్)

మండలంలో ఇండ్ల మంజూరు

గ్రామం	మంజూరు	దరఖాస్తులు
నర్సాపూర్	10 ఇండ్లు	109
దండేపల్లి	23	354
రెబ్బనపల్లి	15	245
కొర్విచెల్మ	20	268
కాసిపేట	12	102
గుడిరేవు	15	149
గూడెం	15	212

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు..

మండలంలో డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణానికి టెండర్లు పిలిచాం. కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో నిర్మాణాలు ఇంకా ప్రారంభించలేదు. మండలంలో ఎంపిక చేసిన గ్రామాల్లో ఒకటి, రెండు మినహా మిగతా గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది. అందుకు సంబంధించిన జాబితాలు మాకు అందించారు. కొన్ని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలకు స్థలాన్ని కూడా ఎంపిక చేశారు. మరోసారి టెండర్లు నిర్వహించి అవి పూర్తవగానే నిర్మాణాలు ప్రారంభిస్తాం.

– విక్రమ్, పీఆర్ఏఈ, దండేపల్లి

ఘనంగా శివముక్కోటి దర్శనం



పూజలు చేస్తున్న భక్తులు

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని విశ్వనాథస్వామి ఆలయంలో శివముక్కోటి ఉత్తరద్వార దర్శనానికి మంగళవారం భక్తులు తరలివచ్చారు. ఉదయం 6గంటల నుంచి విశ్వనాథుని ఉత్తర ద్వార దర్శనం ద్వారా దర్శించుకున్నారు. అష్టోత్తర నామస్మరణతో శివునికి అర్చన చేశారు. ఎమ్మెల్యే దివాకర్రావు ఉత్తర ద్వార దర్శనంతో మొక్కులు తీర్చుకున్నారు. ఆలయకమిటీ చైర్మన్ సిరిపురం శ్రీనివాస్, ఈవో వేణుగోపాల్, ఆలయ అర్చకులు నరహరిశర్మ, భట్టాచార్య, బాలకృష్ణ పాల్గొన్నారు.



ఉత్తర ద్వారం ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు

ఏ సమస్యలున్నా దృష్టికి తీసుకురావాలి

- ఎమ్మెల్యే దివాకర్రావు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు తన దృష్టికి తీసుకు రావాలని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్రావు సూచించారు. పట్టణంలోని పాతమంచిర్యాలలో మంగలవారం ఇంటింటికీ టీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అర్హులకు సక్రమంగా అందుతున్నాయా లేదా తాగునీటి సమస్యలపై వివరంగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు పల్లె రాజన్న, కోదాడి కమలాదేవి, ఏఎంసీ చైర్మన్ సాగి వెంకటేశ్వర్రావు, మాజీ చైర్మన్ పెంట రాజయ్య, యాదగిరిరావు, కోఆప్షన్ సభ్యుడు తోట తిరుపతి, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, కార్యదర్శి పెండ్లి అంజయ్య, నాయకులు తిరుపతి, దుర్గం రాజేశ్, బొలిశెట్టి కిషన్, చింతకింది మల్లయ్య, దర్ని శ్రీనివాస్, పెంట ప్రదీప్, శెట్టి శ్రీనివాస్, నవీన్, నరేష్, సతీశ్, రమేశ్యాదవ్, వంశీకృష్ణ, ప్రశాంత్, సాయిమధు, చక్రి, అరుణ్, పాల్గొన్నారు.



స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని సాయికుంటలో వొకేషనల్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం మంగళవారం నాలుగో రోజు కొనసాగింది. స్వచ్ఛ భారత్లో భాగంగా పరిసరాల– పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పడాల రామన్న, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇన్చార్జి శ్రీదేవి, సభ్యులు సంతోష్, రాజేశ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

అమ్మాయిలు ధైర్యంతో ముందుకెళ్లాలి

జన్నారం: అమ్మాయిలు వంటింటికే పరిమితం కాకుండా ధైర్యంగా ముందుకెళ్లాలని ఎస్సై తహసీనొద్దీన్ సూచించారు. సావిత్ర బాయి పూలే 187వ జయంతి సందర్భంగా మంగళవారం మండలంలోని కిష్టాపూర్ కస్తూరిబా పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 'సమాజంలో స్త్రీపాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొందరు విద్యార్థులు పదో తరగతి వరకే చదువుకుని వంటింటికే పరిమితమవుతున్నారని తెలిపారు. అలా కాకుండా పట్టుదలతో ఉన్నత చదువులు చదువుకుని మంచి ఉద్యోగం పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు రంజిత్కుమార్, నాయకులు సాయికుమార్, సురేందర్, రాజుకుమార్, పాఠశాల ప్రత్యేక అధికారి శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

- మూడు ఆటోలు, రెండు బైక్లు, నగదు స్వాధీనం

నస్పూర్: శ్రీరాంపూర్లోని ఆర్కే– 7 గని చెట్ల పొదల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని మంగళవారం సాయంత్రం అరెస్ట్ చేయగా మరో ముగ్గురు పారిపోయినట్లు ఎస్సై రవిప్రసాద్ తెలిపారు. పేకాట ఆడుతున్న శ్రీరాంపూర్ పరిసర ప్రాంతాలకు చెందిన గాజుల శ్రీనివాస్, కుర్మ సమ్మయ్య, గుండ్ల వెంకటి, గొడుగు రమేశ్, కొప్పుల సంతోష్ పట్టుబడ్డారు. రాజు, కుమార్, సురేష్ పరారీలో ఉన్నారని వెల్లడించారు. వీరి నుంచి రూ.16445, మూడు ఆటోలు, రెండు మోటర్ సైకిళ్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో

కేసీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం

దండేపల్లి: వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలోని కేసీఆర్ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు మంగళవారం క్షీరాభిషేకం జరిపారు. సీఎం వ్యసాయానికి నిరంతర విద్యుత్ను సరఫరా చేసి రైతుల కరెంటు కష్టాలు తీర్చారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల మంజుల, సర్పంచ్ కిషన్నాయక్, నాయకులు వెంకటేష్, మహేష్, రవీందర్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

అలరించిన సంగీత విభావరి

మంచిర్యాల అర్బన్: వికాస తరంగిణి ఆధ్వర్యంలో పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న రామానుజ కీర్తనలు ఆకట్టుకుంటున్నాయి. ధనుర్మాస వ్రతమహోత్సవములో భాగంగా గత నెల 12 నుంచి ఈనెల 14 వరకూ ఈ కార్యక్రమాలు చేపట్టారు. సోమవారం రాత్రి సాయి అంధుల పాఠశాల విద్యార్థులతో సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎంతగానో అలరించింది.



ప్రదర్శన ఇస్తున్న అంధ విద్యార్థులు

ఒకే ఈతలో రెండు దూడలు



దండేపల్లి: సాధారణంగా ఆవులు, గేదెలకు ఒక ఈతలో ఒకటే దూడ జన్మిస్తుంది. కానీ మండలంలోని రంగంపల్లెకు చెందిన రైతు రేణి కుమారస్వామి ఆవుకు మంగళవారం ఒకే ఈతలో రెండు దూడలు జన్మించాయి. దీనిని స్థానికులు వింతగా చూశారు. జన్యు పరివర్తన మార్పులతో ఇలా జరుగుతుందని మండల పశువైద్యాధికారి కిశోర్ తెలిపారు.

పాత కలెక్టర్లకు పోస్టింగ్

- ఆర్‌వీ.కర్ణన్‌కు జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు బాధ్యతలు

సాక్షి, ఆదిలాబాద్: ఆదివాసీ గిరిజనులు, లంబాడాల మధ్య తలెత్తిన వివాదంలో బదిలీ వేటు పడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కలెక్టర్లకు ప్రభుత్వం ఎట్టకేలకు పోస్టింగ్ ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పీ సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులోనే వారికి పోస్టింగ్ కల్పించింది. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన జ్యోతిబుద్ధ ప్రకాష్‌ను ఎస్సీ అభివృద్ధి శాఖ సెక్రెటరీగా నియమించారు. నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా పని చేసిన కే.ఇలంబరిదికి రాష్ట్ర సమాచార శాఖ సెక్రెటరీగా పోస్టింగ్ ఇచ్చారు. కుమురం భీం జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ఎం.చంపాలాల్‌ను హోంశాఖ (సైనిక సంక్షేమం) సంయుక్త కార్యదర్శిగా నియమించారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్‌ను ఇటీవల ప్రభుత్వం పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా నియమించిన విషయం తెలిసిందే. రెండు రోజులు అక్కడ బాధ్యతలు నిర్వహించిన ఆయన మంగళవారమే జిల్లా సమీక్ష సమావేశం కూడా నిర్వహించారు. తాజా బదిలీల్లో జనగామ జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న శ్రీదేవసేనను పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ ఏ.మురళిని ఆర్కియాలజి డిపార్టుమెంట్ డైరెక్టర్‌గా నియమించడంతో పాటు ఆ జిల్లా పూర్తి అదనపు బాధ్యతలను మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్‌కు అప్పగించారు.

చుక్కల దుప్పి హతం

జన్నారం(ఖానాపూర్): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం బీట్ పరిధిలోని గోండుగూడలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు చుక్కల దుప్పిని హతమార్చారు. సమాచారం అందగానే రేంజ్ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డీఆర్వో శ్రీరాంనాయక్, సెక్షన్ అధికారి ప్రకాశ్ అక్కడికి వెళ్లారు. దుప్పి మాంసం కోస్తున్న నిందితులు అధికారుల రాకను గమనించి మాంసాన్ని వదిలి పారిపోయారని రేంజ్ అధికారి తెలిపారు. మాంసాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం జరిపించి, నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు. అయితే దుప్పి మరో నాలుగు రోజుల్లో ప్రసవించేదని అధికారులు ద్వారా తెలిసింది.

ఖాందేవ్ జాతర షురూ..


ఖాందేవుని పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి


ఖాందేవ్ ఆలయం వద్ద సమావేశమైన తొడసం వంశస్తులు

- భారీగా తరలివచ్చిన తొడసం వంశస్తులు
- రెండు కిలోల నూనె తాగి మొక్కు తీర్చిన ఆడపడుచు
- పూజల్లో పాల్గొన్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నార్నూర్(ఆసిఫాబాద్): నార్నూర్ మండల కేంద్రంలో తొడసం వంశస్తుల ఆరాధ్య దైవం ఖాందేవు జాతర సోమవారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. పుష్య పౌర్ణమి సందర్భంగా ప్రతీ ఏడాది తొడసం వంశస్తులు సంప్రదాయం ప్రకారం డోలు వాయిద్యాల మధ్య పూజలు చేసి ప్రారంభించారు. వారం రోజులపాటు జాతర సాగనుంది. తొడసం వంశ ఆడపడుచు ఖాందేవునికి నైవేద్యంగా సమర్పించే రెండు కిలోల నువ్వుల నూనె తాగి మొక్కు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమం మంగళవారం ఉదయం నిర్వహించారు. దేవునికి నైవేద్యంగా సమర్పించే నువ్వుల నూనెను ఆదివాసీ గిరిజన పెద్దల ఇంటి వద్ద నెల రోజుల ముందు తయారు చేశారు. ఇంట్లో కట్టె మొద్దుపై రంధ్రం చేసి రోకలి కర్రతో అటూ ఇటూ తిప్పుతూ నువ్వులతో నూనె తయారు చేస్తారు. అలా తయారు చేసిన నూనెను దేవుడికి నైవేద్యంగా సమర్పించడానికి తీసుకొచ్చారు. తొడసం వంశంలోని ప్రతీ ఇంటి నుంచి నూనె సేకరించారు. అలా సేకరించిన రెండు కిలోల నూనెను దేవుని సన్నిధిలో మంగళవారం మండలంలోని ఖైర్‌డట్వా గ్రామానికి చెందిన తొడసం వంశ ఆడపడుచు మాడవి హన్మంతుబాయి తాగి మొక్కు తీర్చుకుంది. ఇలా చేయడం వల్ల సంతాన యోగం, కుటుంబంలో అందరికీ మంచి జరుగుతుందని వారి నమ్మకం. మూడేళ్లకోసారి తొడసం వంశానికి చెందిన ఆడపడుచు మారుతూ ఉంటారని, ఈ ఆచారం వందేళ్లుగా వస్తుందని ఆలయ పూజారి తొడసం ఖమ్ము పటేల్, తొడసం సోనేరావ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తొడసం వంశ పెద్దలు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఉట్నూర్ ఆర్డీవో జితేందర్‌రెడ్డి, ఎంపీపీ రాథోడ్ గోవింద్‌నాయక్, జెడ్పీటీసీ సభ్యురాలు రూపావతి జ్ఞానోబా పుస్కర్, ఎంపీడీవో శివలాల్‌నాయక్, సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, అడే సురేశ్, ఆలయ కమిటీ సభ్యులు తొడసం నాగోరావ్, గోపాల్, తుడందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు మేస్రం శేఖర్, తొడసం వంశీయులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్నా : మాడవి హన్మంతుబాయి

మా ఆచారం ప్రకారం ఖాందేవుని సన్నిధిలో నువ్వుల నూనె తాగుతున్నా. ఈ ఏడాదితో రెండో ఏడాది పూర్తయింది. రెండు కిలోల నూనె తాగడం వలన ఏమీ అనిపించదు. కుటుంబంతోపాటు అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, రైతులకు పాడిపంటలు బాగా పండాలని దేవుని కోరుకున్నా. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపైన ఉంది.

ఖాందేవునికి ఎమ్మెల్యే పూజలు

నార్నూర్(ఆసిఫాబాద్): పౌర్ణమి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తోడసం వంశస్థులు వారి ఆచార, వ్యవహారాల ప్రకారం సోమవారం రాత్రి ఖాందేవునికి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం వంశస్తులు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక సమావేశం అయ్యారు. ఒకరికొకరు వారి వారి సాదకబాధకాలు తెలుసుకొని ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఖాందేవ్‌నికి పూజలు చేశారు. దర్బార్‌లో మాట్లాడుతూ తరతరాల నుంచి వస్తున్న సంస్కృతిని కాపాడాలన్నారు. ఆలయ అభివృద్ధి కోసం సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆలయ ఆవరణలో మరుగుదొడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఉట్నూర్ ఆర్డీవో జితేందర్‌రెడ్డి, ఎంపీపీ రాథోడ్ గోవింద్ నాయక్, జెడ్పీటీసీ రూపావతిజ్ఞానోబా పుస్కర్, ఎంపీడీవో శివలాల్‌నాయక్, ఆలయ కమిటీ సభ్యులు మాన్కాపూర్ సర్పంచ్ తొడసం నాగోరావు, అడే సురేశ్, మార్కెట్ కమిటీ వైఎస్ చైర్మన్ రూప్‌దేవ్, దేవాలయం కమిటీ చైర్మన్ మెస్రం నానాజీ, తుడందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు మేస్రం శేఖర్, ఆలయ పూజారి ఖమ్ము పటేల్ ఉన్నారు.

ఒకే రోజు నాలుగు దొంగతనాలు


వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏసీపీ గౌస్‌బాబ


డాగ్ స్క్వాడ్‌తో ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు


డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

- 19 తులాల బంగారు ఆభరణాలు, రూ. 90వేలు నగదు చోరీ
- రంగంలోకి డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ నిపుణులు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్‌లో సోమవారం రాత్రి ఒకే రోజు నాలుగు ఇళ్లలో దొంగతనాలు జరిగాయి. ఈ ఘటన పట్టణ ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేసింది. పట్టణంలోని కాలేజీరోడ్‌లో ఉంటున్న కాసిపాక అంజయ్య, బండి శంకర్, విశ్వనాథ్, రాంమ్‌నగర్‌కు చెందిన గడ్డం చంద్రశేఖర్ ఇళ్లల్లో దొంగతనం జరిగింది. కాగా శంకర్, విశ్వనాథ్‌కు ఎలాంటి నష్టం జరగలేదు. కాసిపాక అంజయ్య ఇంట్లో సుమారు 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.90 వేలు నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. అంజయ్య కుటుంబ సభ్యులతో కలిసి ఇంద్రవెల్లిలో ఉంటున్న తన కూతురు జ్యోస్న అల్లుడు గంగారాం (ఇంద్రవెల్లి ఎస్సై) దగ్గరికి జనవరి 1న వెళ్లినట్లు తెలిపారు. అంజయ్యకు ఇంటి దగ్గరలో ఉంటున్న వారు మంగళవారం ఉదయం ఫోన్ చేసి ఇంటి తాళం పగులగొట్టి ఉందని సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. దొంగతనం జరిగిన నాలుగు ఇండ్లను ఏసీపీ గౌస్‌బాబ సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చంద్రశేఖర్ ఇంట్లో 4 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. విశ్వనాథ్ తన కుటుంబ సభ్యులతో కలిసి జనగామలోని అత్తగారింటికి వెళ్లారు. శంకర్ హైదరాబాద్‌లో ఉంటున్నారు. అప్పుడప్పుడు మంచిర్యాలకు వచ్చి ఉంటారు. చంద్రశేఖర్ అమ్మను హైదరాబాద్ ఆసుపత్రికి రెండు రోజుల క్రితం తీసుకెళ్లారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పట్టణ సీఐ వేణుచందర్ తెలిపారు.

రంగంలోకి డాగ్ స్క్వాడ్...

ఒకే రోజు నాలుగిళ్లలో జరిగిన దొంగతనంపై పోలీసులు డాగ్ స్వాడ్, ఫింగర్ ప్రింట్ నిపుణులను రంగంలోకి దించారు. నాలుగు చోరీలు ఒక్కరే చేశారని పోలీసులు భావిస్తున్నారు. చోరీ జరిగిన నాలుగు ఇండ్లల్లో డాగ్‌స్క్వాడ్ బృందం పరిశీలించింది. ఫింగర్ ప్రింట్ నిపుణులు వేలి ముద్రలు సేకరించారు.



పంచ్ పడితే పతకమే!

- ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో రాణిస్తున్న తెలుగుతేజం
- సూపర్ బాక్సింగ్ లీగ్‌లో ఉత్తమ ప్రతిభ
- దేశసేవ చేస్తూనే క్రీడల్లో రాణిస్తున్న జవాన్
- ఒలింపిక్స్ పతకమే లక్ష్యమంటున్న వెంకటేశ్వర్లు



సాధించిన పతకాలతో వెంకటేశ్వర్లు..

ఎక్కడో మారుమూల తండాలో పుట్టిన ఆ యువకుడు అంతర్జాతీయ స్థాయి బాక్సర్‌గా ఎదిగాడు. దేశసేవ కోసం సైనికుడైనా.. తాను నేర్చుకున్న బాక్సింగ్‌ను వదల్లేదు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి మండలం డొక్కలబావి తండాకు చెందిన సఫావత్ వెంకటేశ్వర్లు ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో మన రాష్ట్రానికి పతకాల పంట పండిస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు.

- తిరుమలగిరి నుంచి అశోక్

ఆర్మీలో పనిచేస్తూనే..

నల్లగొండలోని మార్కొని ఐటీఐ కళాశాలలో చదువుతున్న సమయంలోనే బాక్సింగ్ వైపు మళ్లాడు వెంకటేశ్వర్లు. అప్పట్లో వన్‌టౌన్ ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న జిలానీ.. వెంకటేశ్వర్లుకు అండగా నిలిచారు. చదువుకు అవసరమైన పుస్తకాలతోపాటు, బాక్సింగ్ కోచింగ్‌కు అన్ని విధాలా సాయం చేశారు. దీంతోపాటు మల్లేష్ మాస్టర్ వద్ద కోచింగ్‌తో మిషన్ ఆన్ రింగ్‌గా మారాడు. వివిధ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు గెలిచే స్థాయికి ఎదిగాడు. రెండుసార్లు ప్రొఫెషనల్ ఛాంపియన్‌షిప్‌లో ప్రపంచ చాంపియన్ అయిన అమీర్‌ఖాన్ చేతుల మీదుగా పతకాలు అందుకున్నాడు వెంకటేశ్వర్లు. రక్షణ శాఖలో జవాన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు, సెలవుల్లో బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుంటూ వివిధ వేదికలపై రాణిస్తున్నాడు.

అంతర్జాతీయ స్థాయికి..

- ఇటీవల ఢిల్లీలో జరిగిన సూపర్ బాక్సింగ్ లీగ్‌లో 57.5 కేజీల కేటగిరీలో సిల్వర్ మెడల్ సాధించాడు. సినీనటులు సునీల్‌శెట్టి, రాణాల బాహుబలి బాక్సింగ్ టీమ్‌లో దక్షిణ భారతదేశం నుంచి ప్రాతినిథ్యం వహించిన ఏకైక ఆటగాడిగా గుర్తింపు పొందాడు.
- మూడుసార్లు ఆలిండియా నేషనల్ చాంపియన్ షిప్‌లో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించాడు. 2013లో తమిళనాడు కాట్‌పాడ్‌లో సౌత్‌జోన్ చాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్ పొందాడు.
- వెస్ట్‌బెంగాల్ దుర్గాపూర్‌లో జరిగిన ప్రెసిడెంట్ కప్‌లో ప్రతిభ చూపాడు.



ప్రొఫెషనల్ బాక్సింగ్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జనవరి 15 నుంచి 30 వరకు బ్యాంకాక్‌లో 52 కేజీల విభాగంలో జరిగే ట్రైనింగ్ కమ్ ఫైట్‌కు అర్హత సాధించాడు వెంకటేశ్వర్లు. ఈ పోటీల్లో దేశం తరపున కేవలం ఇద్దరికి మాత్రమే చోటు దక్కింది. వెంకటేశ్వర్లు ట్రైనింగ్ కమ్ ఫైట్‌లో విజయం సాధించాలని ఆశిద్దాం.



అందని ద్రాక్ష!

> ద్రాక్ష అధికంగా సాగయ్యే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. ముఖ్యంగా ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో విస్తృతంగా పండించే వారు. అయితే కొన్నేళ్లుగా రైతులు ద్రాక్ష సాగుకు దూరంగా జరుగుతూ వస్తున్నారు.

> ఐదారేళ్ల క్రితం వరకు ఇక్కడి ద్రాక్షను విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. ఇప్పుడు దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రాష్ట్రంలో గణనీయంగా తగ్గిపోయిన ద్రాక్ష సాగు.. సంక్రాంతి తర్వాత మార్కెట్‌లోకి మహారాష్ట్ర సరుకు

గజ్వేల్ నుంచి యెన్నెళ్లి సురేందర్:

తెలంగాణలో ద్రాక్ష సాగుకు ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాలే ఆధారం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కూడా కొంత విస్తీర్ణం సాగయ్యేది. మొత్తంగా యేటా 50వేల ఎకరాలకుపైగా తోటలు సాగులోకి వచ్చేవి. ప్రత్యేకించి ఉమ్మడి మెదక్ జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గం ద్రాక్ష సాగులో సింహభాగాన్ని ఆక్రమించేది. విదేశాలకు ఎగుమతి చేసే సీడ్‌లెస్ థామ్సన్, తాజ్‌గణేష్ రకాలు ఈ ప్రాంత రైతులు ప్రధానంగా సాగుచేసేవారు. విదేశాలకే కాకుండా కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు కూడా ద్రాక్ష ఎగుమతయ్యేది. కానీ ఈ ఏడాది దిగుమతి చేసుకోవాల్సిందే.

మహారాష్ట్ర నుంచి 'ద్రాక్ష'..

మహారాష్ట్రలో జనవరి మొదటి వారం నుంచి తోటలు కోతకు వస్తుంటాయి. తెలంగాణ జిల్లాల్లో ఫిబ్రవరి చివరి వారంలో కోతకు వస్తాయి. ఒకవేళ ఇక్కడ అడపాదడపా థామ్సన్, తాజ్‌గణేష్ రకాలు సాగు చేసినా అవి గోళీల్లా గుండ్రంగా ఉంటాయి. కానీ మహారాష్ట్రలో సూపర్ సోనాక, మానిక్‌చమన్ లాంటి రకాలు చిటికన వేలు ఆకారంలో ఉండి మార్కెట్‌లో వినియోగదారుల్ని బాగా ఆకర్షిస్తున్నాయి. వీటి దెబ్బకు మన ద్రాక్ష తట్టుకోలేదు.

గణనీయంగా పడిపోయిన సాగు విస్తీర్ణం

2007, 2008 సంవత్సరాల్లో వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా కోట్లల్లో నష్టపోయిన రైతులు ద్రాక్ష సాగంటేనే జంకే పరిస్థితి నెలకొన్నది. తెలంగాణలో అప్పట్లో 50,000 ఎకరాలకుపైగా ద్రాక్ష తోటలు సాగులోకి వస్తే... ప్రస్తుతం ఉమ్మడి మెదక్ జిల్లా, రంగారెడ్డి జిల్లా కలుపుకొని వెయ్యి ఎకరాలు కూడా సాగులోకి రావడం లేదు. ద్రాక్షతోటల స్థానంలో కాస్త లాభసాటిగా ఉండే కూరగాయల సాగుపై దృష్టి సారించారు. సంక్రాంతి తర్వాత మహారాష్ట్ర సరుకు మార్కెట్‌లోకి వచ్చే అవకాశముంది. ఈ ఏడాది కిలో ధర రూ.60 వరకు పలకనుందని అంచనా.

> ఉదాహరణకు గజ్వేల్ నియోకవర్గంలో 2008లో **1500** ఎకరాల్లో ద్రాక్ష సాగులో ఉండగా అది 2009, 2010లో **150** ఎకరాలకు తగ్గిపోయింది. 2013–14లో **40** ఎకరాలకు పడిపోయింది. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి నెలకొన్నది. ఉమ్మడి మెదక్ జిల్లా మొత్తంగా చూస్తే సాగులో ఉన్నది వంద ఎకరాల్లోపే. ఇక్కడ తొమ్మిదేళ్లక్రితం మూడు వేల ఎకరాల్లో 'ద్రాక్ష' సాగైంది.

2006 వరకు ఓకే.. ఆ తర్వాతే..

ఎకరా ద్రాక్ష తోట సాగు చేయాలంటే పదేళ్ల క్రితం కూలీలు, ఎరువులు, ఫంగీసైడ్స్, ఇతర అవసరాలు కలుపుకొని రూ. రెండు లక్షల వరకు పెట్టుబడి అయ్యేది. ప్రస్తుతం ఇది రెట్టింపైంది. ఇంత భారీ పెట్టుబడి పెట్టినా 2006 వరకు రైతులు లాభాలే గడించారు. 2007 నుంచి ద్రాక్ష తోటల సాగుకు సంబంధించి సీను ఒక్కసారిగా మారిపోయింది. ద్రాక్షతోటలు సాధారణంగా జనవరి రెండో వారం నుంచి ఏప్రిల్ నెలలో కోతకు వస్తుంటాయి. ఈ క్రమంలో 2007, 2008 సంవత్సరాల్లో సరిగ్గా కోతల సమయాల్లోనే అకాల వర్షాలు కురిశాయి. 2008లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. మార్చి 23 నుంచి 31 వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఈ పరిణామం వల్ల ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు మండలాల్లోనే కాకుండా రాష్ట్రంలో సాగవుతున్న ద్రాక్ష తోటలకు ఫంగస్ సోకి పళ్లన్నీ విషతుల్యమయ్యాయి. ఈ పరిస్థితుల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

మహారాష్ట్రలో ప్రభుత్వం అండ..

మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి ద్రాక్ష రైతులను ప్రోత్సహిస్తున్నది. కొత్తగా ద్రాక్ష సాగుకు సిద్ధమయ్యే రైతులకు బ్యాంక్ రుణం, ఫంగీసైడ్స్, ఫెస్టిసైడ్స్, ఆధునిక పరికరాలు, పందిరి అల్లడానికి వైరు, డ్రిప్ తదితర సౌకర్యాలను కల్పిస్తున్నది. ఒక వేళ రైతులు నష్టపోతే ఎకరాకు రూ. లక్ష వరకు పరిహారాన్ని అందిస్తున్నది. అంతేకాకుండా బ్యాంకుల్లో పంట రుణాలను రెన్యూవల్ చేస్తున్నది. వీటన్నింటికి తోడు రైతులకు మంచి మార్కెటింగ్ సౌకర్యాన్ని సైతం కల్పిస్తోంది.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ప్రదర్శన అంశంతో విద్యార్థులు, సింగరేణి పాఠశాల ఉపాధ్యాయులు(ఫైల్)

- సైన్స్‌ఫేర్‌లో రాణిస్తున్న సింగరేణి విద్యార్థులు
- వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

వినూత్న ఆలోచనలకు శ్రీకారం

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్నారు. ఓ వైపు చదువులు మరో వైపు క్రీడలతో పాటు కొత్త కొత్త ఆలోచనలకు పదును పెడుతూ సైన్స్‌ఫేర్, సైన్స్ ఎగ్జిబిషన్‌లలో పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. గత నెల జిల్లా కేంద్రంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మాథ్స్, సైన్స్ టాలెంట్ టెస్టులో పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాఠశాల విద్యార్థి ఏ. ప్రశాంత్ మొదటి స్థానంలో నిలిచి శెభాశ్ అనిపించుకున్నాడు.

నీటి సంరక్షణపై ఆకట్టుకునే ప్రదర్శన..

డిసెంబర్ 5, 6వ తేదీల్లో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి మ్యాథ్స్, సైన్స్, ఎన్విరాన్‌మెంట్ ఎగ్జిబిషన్‌లో నిర్వహించారు. ఇందులో గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి పాఠశాలలో పదోతరగతి విద్యార్థి ప్రశాంత్ 'మన ఊరు మన చెరువు నీటి సంరక్షణ' అనే అంశంపై నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈప్రదర్శన మొదటి బహుమతిని సాధించిపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో పాటు నీటి వనరుల లభ్యత, వినియోగంపై ఆకట్టుకునే రీతిలో ప్రదర్శనను అందించాడు. వర్షపు నీటిని సక్రమంగా ఉపయోగించుకుంటే ప్రాణకోటికి కలిగే ఉపయోగాలతో పాటు పర్యావరణ పరిరక్షణను ఎలా కాపాడుకోవాలో చక్కగా వివరించాడు. కొండకోనల్లో కురిసే వర్షం నీరు కాలువలు, వాగులు వంకల్లో పడి వృథా పోకుండా కొండలు, అడవుల్లో చెక్‌డ్యాంలను నిర్మించడంతో భూగర్భ జలాలు వృద్ధి చెందడంతో పాటు అడవుల్లోని వన్యప్రాణులకు సైతం తాగేందుకు పుష్కలంగా నీరు లభిస్తుంది. అంతరించిపోతున్న అడవుల వల్ల వర్షపాతం తగ్గుతుందని హరితహారంలో మొక్కలు నాటాలని ప్రశాంత్ వివరించాడు. కురిసిన వర్షపు నీటిని కుంటలు, చెరువులకు మళ్లించి పంట పొలాలకు నీరందించే పద్ధతిని వివరించాడు. మరోవైపు ప్రాజెక్టు ద్వారా మిషన్ భగీరథ ద్వారా గ్రామాలకు, ఇంటిమీద పడ్డ వర్షపు నీరు వృథా పోకుండా ఇంకుడు గుంతలు, పంట పొలాల్లో వ్యర్థాలను కాల్చడంతో కలిగే కాలుష్యాన్ని నివారించడం, అవే వ్యర్థాలతో సేంద్రియ ఎరువుల్ని తయారు చేసి పంటలు పండించే పద్ధతిని ప్రదర్శించి శెభాష్ అనిపించాడు. 250కి పైగా ఇచ్చిన ప్రదర్శనలో ప్రశాంత్ ఇచ్చిన ప్రదర్శన మొదటి స్థానంలో నిలవడంతో వరంగల్‌లో డిసెంబర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం పాల్గొని ప్రతిభ కనబర్చాడు.

ఆసక్తిని బట్టి ప్రోత్సహిస్తున్నాం

పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఆసక్తిని బట్టి వారిని ఆయా రంగాల్లో రాణించేందుకు మావంతుగా ప్రోత్సాహాన్ని అందిస్తున్నాం. ఇప్పటికే పాఠశాలకు చెందిన అనేక మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడల్లో పతకాలు సాధించగా, జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్ పోటీల్లోనూ విజేతలుగా నిలిచారు. రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో పాల్గొన్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు మావంతు కృషిని అందజేస్తున్నాం.

- వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం, సింగరేణి పాఠశాల

పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు

సరైన ఆలోచనా విధానాలతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు. అవే అంశాలను ప్రాజెక్టు ద్వారా వివరించాం. అన్ని విధాలా వర్షపు నీటిని ఎలా ఉపయోగించుకోవచ్చో తెలపడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన వి ధానాన్ని వివరించాం. వరంగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా విద్యార్థి ప్రతి భకనబర్చాడు.

- మనోహర్ గైడ్, టీచర్



నీటి వృథాను అరికట్టాలనే లక్ష్యంతో..

అన్ని జీవరాశులకు నీరు ఎంతో అవసరం. కానీ సరైన ఉపయోగం లేక వర్షపు నీటిని వృథా చేసుకుంటున్నాం. అలాంటి వర్షపు నీటిని ఒడిసి పట్టుకుంటే మనుషులతో పాటు జంతువులకు ఎంతో ఉపయోగాలున్నాయి. భూగర్భ జలాలు సైతం వృద్ధి చెందుతాయి. ప్రాజెక్టు కోసం ఉపయోగించిన వస్తువులన్నీ భూమిలో కలిసిపోయే వాటితోనే తయారు చేశా. దాంతో జిల్లా స్థాయిలో మొదటి బహుమతి వచ్చింది. గత నెలలో వరంగల్‌లో సైతం ప్రదర్శన ఇచ్చాను.

- ప్రశాంత్, విద్యార్థి



- ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తున్న మహిళా టీచర్లు
- పేదరికాన్ని జయించి జ్ఞానం పంచుతూ..
- వినూత్నంగా బోధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న టీచర్లు
- నేడు సావిత్రిబాయి ఫులే జయంతి

ఆదిలాబాద్ టౌన్: అజ్ఞాన చీకటిని పారద్రోలి విజ్ఞాన కాంతులు వికసింప జేసే వారే ఉపాధ్యాయులు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఉన్న విలువ మరో వృత్తికి లేదు. డాక్టర్, లాయర్, ఇంజినీర్, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కావాలన్నా గురువుల బోధన తప్పనిసరి. అలాంటి విద్యను బోధించే వారే ఉపాధ్యాయులు. ఉపాధ్యాయులే లేని సమాజంలో గుర్తింపు, సమాజంలో రాజకీయ నాయకులకు కూడా గురువు బోధన అండగా ఉండాల్సిందే. అంతటి ప్రాధాన్యం ఉపాధ్యాయులది. తెల్లకాగితంలాంటి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసి వారు ఉన్నత స్థాయికి చేరుకునేలా తీర్చిదిద్దుతారు. విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారంటే కుటుంబీకుల తర్వాత సంతోషించేది గురువులే. బుధవారం మొదటి మ హిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి.. మహిళా టీచర్స్‌డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

బో



బోధనలో వినూత్నం



తరగతి గదిలో విద్యార్థులకు బోధిస్తున్న మమత



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న రామగిరి మమత విద్యార్థులకు తనదైన రీతిలో విద్యను బోధిస్తున్నారు. వాంకిడి మండల కేంద్రానికి చెందిన రామగిరి దయాకర్, పార్వతి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. మొదటి కుమార్తె మమత చిన్ననాటి నుంచి చదువులో ముందుండేవారు. ఆమె ప్రాథమిక విద్య వాంకిడిలోని ప్రభుత్వ పాఠశాలలో, ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు కాగజ్‌నగర్ నవోదయ పాఠశాలలో చదివారు. గణితంలో ముందున్న మమత ఇంటర్ తర్వాత హైదరాబాద్‌లో బీఎస్సీ డిగ్రీ, ఆసిఫాబాద్‌లో బీఎడ్ పూర్తి చేశారు. 2008 డీఎస్సీలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం ఆసిఫాబాద్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా తనదైన శైలిలో విద్యాబోధన చేస్తూ విద్యార్థుల్లో దాగున్న లెక్కల భయాన్ని తొలగిస్తున్నారు. చదువుకు పేదరికం అడ్డు రాదని, విద్యార్థులను ఉన్నతులుగా తీర్చి దిద్దడమే తన లక్ష్యమని మమత పేర్కొంటున్నారు.

హిం



విద్యార

ఆసిఫాబాద్:
రాదని నిరు
జెడ్పీ బాలిక
హిందీ ఉపా
వాంకిడి మ
చెందిన రైతు
లిటరేచర్ ప
ఉద్యోగం స
చేస్తున్నారు.
పరిష్కారమని
న్నారు. నేటి
లో స్థిరపడ్డాక

అంధ ఉపాధ్యాయురాలు సాధనరెడ్డిని ఇంటికి తీసుకెళ్తున్న విద్యార్థులు



వనితా లోకానికి ఆదర్శం

చూపులేకున్నా.. దారిచూపుతూ..



తనకు కంటి చూపు లేకపోయి నా ఎందరో మంది విద్యార్థులకు చదువు నేర్పుతూ వా రి బంగారు భవిష్యత్తు కు బాటలు వేస్తోంది ఈ ఉపాధ్యాయురా లు. సకలాంగులకు ఏ మాత్రం తీసిపోని వి ధంగా విద్య బోధన చే స్తుంది. వైకల్యాన్ని జయించి ఆత్మస్థైర్యంతో ఉన్నత చదువు చదివి ఉపాధ్యాయురాలిగా ఎదిగింది. తలమడుగు మండలం సుంకిడి గ్రామానికి చెందిన అల్లూరి సుదర్శన్‌రెడ్డి– చంపావతి దంపతుల కూతురు సాధన రెడ్డికి పుట్టుకతో కంటిచూపు లోపం ఉంది. అయినప్పటికీ మనోధైర్యం కోల్పోకుండా చదువును కొనసాగించింది. హైదరాబాద్‌లోని బ్లయిండ్ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివారు. ఆ తర్వాత అక్కడే నోబెల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్, కోఠి ఉమెన్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి ఆతర్వాత టీపీటీ చేశారు. 2002లో డీఎస్సీ ద్వారా సాధనరెడ్డి ఉపాధ్యాయ కొలువును సాధించారు. ప్రస్తుతం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గ్రేడ్–2 తెలుగు పండితురాలుగా పని చేస్తున్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు తెలుగు బోధన చేస్తున్నారు. తాను ఇంటి వద్ద బ్రెయిలీ లిపిలో పాఠాలను చదువుకొని పాఠశాలలో బోధన సాగిస్తున్నారు. అందరు గురువులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కంటిచూపు లేనప్పటికీ ఎందరో మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఈమెను పలువురు అభినందిస్తున్నారు. సంవత్సరంలో ఒక్కరోజు కూడా పాఠశాలకు సెలవుపెట్టి గైర్హాజరు కాలేదంటే ఆమెకు వృత్తి పట్ల ఎంత నిబద్ధత ఉందో ఇట్టే అర్థమవుతోంది. సమయపాలన పాటించడంలోనూ ఆమె ముందుంటారు. ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆమె సోదరుడు సందీప్‌రెడ్డి కూడా అంధుడే ఆయన కూడా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న మక్కువతోనే ఈ వృత్తిని ఎంచుకున్నానని సాధనరెడ్డి తెలిపారు. ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ అలుపెరగని దీక్షతో తల్లిదండ్రుల సహకారంతో ముందుకు సాగుతున్నానని ఆమె చెప్పారు.

...ధన స్ఫూర్తిదాయకం..



విద్యార్థులను ప్రేమగా, ఆప్యాయంగా పలకరిస్తూ, మంచి మాటలతో ఆకట్టుకుంటూ, వారికి అర్థమయ్యే రీతిలో పాఠాలను బోధిస్తున్నారు ఆదిలాబాద్‌కు చెందిన ఫిజిక్స్ ఉపాధ్యాయురాలు సునిత. ఈమె ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. 1996లో ఎస్జీటీగా ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. మొదట ఆదిలాబాద్ మండలంలోని లోకారి పాఠశాలలో విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత 2002లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది పట్టణంలోని బాలికల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో సమయపాలన, విద్యార్థులకు అర్థమయ్యేలా వినూత్న బోధన చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఉత్తీర్ణత శాతం పెంచడంలోనూ ఎంతగానో కృషి చేస్తున్నారు. విద్యార్థులకు సైన్స్ పట్ల మక్కువ పెంచుతూ విద్యార్థులకు ఫిజిక్స్ అంటే భయం లేకుండా బోధన చేపడుతున్నారు. విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహిస్తూ సునిత ముందుకు సాగుతున్నారు.

...ందీ బోధనలో దిట్ట ఉర్మిళ



...ర్థులకు బోధిస్తున్న ఉర్మిళ



... చదువుకు పేదరికం అడ్డు ...ాపించారు జిల్లా కేంద్రంలోని ...ల ఉన్నత పాఠశాలలో పని చేసే ...ాధ్యాయురాలు రత్నం ఉర్మిళ. ...ండలం ఖమాన గ్రామానికి ... రాము, సుందరబాయి దంపతుల కుమార్తె ఉర్మిళ. బీఏ హిందీ ...ట్టా సాధించారు. 2012 డీఎస్సీలో హిందీ ఉపాధ్యాయురాలిగా ...ాధించారు. విద్యార్థులకు ఆట పాటల ద్వారా విద్యాబోధన ... మహిళల ఉన్నతికి చదువే ఆయుధమని, సమస్యలకు చదువే ...ని, ప్రతీ బాలిక విద్యావంతురాలు కావాలని ఆమె పేర్కొంటు... విద్యార్థులు టీవీ, ఇంటర్నెట్‌కు దూరంగా ఉండాలని, జీవితం ...కే వివాహం చేసుకోవాలని ఆమె సూచిస్తున్నారు.

పేదరికాన్ని జయించి..



చెన్నూర్: మండలంలోని ఆస్నాద గ్రామానికి చెందిన గజ్జెల శ్రీరాములు, సునీతకు నాలుగు కుమార్తెలు. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీరాములు ఉపాధి హామీ పథకంలో ఫీల్ట్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ అష్టకష్టాలు పడి నాలుగురు కుమార్తెలను చదివించాడు. పెద్ద కుమార్తె శ్రావణి 1 నుంచి 5 వరకు ఆస్నాద జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యాభ్యాసం చేసింది. 6 నుంచి 10 వరకు నిర్మల్ గురుకుల పాఠశాలలో చదివింది. 2008 లో ఏపీ ఆర్‌జేసీ పరీక్షలు రాసి వరంగల్ ఇంటర్ పూర్తి చేసింది. టీటీసీ పూర్తి చేసి 2012లో నిర్వహించిన డీఎస్సీ పరీక్ష పాసై టీచర్ ఉద్యోగాన్ని సంపాదించింది. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధిస్తూ శ్రావణి ఆదర్శంగా నిలుస్తోంది.

ఐఏఎస్‌ను కావాలనుకున్నా..

మాది నిరుపేద కుటుంబం ఇంటి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని విద్యాభ్యాసం కొనసాగించా. అన్ని తరగతుల్లో ప్రథమ స్థానంలో వచ్చా. ఐఏఎస్ కావాలని అనుకున్నా. ఇంటి ఆర్థిక ఇబ్బందులు నన్ను ముందుకు వెళ్లనీయలేదు. ప్రస్తుతం ఇంటికి ఆసరాగా నిలువాల్సిన బాధ్యత నాపై ఉంది. నాబాధ్యతను తీర్చేందుకు ఉన్నత చదువుల గురించి ఆలోచించ లేదు. ఐఏఎస్ కావాలన్న నా ఆకాంక్షను పక్కకు పెట్టా. నా ముందు ఉన్న బాధ్యతను నేరవేర్చేందుకు ఉపాధ్యాయురాలి ఉద్యోగంలో చేరాను. ఇంకా ఉన్నత చదువులు చదవాలనుకుంటున్నా.

- గజ్జెల శ్రావణి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు, పాక్కూర్

అర్థమయ్యే రీతిలో బోధన



నిర్మల్‌రూరల్: తరగతిలోని విద్యార్థులందరికీ అర్థమయ్యే రీతిలో బోధన చేస్తున్నారు చిట్యాల్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కె. సుజాత. గణితం అంటే విద్యార్థులకు భయం పోయేలా ప్రత్యేకంగా చార్ట్‌లను రూపొందించారు. ఆ చార్టులతో విద్యార్థులకు వివరణలు ఇస్తూ బోధిస్తున్నారు. గణిత ఒలంపియాడ్, క్విజ్‌పోటీల్లోనూ విద్యార్థులు విజయం సాధించేలా వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వస్తున్న విద్యార్థులు జాతీయస్థాయి పోటీపరీక్షల్లో రాణించేలా బోధించడమే తన లక్ష్యమని పేర్కొంటున్నారు.

ఆటలతో ఆరోగ్యం



నిర్మల్‌రూరల్: విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు కూడా ముఖ్యమే అంటున్నారు బీరవెల్లి ఉన్నత పాఠశాల పీఈటీ వెన్నెల. ప్రతీరోజు విద్యార్థులు తప్పనిసరిగా ఆటలు ఆడేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ సంవత్సరం పాఠశాల నుంచి ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థులు వివిధ పోటీల్లో రాష్ట్రస్థాయిలో రాణించేలా వెన్నెల కృషి చేస్తున్నారు. భవిష్యత్‌లో జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించేలా విద్యార్థులకు తగిన శిక్షణను అందజేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.



న్యూస్ బాక్స్

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- సమాన వేతనం చెల్లించాలి
- 28న చెన్నైలో సదస్సు
- ఇఫ్టూ జాతీయ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

నస్పూర్(మంచిర్యాల): సింగరేణిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఇఫ్టూ జాతీయ ఉపాధ్యక్షుడు టి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం సీసీసీలో జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో కాంట్రాక్ట్ కార్మికులను నియమించి శ్రమదోపిడికి పాల్పడుతున్నాయని అన్నారు. సింగరేణిలో సుమారు 25వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సమాన వేతనం చెల్లించడం లేదన్నారు. 2016 అక్టోబర్‌లో సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తీర్పు ఇచ్చినా ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల పర్మినెంట్, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఇఫ్టూ ఆధ్వర్యంలో మరో తొమ్మిది సంఘాలను కలుపుకొని ఈనెల 28న చెన్నైలో అఖిల భారత సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.బ్రహ్మానందం, నాయకులు నర్సయ్య, యాదగిరి, శంకర్, పోషం, రమేష్, రాజయ్య, రాజేందర్, రాజకళ, శోభ పాల్గొన్నారు.

ఓబీ కార్మికులకు బోనస్

- త్వరలోనే ఇప్పిస్తాం
- ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్

రెబ్బెన(ఆసిఫాబాద్): ఓబీ వెలికితీత పనుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు త్వరలోనే బోనస్ ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మంగళవారం బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో డీబీఎల్ కంపెనీలో పనిచేస్తున్న ఓబీ వెలికితీత కార్మికులతో సమావేశం అయ్యారు. కార్మికులందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసే కుమురం భీం కార్మిక సంఘంలో చేరి సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాలని కోరారు. అనంతరం డీబీఎల్ యాజమాన్యంతో చర్చించి ఈనెల 20న జనవరి వేతనంలో కలిపి బోనస్ చెల్లించేలా యాజమాన్యాన్ని ఒప్పించినట్లు తెలిపారు. లైట్ మోటార్ వెహికల్ డ్రైవర్లకు త్వరలోనే వేతనాలు పెంచేందుకు యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. గతంలో ప్రమాదాలు చేశారనే సాకుతో విధుల నుంచి తొలగించిన కార్మికులకు త్వరలోనే కల్పించేందుకు అంగీకరించినట్లు తెలిపారు. స్థానిక యువతకే ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించాలని సూచించామని, ఉత్తర భారతదేశం నుంచి కార్మికులను తీసుకువచ్చి స్థానికులకు అన్యాయం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశాల్లో రెబ్బెన, తిర్యాణి జెడ్పీటీసీలు అజ్మీర బాబురావు, వెడ్మ కమల, ఎంపీపీ కార్యాధం సంజీవ్‌కుమార్, కాంట్రాక్టు కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్ రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ కుందారపు శంకరమ్మ, ఎంపీటీసీ వనజ, నాయకులు జగదీష్, కమలాకర్, మొండయ్య, సుదర్శన్‌గౌడ్, నగేష్, మహేష్, సంతోష్, రాజేష్, గజ్జల సత్యనారాయణ, సుధాకర్, శ్రీనివాస్‌రావు, అహ్మద్, శంకర్ పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో జీఎం సుభాని మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఉదయం అన్ని డిపార్టుమెంట్ల కార్యాలయాలకు వెళ్లి పరిశీలించారు. కార్యాలయంలో విద్యుత్ వైరింగ్ అధ్వానంగా ఉండటంపై వర్క్‌షాప్ ఎస్ఈ క్రిస్టారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైరింగ్ పనులు చేయాలని గత సంవత్సరమే ఆదేశాలిచ్చినా ఎందుకు చేయలేదని నిలదీశారు. ఇప్పటికైనా త్వరగా పూర్తి చేయాలన్నారు. మరమ్మతులు, ఇతర సివిల్ పనులను పరిశీలించారు. గోడలకు పెచ్చులూడిన చోట మరమ్మతులు చేసి సున్నాలు వేయాలన్నారు. కార్యాలయాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఎందుకు ఉంచడం లేదని మండిపడ్డారు. అన్ని డిపార్టుమెంట్ల అధికారులు ఇప్పటికైనా కార్యాలయాల్లో ఉన్న ఫైల్స్‌ను శుభ్రంగా సర్దుకోవాలని, చెత్తచెదారం లేకుండా చూడాలని, పనికి రాని స్టేషనరీని బయటికి తరలించాలని ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) జె.చిత్తరంజన్‌కుమార్, డీజీఎం(సివిల్) శ్రీనివాస్‌రావు, ఎస్ఈ రామకృష్ణ, డీవైపీఎం తుకారాం, సీనియర్ పీఓలు ఉదయమోహన్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

స్టేడియాన్ని పరిశీలించిన విప్



మైదానాన్ని పరిశీలిస్తున్న విప్ ఓదెలు

ఖేల్

రామకృష్ణాపూర్(చెన్నూర్): ఈ నెల 4 నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వెటరన్ అథ్లెటిక్ పోటీల కోసం స్థానిక ఠాగూర్ స్టేడియంలో ఏర్పాట్లను ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు మంగళవారం పరిశీలించారు. ఎంతమంది క్రీడాకారులు హాజరవుతున్నారు, వారికి వసతి భోజనాలు ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారు అనే విషయాలపై సమీక్షించారు. రెండు రోజులు జరిగే ఈ పోటీలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ కంభగోని సుదర్శన్‌గౌడ్, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాండ్ల సమ్మయ్య, నాయకులు నర్సింగరావు, బైర మొగి లయ్య, కుమ్మం సురేందర్, జిలకర మహేష్ ఉన్నారు.

నేడు సబ్ జూనియర్ అథ్లెటిక్ పోటీలు

మంచిర్యాలస్పోర్ట్స్: చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం మంచిర్యాల, కుమురం భీం జిల్లాల సబ్ జూనియర్ అథ్లెటిక్ పోటీలను నిర్వహిస్తున్నామని జిల్లా అథ్లెటిక్ అసోషియేషన్ అధ్యక్షుడు కె.రామయ్య మంగళవారం తెలిపారు. అండర్-10,12,14 విభాగంలోని బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనుటకు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఉదయం 9 గంటలకు హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

విధి నిర్వహణలో రాజీ లేని రాబిన్‌సన్

- ఆస్తుల పరిరక్షణలో ఎనలేని కృషి
- కేకే ప్రాజెక్టు అధికారి రామ్మూర్తి



రాబిన్‌సన్ దంపతులతో కేకే ప్రాజెక్టు అధికారి రామ్మూర్తి, ఇతర అధికారులు

మందమర్రి(చెన్నూర్): ఎస్అండ్‌పీసీ జూనియర్ ఇన్‌స్పెక్టర్ రాబిన్‌సన్ విధి నిర్వహణలో రాజీలేని వ్యక్తి అని, సంస్థ ఆస్తుల పరిరక్షణలో ఆయన పాత్ర ఎనలేనిదని కళ్యాణిఖని ప్రాజెక్టు అధికారి వి.రామ్మూర్తి అన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న రాబిన్‌సన్‌కు స్థానిక సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రామ్మూర్తి మాట్లాడుతూ ఇండియన్ నేవీలో పనిచేసిన రాబిన్‌సన్ సింగరేణిలో ఎక్స్ సర్వీస్‌మెన్ కోటాలో ఉద్యోగం పొందారని చెప్పారు. సైనిక్ విభాగంలో పనిచేసే కల్నల్ సహకారంతో సింగరేణిలోని ఎస్అండ్‌పీసీ విభాగానికి రాబిన్‌సన్ కొత్త మాన్యువల్ రూపకల్పన చేశారని ప్రశంసించారు. సింగరేణి భవన్‌తో పాటు సంస్థ కార్యాలయాల వద్ద ఎస్అండ్‌పీసీ సిబ్బందితో పటిష్ట భద్రత కల్పించారన్నారు. విజిలెన్సు విభాగంలోనూ రాబిన్ ఎంతో సేవలు అందించారన్నారు. రాబిన్‌సన్ మాట్లాడుతూ కేవలం జీతం కోసం పని చేస్తున్నామన్న భావనను కార్మికులు, ఉద్యోగులు తమ మనసు నుంచి తీసివేయాలని సూచించారు.

రాబిన్‌సన్ సేవలు అమూల్యం : విప్ నల్లాల ఓదెలు

సింగరేణిలోని కీలకమైన ఎస్అండ్‌పీసీ విభాగంలో జూనియర్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించిన రాబిన్ సేవలు అమూల్యమని ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు అన్నారు. రాబిన్ రాకతో ఎస్అండ్‌పీసీ విభాగం అంకితభావంతో పని చేస్తున్నదని చెప్పారు. డ్రెస్‌కోడ్ విధానం సైతం అమల్లోకి వచ్చిందన్నారు. సన్మాన కార్యక్రమానికి హాజరైన ఆయన రాబిన్‌సన్ దంపతులకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అనంతరం రాబిన్‌సన్ దంపతులను శాలువాలతో సన్మానించారు. ఎస్అండ్‌పీసీ సిబ్బంది గోల్డ్ రింగ్‌తో సత్కరించారు. కార్యక్రమానికి సీనియర్ సెక్యూరిటీ అధికారి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా డీజీఎం(పర్సనల్) పి.గోవిందరాజు, టీబీజీకేఎస్ నాయకులు మేడిపల్లి సంపత్, జె.రవీందర్, ఎస్టేట్ అధికారి సురేష్, నవనీత పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్‌కు సహకరించాలి

- నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి
- సింగరేణి డైరెక్టర్లు చంద్రశేఖర్‌రావు, భాస్కర్‌రావు



మాట్లాడుతున్న డైరెక్టర్లు, జీఎం, ఇతర అధికారులు

మందమర్రి(చెన్నూర్): రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాకు సంస్థ పరంగా సహకారం అందించాలని, ఇందుకు నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని సింగరేణి డైరెక్టర్లు చంద్రశేఖర్‌రావు (ఆపరేషన్స్), భాస్కర్ రావు (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) పిలుపునిచ్చారు. జైపూర్ పవర్ ప్లాంట్‌కు అవసరమయ్యే బొగ్గు రవాణా లక్ష్యాలకు అనుగుణంగా చేరుకోవాలని సూచించారు. మందమర్రి పర్యటనకు వచ్చిన డైరెక్టర్లు మంగళవారం జీఎం కార్యాలయంలో ఏరియా పరిధిలోని బొగ్గు ఉత్పత్తిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. 2017–18 వార్షిక సంవత్సరంలో ప్రణాళిక ప్రకారంగా లక్ష్యాలను చేరుకోలేకపోయామని చెప్పారు. ఉత్పత్తిలో వెనుకంజ వేయడానికి గల కారణాల్ని, ఎదురైన అవాంతరాల్ని వారు సమీక్షించారు. బొగ్గు గనుల్లోని పని స్థలాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. మ్యాపుల ద్వారా క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. అవసరమైనంత మేరకు నూతన పరికరాలు సమకూర్చుకుని బొగ్గు ఉత్పత్తిని సాధించాలని సూచించారు. అవసరమైన పక్షంలో ప్రత్యేక ఇన్సెంటివ్ లాంటివి ప్రవేశపెట్టాలన్నారు. ఎప్పటికప్పుడు మందమర్రి ఏరియా నుంచి జైపూర్ పవర్ ప్లాంటుకు బొగ్గు రవాణా సాగడానికి సన్నాహాలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశానికి మందమర్రి ఏరియా జీఎం ఎం.రాఘవులు అధ్యక్షత వహించగా జీఎంఎంఎస్ రుషేంద్రుడు, కళ్యాణిఖని ప్రాజెక్టు అధికారి వి.రామ్మూర్తి, ఎస్ఓటుజీఎం వెంకటేశ్వర్లు, ఏజెంట్లు వెంకటేశ్వర్‌రావు, నాగేశ్వర్‌రావుతో పాటు గ్రూప్ ఇంజినీర్లు, పిట్ ఇంజినీర్లు, అన్ని గనుల మేనేజర్లు పాల్గొన్నారు.

డిసెంబర్‌లో 91 శాతం ఉత్పత్తి

డిసెంబర్ మాసంలో ఏరియా వారీగా ఉత్పత్తి వివరాలు ఈ విధంగా ఉన్నాయి			
ఏరియా	టార్గెట్	ఉత్పత్తి	శాతం
కొత్తగూడెం	8,60,600	8,98.751	117
ఇల్లెందు	4,75,000	3,33.437	113
మణుగూరు	5,34,000	4,98,534	113
రామగుండం–1	5,55,700	4,37,902	100
రామగుండం–2	6,85,800	3.53.651	85
రామగుండం–3	6,10.000	6,13,440	95
భూపాలపల్లి	4,59,300	3,30,615	64
ఆడ్రియాల	2,76,500	51,861	18
బెల్లంపల్లి	6,50,000	5,62,835	90
మందమర్రి	4,84,000	1,63,577	66
శ్రీరాంపూర్	5,10,800	2,49,768	83
యూజీల టార్గెట్	11.31,300	6,93,171	61
ఓపెన్‌కాస్ట్‌ల టార్గెట్	51,18,,100	49,81,971	97
ఓసీ,యూజీలు			
కలిపి,మొత్తం	62,49,400	56,75,142	91

ఓపెన్ కాస్ట్‌లలో ఉత్పత్తి జరుగుతున్న దృశ్యం

- సింగరేణి వ్యాప్తంగా భూగర్భ గనుల్లో 61, ఓపెన్ కాస్ట్‌ల్లో 97 శాతం బొగ్గు వెలికితీత
- 4 ఏరియాల్లోనే 100 శాతం, 7 ఏరియాలు వెనుకంజ



సింగరేణి వ్యాప్తంగా ఉన్న 30 భూగర్భ గనులు, 16 ఓపెన్ కాస్ట్‌ల్లో డిసెంబర్ మాసంలో 62.49,400 టన్నుల లక్ష్యానికి గాను 56,75,142 టన్నులు, అనగా 30 భూగర్భ గనుల్లో 6,93,171 టన్నులు, 16 ఓపెన్ కాస్ట్ గనుల్లో 49,81,971 టన్నులు అనగా 97 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించింది.

9 మాసాల్లో వివిధ ఏరియాలు సాధించిన బొగ్గు ఉత్పత్తి వివరాలు			
ఏరియా	లక్ష్యం	ఉత్పత్తి	శాతం
కొత్తగూడెం	68,36,000	66,74,538	98
ఇల్లెందు	40,7,000	28,32,043	70
మణుగూరు	47,25,600	48,80,809	103
రామగుండం–1	45,66,100	43,44,776	95
రామగుండం–2	53,78,000	44,72,371	83
రామగుండం–3	45,70,000	54,91,281	120
భూపాలపల్లి	27.05,700	23,98,928	89
అండ్రియాల	24,65,500	4,77,822	19
బెల్లంపల్లి	50,10,000	53,32,307	104
మందమర్రి	33,75,200	18,14,564	54
శ్రీరాంపూర్	39,85,000	33,71,995	85
మొత్తం యూజీలలో	97.44,500	61,56,055	63
మొత్తం ఓసీలలో	3,79,42,600	3,58,35,379	94
గ్రాండ్ టోటల్	4,76,87,100	4,19,91,434	88

సింగరేణి(కొత్తగూడెం):

సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.శ్రీధర్ ప్రతి నెలా మొదటివారంలో హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో జీఎంలతో సమీక్షా సమావేశం ఏర్పాలు చేసి ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని చెబుతున్నా ఫలితం ఉండడంలేదు. ప్రతి ఏరియా రోజువారీ లక్ష్యాసాధనకు కృషిచేయాలని, ముఖ్యంగా భూగర్భగనులలో 100 శాతం ఉత్పత్తి లక్ష్యాలను ఖచ్చితంగా సాధించాలని రివ్యూమీటింగ్‌లో 11 ఏరియాల జీఎంలకు ఆదేశాలు జారీచేసినా అధికారుల తీరుమారలేదు. రోజువారీ ఉత్పత్తి లక్ష్యాల సాధనలో గతంలో భూగర్భగనులు మాత్రమే వెనకబడి ఉండేవని, కానీ ఇటీవల కాలంలో ఓపెన్‌కాస్ట్ గనులు కూడా ఉత్పత్తి 100 శాతం సాధించక వెనుకబడి ఉన్నాయని ఇందుకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఇది ఇలా ఉండగా, తొమ్మిది మాసాలలో 47,68 మిలియన్ టన్నుల లక్ష్యానికి 41.99 మిలియన్ టన్నుల ఉత్పత్తిని అనగా 88 ఉత్పత్తిని మాత్రమే సాధించిందని సింగరేణి గణాంకాల ద్వారా తెలిసింది. గత ఎడాది ఇదే మాసంలో 42,41, అదేవిధంగా 2015–16లో 43.24 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించిన సంస్థ ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో సుమారు 6 మిలియన్ టన్నుల వెనుకంజలో ఉన్నట్లు సింగరేణి గణాంకాలు చెబుతున్నాయి. సంస్థ చైర్మన్, ఇతర విభాగాల ఉన్నతాధికారులు నెలవారీ లక్ష్యాల సాధనకు ఎన్ని ప్రణాళికలు వేసినా ఏరియాలలో ఉన్నతాధికారులు వాటిని అమలు చేయటంలో విఫలమవుతున్నారని, ఫలితంగా సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో కేవలం నాలుగు ఏరియాలు (కొత్తగూడెం ఏరియా 8,70,610 లక్షల టన్నుల లక్ష్యానికి 10.18,992 టన్నులు అనగా 117%, మణుగూరు ఏరియా 113%, ఇల్లెందు 113%, ఆర్జీ–1 ఏరియా 100% ఉత్పత్తిని సాధించగా, మిగిలిన 7 ఏరియాలైన ఆర్జీ–2–85%, ఆర్జీ–3 95%, భూపాలపల్లి 64%, ఆంద్రియాలప్రాజెక్ట్–18%, బెల్లంపెల్లి–90%, మందమర్రి–66%, శ్రీరాంపూర్ ఏరియా–83%, 7 ఏరియాల్లో ఉత్పత్తి వెనుకంజలో ఉన్నాయని కార్మికులు చర్చించుకుంటున్నారు.

రీజియన్‌లో ఉత్పత్తి మెరుగు..

గడచిన 9 మసాలలో కొత్తగూడెం రీజియన్‌లోని కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ఏరియాలలో గత నెలకంటే బొగ్గు కొంత మెరుగ్గా ఉంది. డిసెంబర్ మాసంలో మూడు ఏరియాలలో కొత్తగూడెం ఏరియా 117%, మణుగూరు ఏరియా 113%, ఇల్లెందు ఏరియా 113% ఉత్పత్తి సాధించాయి. మిగిలిన రీజియన్‌లలో ఏ రీజియన్ 100% ఉత్పత్తిని సాధించకలేక పోయాయి. 11 ఏరియాలలో కలిపి డిసెంబర్ మాసానికి 47.68 మిలియన్ టన్నుల లక్ష్యానికి గాను 41.99 మిలియన్ టన్నులు మాత్రమే ఉత్పత్తి చేసింది. అంతేకాకుండా రానున్న జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలో 90 పని దినాల్లో సుమారు 25.01 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయాలి. ఈలెక్కన ఇప్పటికి రోజుకు 2 లక్షల టన్నులు ఉత్పత్తి చేయాలని భావిస్తున్న యాజమాన్యం రోజుకు 2.50 లక్షల టన్నుల ఉత్పత్తి చేస్తేనే లక్ష్యాసాధన సాధ్యమవుతుందని అధికారులు లెక్కలు వేసుకుంటున్నారు.

కొత్తగూడెం ఏరియా పెద్దన్న పాత్ర

విలేకరుల సమావేశంలో ఏరియా జీఎం



మాట్లాడుతున్న ఏరియా జీఎం రమణమూర్తి

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు ఉత్పత్తిలో కొత్తగూడెం ఏరియా పెద్దన్నపాత్ర పోషించిందని, సింగరేణి 128 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టించటమే కాకుండా సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో అగ్రస్థానం సాధించిందని ఏరియా జీఎం కేవీ.రమణమూర్తి తెలిపారు. మంగళవారం ఏరియా జీఎం కార్యాలయ ఆవరణలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ మాసంలో 10 లక్షల 18 వేల 992 టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయటమేకాకుండా, 10 లక్షల 2 వేల 576 టన్నులు అనగా 238 రేకుల బొగ్గును రవాణాచేసి అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. గడచిన 9 మాసాలలో 68,36,000 టన్నుల లక్ష్యానికి 66,74,538 టన్నులు, 98 శాతం సాధించిందన్నారు. కొత్తగూడెం ఏరియా ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఇంత మొత్తంలో ఉత్పత్తి చేయటం ఇదే మొదటిసారని, ఇందుకు సహకరించిన అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు, కార్మికులకు జీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఇదేస్ఫూర్తితో రానున్న మూడు మాసాలలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించి ఏరియాకు మంచిపేరు తేవాలని కోరారు. విలేకరుల సమావేశంలో ఏజీఎం కె వి.వి.సత్యనారాయణ, డీజీఎం సివిల్ తిరుకోటి సూర్యనారాయణ, డీజీఎం పర్సనల్ సాల్మన్, డీవైజీఎం కృష్ణగోపాల్ తివారీ, డీవైజీఎం(ఐఈ)జ్యోతి, డీజీఎం (ఈ అండ్ఎం) బీడీవీ ప్రసాద్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాస్‌రావులు పాల్గొన్నారు.

ఆర్‌సీహెచ్‌పీ ఉద్యోగులకు రూ.లక్ష నజరానా

సింగరేణి(కొత్తగూడెం): ఏరియా పరిధిలోని రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌సీహెచ్‌పీ) కార్మికులకు సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.శ్రీధర్ మంగళవారం రూ. లక్ష గిఫ్ట్‌గా అందజేసినట్లు ఏరియా డీవైజీఎం పర్సనల్ సాల్మన్ తెలిపారు. డిసెంబర్ నెలలో 238 రేకుల బొగ్గును రవాణా చేసినందుకు గాను ఈగిఫ్ట్‌ను అందజేసినట్లు తెలిపారు. సింగరేణి ఏర్పడిన నాటి నుంచి ఇంత బొగ్గును రవాణాచేయటం ఇదే ప్రప్రథమన్నారు. ఇందుకు సహకరించిన అధికారులకు, సూపర్‌వైజర్లకు కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్సెంటివ్‌లు ప్రకటించినా ఊపందుకోని ఉత్పత్తి

వార్షిక లక్ష్యం 66.06 మిలియన్ టన్నులు



బొగ్గు వెలికితీస్తున్న దృశ్యం

యైటింక్లయిన్‌కాలనీ(పెద్దపల్లి జిల్లా): సింగరేణి వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం గడువు మరో 90 రోజులే మిగిలింది. 2017–18 సంవత్సరంలో 66.06 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉండగా ఇప్పటివరకు 41.99 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధనలో 88 శాతం చేరుకుంది. 2016–17 ఆర్థిక సంవత్సరం డిసెంబర్ చివరినాటికి 42.41మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పసాధించి ముందంజలో ఈసారి మాత్రం కొంత వెనకబడింది. సింగరేణి వ్యాప్తంగా 120 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించి ఆర్జీ–3 డివిజన్ నెంబర్‌వన్ స్థానంలో ఉండగా 104 శాతం బొగ్గు ఉత్పత్తితో బెల్లంపల్లి ఏరియా రెండో స్థానం, 103 శాతం సాధించి మణుగూరు మూడో స్థానంలో నిలిచాయి. 19 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించి అడ్ర్యాల ప్రాజెక్టు ఏరియా చివరి స్థానంలో నిలిచింది. బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధన కోసం ఇన్సెంటివ్‌లు ప్రకటించినా ఉత్పత్తి ఊపందుకోలేదు. దీంతో రాబోయే 90 రోజుల్లో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధించడానికి గడువు మాత్రమే ఉంది. వార్షిక అంచనాలకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించడం కష్టంగా ఉన్నట్లు భావిస్తున్నారు. కొన్ని ఏరియాలో లక్ష్యాల సాధనలో దూరంగా ఉండటంతో రాబోయే మూడు నెలల్లో వార్షిక ఉత్పత్తి లక్ష్య సాధన ఏవిధంగా సాధిస్తారనేది వేచి చూడాల్సిందే.

ఉత్పత్తిపై ప్రభావం చూపనున్న మేడారం సమ్మక్క జాతర

ఈసారి మేడారం సమ్మక్క జాతర ఈనెలాఖరులో ఉండటంతో కార్మికుల గైర్హాజర్ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. దీనికి ముందు వేములవాడ, కొండగట్టు, కొమురవెల్లి జాతరలకు కార్మిక కుటుంబాలు మొక్కులు చెల్లించేందుకు వెళ్లే అవకాశం ఉండటంతో కనీసం వారం రోజులు ఉత్పత్తిపై ప్రభావం చూపే అవకాశాలున్నాయి. దీంతో ఈసారి లక్ష్య సాధన అనుకున్న మేర సాధించే అవకాశాలు కష్టమేనని అంటున్నారు.



వెండితెర



మంచిర్యాలలో..
శ్రీవెంకటేశ్వర–
హలో
ఏషియన్ శ్రీనివాస –
ఎంసీఏ, (మిడిల్ క్లాస్ అబ్బాయి)
లక్ష్మి – ఒక్క క్షణం
మయూరి – 2 కంట్రీస్
తిరుమల(స్క్రీన్–1)(సీసీసీ)–
ఎంసీఏ, (మిడిల్ క్లాస్ అబ్బాయి)
దేవి(స్క్రీన్–2)(సీసీసీ) –
హలో

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు



హాజరైన నిరుపేద మహిళలు

మంచిర్యాలక్రైం: ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి సాధినేని వెంకటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. పట్టణంలోని 345 సర్వే నంబర్‌లో కొనసాగుతున్న భూ పోరాటంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా కేంద్రంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను అధికార పార్టీ నాయకులే కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. కబ్జాదారులపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పేదలకు ఇంటిస్థలం కోసం వంద గజాల స్థలం అడిగితే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పేదలకు ఇంటి స్థలాలు కేటాయించి పట్టాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, దేవరాజ్, తిరుపతిరెడ్డి, వజ్ర, లక్ష్మి, సువర్ణ తదితరులున్నారు.

Zone Guide

నేటి నుంచి గ్రామసభలు

లక్సెట్టిపేట: మండలంలో నేటి నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాంప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3న బలరావుపేట, చందారం, 4న ఎల్లారం, దౌడపల్లి, 5న గుల్లకోట, జెండావెంకటాపూర్, 5న ఇటిక్యాల, లక్ష్మీపూర్, 6న ఇటిక్యాల, లక్ష్మీపూర్, 8న లక్సెట్టిపేట, మోదెల, 9న పాతకొమ్ముగూడెం, పోతపల్లి, 10న రంగపేట, తిమ్మాపూర్, 11న ఊత్కూరు, వెంకట్రావుపేట, 12న కొత్తూర్‌లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నేడు రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో నిర్వహిస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కమిటీ ఎన్నికలను నేడు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి సంజీవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్‌లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ ఉంటుందని వెల్లడించారు.

మున్నూరు కాపు క్యాలెండర్ ఆవిష్కరణ



జన్నారం: మంత్రిని సన్మానిస్తున్న నాయకులు

జన్నారం: మున్నూరు కాపు సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను మంగళవారం రాష్ట్ర మంత్రి జోగు రామన్న ఆదిలాబాద్‌లోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. మున్నూరుకాపు సంఘం జన్నారం మండల అధ్యక్షుడు కాసెట్టి లక్ష్మన్ ఆధ్వర్యంలో నాయకులు ఆదిలాబాద్ వెళ్లి మంత్రి క్యాలెండర్లను ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు కొంతం శంకరయ్య, నాయకులు సురేష్, సత్తన్న, నర్సయ్య, మల్లయ్య తదితరులున్నారు.

దుర్గాదేవి పూజ కమిటీ క్యాలెండర్..



మంచిర్యాలఅర్బన్: ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలఅర్బన్: సర్వజనని దుర్గాదేవి పూజ కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఎమ్మెల్యే దివాకర్‌రావు మంగళవారం ఆవిష్కరించారు. పట్టణంలోని విశ్వనాథ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే విడుదల చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సిరిపురం శ్రీనివాస్, అర్చకుడు నరహరిశర్మ, దుర్గాదేవి పూజ కమిటీ అధ్యక్షుడు బోడ ధర్మేందర్, సభ్యులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ...

ఎస్‌టీయూటీఎస్ నూతన సంవత్సర డైరీని డీఈవో డాక్టర్ కె.రవికాంత్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పరీక్షల విభాగం సహాయక కమిషనర్ సురేష్‌బాబు, ఎంఈవో దాసరి శ్రీనివాస్, డీసీఈబీ కార్యదర్శి భీంరావు, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శంకర్‌గౌడ్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శుల ఫోరం క్యాలెండర్ల ఆవిష్కరణ..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం 2018 నూతన సంవత్సర క్యాలెండర్లను మంగళవారం కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ చేతుల మీదుగా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. డీపీఓ కె.నరేందర్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, షేక్ సప్దర్‌అలీ, అజ్మత్‌అలీ, సమ్మిరెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



క్యాలెండర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో తెలంగాణ వైద్య, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అల్లాడి శ్రీనివాస్, అత్తులూరి సతీశ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా సహ అధ్యక్షురాలు రాజశ్రీ, కార్యనిర్వాహక అధ్యక్షులు ఏ.లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, ఆర్ఎస్.పద్మ, ప్రమీల, జిల్లా సంయుక్త కార్యదర్శులు సుశీల, కమలాకర్, ప్రచార కార్యదర్శి ఎం.రమేశ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు జి. నాగభూషణం. పి.శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, గోపాల్, రాము, శ్రీనాథ్ పాల్గొన్నారు.

17న స్కీం వర్కర్ల దేశవ్యాప్త సమ్మె

జన్నారం: స్కీం వర్కర్ల వేతనాలు పెంచి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పోతు శంకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో సమ్మె కరపత్రాలు విడుదల చేశారు. శంకర్ మాట్లాడుతూ గ్రామాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు సరిపడా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కనీస వేతనం రూ. 18 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. డిమాండ్లకు ఒప్పుకోకుంటే సమ్మెకు దిగుతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బుచ్చయ్య, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత

దండేపల్లి: మండలంలోని గూడెం వీఆర్ఏ దమ్మ రాజయ్య(50) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఆయన కుటుంబానికి మండల రెవెన్యూ సిబ్బంది వీఆర్వోలు, వీఆర్ఏలు సంతాపం తెలియజేశారు. తక్షణ సాయం కింద తహసీల్దార్ దత్తుప్రసాద్‌రావు రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో వీఆర్ఏ పెండెం రాజయ్య, వీఆర్ఏల సంఘ నాయకులు ఉన్నారు.

నెల్లూరు గొర్రెలు అందజేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సబ్సిడీ గొర్రెల యూనిట్లలో భాగంగా స్థానిక వాతావరణానికి అలవాటు పడే నూతన గొర్రెలను పంపిణీ చేయాలని యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బండి సదానందంయాదవ్ కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ ఎల్లన్నకు వినతిపత్రం అందజేశారు. సదానందంయాదవ్ మాట్లాడుతూ స్థానిక వాతావరణానికి అలవాటు పడే నెల్లూరు గొర్రెలను పంపిణీ చేయాలని కోరారు. జిల్లాలో ఇప్పటి వరకు 4216 యూనిట్లను అందజేసినట్లు తెలిపారు. మిగతా లబ్ధిదారులకు సైతం వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. చనిపోయిన గొర్రెలకు బీమా వర్తింపజేసి వాటి స్థానంలో కొత్తవి పంపిణీ చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో గొర్రెల కాపరుల సొసైటీ చైర్మన్ రెంకెల హనుమాండ్లు, నాయకులు గడ్డం సతీశ్‌యాదవ్, అల్లం నాగయ్యయాదవ్, లింగన్నయాదవ్, ఎం.రవియాదవ్, నక్క శ్రీనివాస్‌యాదవ్, గంగన్నయాదవ్ ఉన్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

నస్పూర్: మండలంలోని సింగాపూర్, తాళ్లపల్లి పంచాయతీల్లో మంగళవారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 64 ఆవులకు, 270 గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి తిరుపతి తెలిపారు. పశువులకు ఎలాంటి వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ వీఎల్‌వో భద్రయ్య, వెటర్నటీ సిబ్బంది పద్మ, రమేశ్, ప్రేంకుమార్, వెంకన్న, మనోజ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి మండలంలో..

దండేపల్లి: మండలంలోని కాసిపేట, వెల్గనూర్ గ్రామాల్లో పశువైద్యాధికారి డాక్టర్ కిశోర్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది షరీఫ్, అంజుమ్, తిరుపతి, సంతోష్, కృష్ణవేణి పాల్గొన్నారు.

దళితులపై దాడికి నిరసనగా ప్రదర్శన



నల్ల రిబ్బన్లతో నిరసన తెలుపుతున్న నాయకులు

మంచిర్యాలక్రైం: మహారాష్ట్రంలోని బీమాకోరేగావ్‌లో సోమవారం సభకు వెళ్తున్న దళితులపై జరిగిన దాడిని దళిత బహుజన సంఘాలు ఖండించాయి. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నోటికి నల్ల రిబ్బన్లతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దాడిలో ఓ వ్యక్తి చనిపోగా, 50మంది గాయపడ్డారని తెలిపారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. నిరసనలో సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకుడు బి.సత్యాజీ, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ ఆర్.రాజేశం, నేతకాని సంఘం రాష్ట్ర నాయకుడు దుర్గం గోపాల్, తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి శ్రీమన్నారాయణ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి సంకె రవి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కె.సతీశ్, వివిధ సంఘాల నాయకులు గుమ్ముల శ్రీనివాస్, బి.చందు, గోమాస ప్రకాశ్, అరిగెల మహేశ్, కె.రవీందర్, దుర్గం ఎల్లయ్య, పొట్లెపు శంకరయ్య, మహేందర్, మిడవెల్లి శంకర్, రాజవేణు తదితరులు పాల్గొన్నారు.

ఖండన బిందువు భూమి నుంచి ఎంత ఎత్తులో ఉంది?




యార్లగడ్డ వనరాజు
స్కూల్ అసిస్టెంట్,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల

సరూప త్రిభుజాలు

సమస్యలు-సమాధానాలు

1. 4 మీటర్లు, 6 మీటర్ల ఎత్తున్న రెండు స్తంభాలు 25 మీటర్ల దూరంలో నిటారుగా ఉన్నాయి. మొదటి స్తంభం కొనను రెండో స్తంభం పాదంతో, రెండో స్తంభం కొనను మొదటి స్తంభం పాదంతో కలిపే రేఖల ఖండన బిందువు భూమి నుంచి ఎంత ఎత్తులో ఉంది?



జ. రెండు స్తంభాల ఎత్తులు AB = 4 మీ, CD = 6 మీ. అనుకోండి. భూమి నుంచి ఖండన బిందువు ఎత్తు PQ= z మీ. అనుకుంటే

ΔPQB, ΔCDBల్లో $\lfloor B = \lfloor B$ (ఉమ్మడి కోణం)

$\lfloor BQP = \lfloor BDC = 90^\circ$

కో.కో. నియమం ప్రకారం

ΔPQB ~ ΔCDB అవుతుంది.

అప్పుడు

$\frac{BQ}{BD} = \frac{PQ}{CD} = \frac{z}{6}$ —— (1) ఇదేవిధంగా

ΔPQD~ΔABD

అని చూపొచ్చు. అప్పుడు

$\frac{QD}{BD} = \frac{PQ}{AB} = \frac{z}{4}$ —— (2)


1, 2 లను కలిపితే $\frac{BQ}{BD} + \frac{QD}{BD} = \frac{z}{6} + \frac{z}{4}$

$\Rightarrow \frac{BQ+QD}{BD} = z\left(\frac{1}{6}+\frac{1}{4}\right)$

$\Rightarrow \frac{BD}{BD} = z\left(\frac{2+3}{12}\right) \Rightarrow 1 = z\left(\frac{5}{12}\right)$

$\Rightarrow z = \frac{12}{5} \times 1 = 2.4$ మీ.


■ **గమనిక:** ఈ సమస్యను పోలి ఉన్న సమస్య.. AB, CD, PQలు BDకి గీసిన లంబాలు AB=x, CD= y, PQ=z అయితే $\frac{1}{x} + \frac{1}{y} = \frac{1}{z}$ అని చూపండి అనే సమస్యతో పోలి ఉంటుంది.




2. ΔABCలో DE||BC, $\frac{AD}{DB} = \frac{3}{4}$, AC=15 సెం.మీ., అయితే AE విలువ ఎంత?

3. ΔABCలో DE||BC, AD= 4x–3, AE=8x–7, BD= 3x–1, CE= 5x–3 అయితే x విలువ కనుగొనండి.

4. కింది పటంలో AB||CD||EF, AB = 7.5 సెం.మీ. DC = y సెం.మీ., EF = 4.5 సెం.మీ., BC = x సెం.మీ. అయితే x, y విలువలు కనుగొనండి.



5. కింది పటంలో A, B, Cలు వరుసగా OP, OQ, ORలపై బిందువులు. AB||PQ, AC||PR అయితే BC||QR అని చూపండి.



పైథాగరస్ సిద్ధాంతం (బౌధాయన సిద్ధాంతం)


'లంబకోణ త్రిభుజంలో కర్ణం మీద వర్గం మిగిలిన రెండు భుజాల వర్గాల మొత్తానికి సమానం.'

విపర్యయంగా 'ఒక త్రిభుజంలో ఒక భుజం మీది వర్గం మిగిలిన రెండు భుజాల వర్గాల మొత్తానికి సమానమైతే అది లంబకోణ త్రిభుజం.'

లంబకోణ త్రిభుజం ΔABCలో

∠B =90^0 అయితే..


$(AC)^2 = (AB)^2+(BC)^2$



మాదిరి ప్రశ్నలు

1. 5 మీటర్లు, 12 మీటర్ల ఎత్తున్న రెండు స్తంభాలు నిటారుగా ఒక చదునైన నేలపై ఉన్నాయి. భూమిపై ఆ రెండు స్తంభాల అడుగు భాగాల మధ్య దూరం 12 మీటర్లు అయితే ఆ రెండు స్తంభాల పై భాగాల మధ్య దూరం ఎంత?

జ.



AB, CD రెండు స్తంభాలు అనుకుంటే..

దత్తాంశం ప్రకారం AB = 5 మీ., CD = 12 మీ.

నేలపై స్తంభాల మధ్య దూరం CD = 24 మీ.

పైభాగంలో రెండు స్తంభాల మధ్య దూరం

AC = x మీ. అనుకుంటే..

పటం నుంచి AE = 24 మీ.,

CE = CD–DE =12 – 5 = 7 మీ.


లంబకోణ త్రిభుజం ΔAECలో పైథాగరస్ సిద్ధాంతం ప్రకారం

$x^2 = 24^2 + 7^2 \Rightarrow x^2 = 24^2 + 7^2$

$\Rightarrow x^2 = 625 \Rightarrow x = 25$

∴ పైభాగంలో రెండు స్తంభాల మధ్య దూరం = 25 మీ.

2. లంబకోణ త్రిభుజం ABCలో లంబకోణ శీర్షం C వద్ద ఉంది. P, Qలు వరుసగా AC, BCలపై ఉన్నాయనుకోండి. అయితే $AQ^2+BP^2= AB^2+PQ^2$ అని చూపండి.





జ. లంబకోణ త్రిభుజాలు ΔACQ, ΔPCB ల నుంచి

$(AQ)^2=(AC)^2 + (QC)^2$,

$(BP)^2 = (BC)^2 + (CP)^2$

$\Rightarrow (AQ)^2 + (BP)^2 = [(AC)^2+(QC)^2]$


$+ [(BC)^2+ (CP)^2] =$

$[(AC)^2+(BC)^2] + [(QC)^2+(CP)^2]$

$= AB^2 + PQ^2$

(∵ లంబకోణ త్రిభుజం ABC, PQC ల నుంచి $AB^2= AC^2+BC^2$, $PQ^2= PC^2+ QC^2$)

3.



పై రాంబస్‌లోని రెండు కర్ణాలు వరుసగా 24 సెం.మీ., 10 సెం.మీ. అయితే దాని భుజం పొడవు కనుక్కోండి.

జ. రాంబస్‌లో కర్ణాల వర్గాల మొత్తం.. భుజాల వర్గాల మొత్తానికి సమానం. అంటే..

$(AC)^2+(BD)^2 =$

$(AB)^2+(BC)^2+ (CD)^2 +(DA)^2$

రాంబస్‌లో AB= BC= CD=DA కాబట్టి

$(AC)^2+(BD)^2=$

$(AB)^2+(AB)^2+(AB)^2+(AB)^2 = 4AB^2$

$\Rightarrow (24)^2+(10)^2= 4(AB)^2$


$\Rightarrow 576+100 = 4(AB)^2$

$\Rightarrow 676 = 4(AB)^2 \Rightarrow 169 = (AB)^2$

∴AB = 13 సెం.మీ.

4. 5 సెం.మీ., 12 సెం.మీ., 13 సెం.మీ. భుజాల పొడవులుగా ఉన్న త్రిభుజం ABCలో 13 సెం.మీ. పొడవు ఉన్న భుజానికి దాని ఎదుటి శీర్షం నుంచి గీచిన లంబం పొడవు కనుక్కోండి.

జ. 5, 12, 13 సెం.మీ. భుజాల పొడవులుగా గల త్రిభుజం లంబకోణ త్రిభుజం అవుతుంది. (∵$13^2 = 5^2 +12^2$)



AB =13 సెం.మీ., BC = 5 సెం.మీ.,

AC=12 సెం.మీ. అయినట్లు

ABC ఒక లంబకోణ త్రిభుజం అనుకోండి.

13 సెం.మీ. పొడవున్న భుజానికి



గీసిన లంబం CD = p సెం.మీ. అనుకోండి.

ΔABC వైశాల్యం= $\frac{1}{2}$ భూమి × ఎత్తు

$= \frac{1}{2} \times BC \times AC = \frac{1}{2} \times 5 \times 12 = 30cm^2$

ΔABC వైశాల్యం= $\frac{1}{2}$ భూమి×ఎత్తు

$= \frac{1}{2} \times AB \times CD = \frac{1}{2} \times 13 \times p$


$\Rightarrow \frac{1}{2} \times 13 \times p = 30 \quad \Rightarrow p = \frac{60}{13}$

= 4.6 సెం.మీ. (సుమారుగా)

5. కింది పటం నుంచి


i) pc= ab,

ii) $\frac{1}{p^2} = \frac{1}{a^2} + \frac{1}{b^2}$ అని చూపండి.



6. ఒక సమబాహు త్రిభుజంలో భుజాల వర్గాల మొత్తానికి 3 రెట్లు, ఆ త్రిభుజం మధ్య గతాల వర్గాల మొత్తానికి 4 రెట్లకు సమానమని చూపండి.

7. లంబకోణ త్రిభుజం ΔABCలో $\lfloor B = 90^\circ$ AD, CEలు మధ్యగత రేఖలు AC= 5 సెం.మీ., $AD = \frac{3\sqrt{5}}{2}$ అయితే CE విలువ కనుక్కోండి.



8. (a–1) సెం.మీ. 2√a సెం.మీ. (a+1) సెం.మీ. భుజాలుగా ఉన్న త్రిభుజం లంబకోణ త్రిభుజం అవుతుందా?

9. 5 మీ, 12 మీ, 13 మీ. భుజాలుగా గల త్రిభుజం లంబకోణ త్రిభుజం అవుతుందా? కారణాలు చెప్పండి.

Affixation is the process of adding..



R. Srinivasa Rao

Senior Faculty, Hyderabad



AFFIXATION

An affix is used to alter the meaning or form of a word. It can be either a Prefix or a Suffix.


Definition: Affixation is the process of adding a morpheme - or affix - to a word to create either a different form of that word or a new word with a different meaning.

The two primary kinds of 'Affixation' are prefixation, the addition of a prefix, and suffixation, the addition of a suffix, while clusters of affixes can be used to form complex words.

Prefixes: A prefix is a letter or group of letters attached to the beginning of a word that partly indicates its meaning.

Prefix	*Meaning*	*Examples*
A	Not	Amoral, Apolitical, Atypical
Anti	Against, Opposite of	Antiseptic, Anti-American, Antinuclear, Anti climax, Antiaircraft, Antibody
Bi	Two	Bicycle, Bisect, Bilingual
Co	With, Together	Copilot, Co-worker, Coexist, Co-author
De	Down, Off	Devalue, Deactivate, Degrade, Delink
Dis	Opposite of	Ddisappear, Disagreeable, Disbar, Disagree, Dislike, Disobey
En	Put into, Cover with	Enclose, Entangle, Enslave, Encase
Ex	Former	Ex-president, Ex-serviceman
Hyper	Over, More, Beyond	Hyperactive, Hypersensitive, Hypercritical
Il, Im, In, Ir	Not, Without	Illegal, Illogical, Immoral, Immeasurable, Inconsiderate, Incurable, Irresponsible
Omni	All, Every	Omnivorous, Omniscient, Omnipotent, Omnipresent
Post	After	Postmortem, Posterior, Postscript
Tri	Three	Tricycle, Triangle, Triathlon
Over	Too much, Across	Over-confident, Over-populated
Un	Opposite	Unhappy, Unfair, Untrue
Vice	Next in rank	Vice-president, Vice-principal, Vice-chancellor, Vice-admiral

Note: The difference between prefixes and suffixes is that while prefixes do not change word class (noun to verb or adjective to noun) etc. suffixes mostly change the word class.





Previous and Model Questions

1. Identify the correct suffix for the words given below: *(AP TET - 2015)*

Word	*Suffix*
(a) Doubt	(i) ness
(b) High	(ii) ful
	(iii) ment

1) (a)-(ii), (b)-(iii)
2) (a)-(iii), (b)-(ii)
3) (a)-(ii), (b)-(i)
4) (a)-(iii), (b)-(iii)

A: (3)
Doubtful, Highness.

EXERCISE - I

1. Identify the correct suffixes for the words given below:

Word	*Suffix*
(a) Remark	(i) ise
(b) Discover	(ii) let
(c) Book	(iii) ify
(d) Popular	(iv) able
(e) Pure	(v) y

1) (a) - (ii), (b) - (iii), (c) - (iv), (d) - (i), (e) - (v)
2) (a) - (iv), (b) - (i), (c) - (ii), (d) - (iii), (e) - (v)
3) (a) - (iv), (b) - (v), (c) - (ii), (d) - (i), (e) - (iii)
4) (a) - (iv), (b) - (i), (c) - (v), (d) - (iii), (e) - (ii)

A: (3)

EXERCISE - II

1. Identify the correct suffixes for the words given below.

Word	*Suffix*
(a) Virtue	(i) ize
(b) Love	(ii) ive
(c) Terror	(iii) able
(d) Abuse	(iv) ful
(e) Thank	(v) ous

1) (a) - (v), (b) - (iii), (c) - (iv), (d) - (i), (e) - (ii)
2) (a) - (v), (b) - (iii), (c) - (i), (d) - (ii), (e) - (iv)
3) (a) - (iii), (b) - (iv), (c) - (i), (d) - (ii), (e) - (v)
4) (a) - (iii), (b) - (v), (c) - (i), (d) - (iv), (e) - (ii)

A: (2)

Suffixes: A suffix is a letter or group of letters added at the end of a word to make a new word.

1. The following adjectives get converted into nouns by adding certain suffixes which change the word class of the basic word.

Adjective	*Suffix*	*Noun*
Free	-dom	Freedom
Wise	-dom	Wisdom
Important	-ance	Importance
Permanent	-ence	Permanence
False	-hood	Falsehood
Active, Civil, Human, Real	-ity	Activity, Civility, Humanity, Reality
Dark, Happy, Mad	-ness	Darkness, Happiness, Madness
Hard	-ship	Hardship
Long, Strong	-th	Length, Strength

2. Here are some examples of a verb getting converted into a noun.

Verb	*Suffix*	*- Noun*
Leak	-age	Leakage
Shrink	-age	Shrinkage
Waste	-age	Wastage
Arrive, Refuse	-al	Arrival, Refusal
Accept, Appear	-ance	Acceptance, Appearance
Assist, Inhabit	-ant	Assistant, Inhabitant
Build, Meet, Teach	-ing	Building, Meeting, Teaching

3. Here are a few examples of a noun forming a new word which is also a noun.

Noun	*Suffix*	*Noun*
King	-dom	Kingdom
History	-ian	Historian
Hero	-ism	Heroism
Drama, Motor	-ist	Dramatist, Motorist

4.

Adjective	*Suffix*	*Verb*
Cheap, Deep, Sharp	-en	Cheapen, Deepen, Sharpen
Just, Pure	-ify	Justify, Purify

5.

Noun	*Suffix*	*Verb*
Length	-en	Lengthen
Strength	-en	Strengthen
Class	-ify	Classify
Apology	-ise	Apologise

6.

Noun	*Suffix*	*Adjective*
Comfort	-able	Comfortable
Culture	-al	Cultural
Element	-ary	Elementary
Point	-end	Pointed
Gold	-en	Golden
Beauty	-ful	Beautiful
Help	-ful	Helpful
Sense	-ible	Sensible

7.

Verb	*Suffix*	*Adjective*
Read	-able	Readable
Resist	-ant	Resistant
Digest	-ible	Digestible
Prohibit	-ive	Prohibitive


8.

Adjective	*Suffix*	*Adverb*
Happy	-ly	Happily
Foolish	-ly	Foolishly
Melodious	-ly	Melodiously
Great	-ly	Greatly
Artistic	-ly	Artistically

అంకెలు కలపండి రంగులు వేయండి



పక్కన కింద ఇచ్చిన బొమ్మల పేర్ల మొదటి అక్షరాలను వాటి పైన ఉన్న ఖాళీ గళ్లలో రాయండి. పక్కనే ఉన్న కొంగ పేరు ఇంగ్లీషులో వస్తుంది. కనుక్కోండి. →




కనుక్కోండి

గుర్తించండి


కింద మధ్యలో ఉన్న రంగుల బొమ్మ అసలైన నీడ ఏదో గుర్తించండి. ↓





పైన ఉన్న A కింద ఉన్న Z దగ్గరకు వెళ్లాలి. దారి చూపండి.


కింద ఇచ్చిన గుడ్డులోనుంచి వస్తున్న బాతు బొమ్మను పక్కన ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి.



జవాబులు: కనుక్కోండి: Flamingo గుర్తించండి: F

నాన్నా చెప్పవా

సౌర మండలానికి అవతల అన్నీ పెద్ద గ్రహాలే ఉంటాయా?




మన సౌరమండలంలో సూర్యుని చుట్టూ నిర్దిష్ట కక్ష్యలలో పరిభ్రమిస్తూ 8గ్రహాలు, 166కు పైగా ఉపగ్రహాలు, కొన్ని మరుగుజ్జు గ్రహాలు, కొన్ని వేల కోట్ల సంఖ్యలో ఆస్టరాయిడ్లు, తోక చుక్కలు, ఉల్కలు వంటి ఖగోళ నిర్మాణాలు, ఇంకా అపారమైన నక్షత్ర ధూళి ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. మన సౌరమండలానికి వెలుపల కూడా ఇతర నక్షత్రాల వద్ద ఇలాంటి ఖగోళ నిర్మాణాలు ఉండి ఉండవచ్చునని అంచనా వేసిన శాస్త్రజ్ఞులు, ఆ దిశగా, అంటే అలాంటి వాటి ఉనికిని కనుగొనే దిశగా తమ ప్రయత్నాలను ఏనాడో మొదలుపెట్టారు.

1995లో తొలిసారిగా సౌరమండలానికి వెలుపల వేరే నక్షత్రం చుట్టూ తిరిగే ఒక గ్రహాన్ని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. దీనికి '51 Pegasi B' అని పేరు పెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా వేరే నక్షత్రాల చుట్టూ పరిభ్రమించే అలాంటి 200కు పైగా గ్రహాలను శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. అయితే ఇటీవల కనుగొన్న ఒక గ్రహాన్ని తప్పించి మిగతా వాటినన్నింటినీ పరోక్ష పద్ధతిలోనే కనుగొనడం జరిగింది. ఒక నక్షత్రం చుట్టూ పరిభ్రమించే ఒక గ్రహం దాని పరిభ్రమణంలో భాగంగా అప్పుడప్పుడూ ఆ నక్షత్రానికి అడ్డుగా వచ్చి, దాని కాంతిని కొంచెం మందగింప జేస్తుంది. సరిగ్గా దీనిని, ఇలాంటి మరి కొన్ని కారణాలను ఆధారంగా చేసుకునే శాస్త్రజ్ఞులు ఇతర నక్షత్రాలకు సంబంధించిన గ్రహాలను కనుగొంటున్నారు.

ఇప్పటి వరకు శాస్త్రజ్ఞులు కనుగొన్న ఇతర నక్షత్రాల గ్రహాలన్నీ మన గురుగ్రహం, లేదా అంతకన్నా ఎంతో పెద్దగా ఉండడం విశేషం. ఇటీవల శాస్త్రజ్ఞులు ప్రత్యక్ష పద్ధతిలో (ఫొటోల ద్వారా) కనుగొన్న ఓ గ్రహం మన గురుగ్రహం అంత పెద్దగా ఉండటమే గాక, దీనికి 8 రెట్లు ఎక్కువ ద్రవ్యరాశితో వుంది.

ఏ నక్షత్రానికి చెందిన గ్రహాలైనా, మన సౌరమండలానికి చాలా దూరంగా (కొన్ని వేల కోట్ల మైళ్ళు) ఉండే కారణంగా కేవలం భారీ సైజులోను,, అధిక ద్రవ్యరాశితోను వుండే గ్రహాలు మాత్రమే మన కంటపడుతున్నాయని, మన సాంకేతిక విజ్ఞానం మరింత అభివృద్ధి చెందినప్పుడు సుదూర ప్రాంతాలలో ఉండే చిన్న చిన్న గ్రహాలను కూడా కనిపెట్టడానికి వీలవుతుందని శాస్త్రజ్ఞులు అంటున్నారు.

కింద ఉన్న రెండు బొమ్మల మధ్య 10 తేడాలు ఉన్నాయి. గుర్తించండి.





అక్రమ లే అవుట్‌లపై చర్యలు

• వంద శాతం పన్నుల లక్ష్యం పూర్తి కావాలి • జిల్లా కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్


మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలోని ఆయా గ్రామ పంచాయతీల్లో వెలసిన అక్రమ లే అవుట్‌లపై వెంటనే స్పందించి చర్యలకు చేపట్టాలని కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈఓపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులతో గ్రామ పంచాయతీ ఎజెండాలోని పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అక్రమ లే అవుట్‌లను వెంటనే తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధికి భవిష్యత్ కార్యచరణ తయారు చేసి ఆదర్శంగా నిలపాలని అన్నారు. వంద శాతం పన్నులు వసూళ్లు చేయాలని సూచించారు. స్వచ్ఛభారత్-స్వచ్ఛ గ్రామాల కోసం ట్రైసైకిళ్ల వాడకాన్ని పెంచి ఎక్కడా చెత్త లేకుండా పరిసరాలను పరిశ్రుభంగా ఉంచాలన్నారు. 2016–17 ఆర్థిక సంవత్సరం ఆడిట్ వెంటనే పూర్తి చేయాలని అన్నారు. ఈ నెల 26 వరకు ఎస్‌బీఎం టాయిలెట్స్ లక్ష్యాన్ని పూర్తి చేసి ఓడీఎఫ్ గ్రామ పంచాయతీలుగా ప్రకటించడానికి కృషి చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి కె.నరేందర్, ఈఓపీఆర్‌డీలు సతీశ్, మేఘమాల, శంకర్, సువార్త, రవీందర్, వివేక్, వరలక్ష్మి, బాలకిషన్, రమేశ్ కులకర్ణి, భీమిని శంకర్, చంద్రమౌళి, సత్యనారాయణ, వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఖనిజ ప్రాంతాల అభివృద్ధిపై సమీక్ష

మంచిర్యాలసిటీ: జిల్లా పరిధిలోని ఖనిజ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కర్ణన్ కోరారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఖనిజ ప్రాంతాల అధికారులతో సమీక్ష ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలకు కావాల్సిన నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, అటవీశాఖ, రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. రవాణాశాఖ, సింగరేణి, గ్రామీణాభివృద్ధి సంస్థలు సంయుక్తంగా ప్రభావిత ప్రాంతాల యువతను ఎంపిక చేసి, వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. డీఆర్వో ప్రియాంక, మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాల సింగరేణి జీఎంలు ఎండీ సుభాని, రాఘవులు అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను పేదలకు అందించాలి

కేంద్ర పరిశీలన బృందం సభ్యులు సంజయ్‌రావత్


మాట్లాడుతున్న కేంద్ర పరిశీలన బృందం సభ్యులు

చెన్నూర్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు సక్రమంగా అందించాలని కేంద్ర పరిశీలన బృందం సభ్యులు సంజయ్ రావత్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మల్లేశం అధ్యక్షతన నీటిపారుదల, ఉపాధిహామీ, ఐకేపీ అధికారులతో ప్రభుత్వ పథకాలపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఉపాధిహామీ పథకం ద్వారా తెలంగాణకు హరితహారంలో ఎలాంటి మొక్కలను నాటారు, మొక్కల సంరక్షణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టారు, పండ్ల మొక్కలు నాటారా.. అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఐకేపీ ద్వారా ఎన్ని రుణాలు ఇచ్చారని ఆరా తీశారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా మండలంలో ఎన్ని చెరువుల మరమ్మతులు చేపట్టారు, ఎన్ని ఎకరాల ఆయకట్టు సాగులోకి వచ్చిందని నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపట్టిన పథకాలను అధికారులు చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కేంద్ర పరిశీలన బృందం సభ్యులు సంజీవి కలా, గజేందర్‌సింగ్, ఇరిగేషన్ ఏఈ దామోదర్, ఏపీవో గంగభవాని, ఏపీవో ప్రమీల పాల్గొన్నారు.

టీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడిగా చంద్రశేఖర్



మంచిర్యాలరూరల్(హాజీపూర్): తెలంగాణ విద్యార్థి సంఘం (టీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడిగా గొల్లపల్లి చంద్రశేఖర్ నియామకం అయ్యారు. ఈ మేరకు మంగళవారం టీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నల్లగొండ అంజి నియామక లేఖను విడుదల చేశారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ, తెలంగాణ విద్యార్థి సంఘం అభివృద్ధికి పాటుపడుతూ, విద్యార్థుల సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన టీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగాల నరేందర్, ఓయూ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

హలో సాక్షి..
చెన్నూర్ (ఆర్‌సీ) : 87908 11433, చెన్నూర్‌రూరల్: 96661 54367, మందమర్రి: 81063 85108, జైపూర్: 85209 45664, రామకృష్ణాపూర్: 99892 36655 భీమారం: 9441166869, కోటపల్లి: 9014415943, మందమర్రి రూరల్: 9949703181

నిరంతర విద్యుత్

- భూగర్భజలాలపై ప్రభావం
- ఆటోస్టార్టర్లతో ఇబ్బందులు
- తొలగించాలని విజ్ఞప్తి

కోటపల్లి: లోవోల్టేజీ..వేళపాలా లేని విద్యుత్ కోతలు, రాత్రి వేళ పొలాల వద్ద జాగరణ లాంటి సమస్యలు ఇక ఉండవు. వ్యవసాయానికి నిరంతరం విద్యుత్ అందించేందుకు అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసి అదివారం అర్ధరాత్రి నుంచి 24గంటల విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. నిన్నటి వరకు 9గంటల విద్యుత్‌ను అందించిన అధికారులు 24గంటల నిరంతరంగా విద్యుత్‌ను అందించేందుకు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే దాదాపు 80శాతం వరకు ఆటో స్టార్టర్లను తొలగించారు. ఆటోమేటిక్ స్టార్టర్ల తొలగింపు, 24గంటల విద్యుత్ సరఫరాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని 21గ్రామపంచాయితీలకు గాను 37గ్రామాల్లో 2విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 500 ట్రాన్స్‌ఫార్మర్లు, 1800 వ్యవసాయ కనెక్షన్లున్నాయి. ఈ సబ్‌స్టేషన్లు నుంచి మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ప్రతి సబ్‌స్టేషన్‌లో 4నుంచి 5వరకు ఫీడర్లు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా ఎలాంటి అవాంతరం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నిరంతరం విద్యుత్ సరఫరాను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించారు.


బోరు పంపు

రోజంతా నడిస్తే..

వ్యవసాయానికి 24గంటల విద్యుత్ సరఫరా ప్రారంభించిన నేపథ్యంలో ఆటో స్టార్టర్లను కచ్చితంగా తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. లేకుంటే 24గంటల పాటు బోరుబావుల మోటర్లు కొనసాగితే నీళ్లు ఎక్కువ శాతం వృథా అయ్యే అవకాశం ఉంది. రోజంతా బోర్లు నడిపితే భూగర్భ జలాలు పడిపోయే ప్రమాదం పొంచి ఉందని వ్యవసాయ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. దీనివల్ల డీజిల్ కోసం రైతులు అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉండేది. కానిఇక నుంచి డీజిల్ పంపులతో రైతులకు అవసరం ఉండకపోవచ్చు. ఏదేమైనా ప్రభుత్వం ఉద్దేశం బాగున్నా రైతులు విద్యుత్ సద్వినియోగం చేసుకునే విధానంలో 24గంటల కరెంట్ సరఫరా ఫలాల అందనున్నాయి.

ఆటోస్టార్టర్ల తొలగింపు..

నియోజకవర్గంలో కోటపల్లి, చెన్నూర్, జైపూర్, భీమారం మండలాలో చాలా వరకు రైతులు బోరుబావులపైనే ఆధారపడి పంటలు పండిస్తారు. చెరువులు ఉన్న కొద్దిపాటి మంది రైతులకు మాత్రమే చెరువుల కింద భూములు ఉన్నాయి. అది కేవలం ఒక్క పంటకు మాత్రమే చెరువు నీరు వస్తుంది. బోరు బావులపై ఆధారపడే రైతులు మాత్రమే ఎక్కువగా ఉన్నారు. 24గంటల విద్యుత్ సరఫరాతో రైతులకు కరెంట్ సమస్య చాలా వరకు తీరే ఆవకాశం ఉంది. దీంతో తప్పని సరిగా రైతులు అటో స్టార్టర్లను తొలగించాలని ఇప్పటి వరకు ప్రచారం నిర్వహిస్తున్నారు. విద్యుత్ శాఖా అధికారులు దానిపైనే దృష్టిసారిస్తున్నారు. రైతులు కూడా స్వచ్ఛందంగా అటో స్టార్లర్లను తొలగించుకోవాలని కోరుతున్నారు.

లోపాలు లేకుండా..



ప్రభుత్వం అందిస్తున్న నిరంతర విద్యుత్‌ను ఎలాంటి ఇబ్బందులు లోపాలు లేకుండా ఇవ్వాలి. సాంకేతిక కారణాల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు. అప్పుడే పంటలకు సక్రమంగా నీరందే అవకాశం ఉం టుంది. నిరంతర విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

– కృష్ణదాసు, బోరంపల్లి

కల నెరవేరింది



ప్రభుత్వం చేతల ప్రభుత్వం అని నిరుపించుకుంది. జనవరి 1నుంచి 24గంటలు విద్యుత్‌ను ఇస్తామని చెప్పి మాట నిలబెట్టుకుంది. విద్యుత్ సమస్య లేకుండా పోయింది. నిరంతరం విద్యుత్ సరఫరాతో రైతుల కల నెరవేరింది

–గుర్రం రాజన్న, రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్

రైతులు సహకరించాలి..



రైతులు విద్యుత్ శాఖకు సహకరించాలి. అప్పుడే 24గంటల విద్యుత్ అనుకున్న ఫలితాలు సాధిస్తుంది. తప్పనిసరిగా అటోస్టార్టర్లను తొలగించాలని ప్రచారం ఇప్పటికే చేశాం. మా సిబ్బంది పొలాల దగ్గర తనిఖీలు చేస్తున్నారు. స్వచ్ఛందంగా అటో స్టార్టర్లను తొలగించాలని రైతులను కొరుతున్నాం.

– వెంకటేశ్వర్లు, ఏఈ

పిచ్చిమొక్కలు తొలగించరూ..


ఇరుపక్కల పెరిగిన పిచ్చిమొక్కలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో కొమ్ముగూడెం,ఎస్సీ కాలనీకి వెళ్లాలంటే చెరువుకట్ట మీదుగా వెళ్లాలి. చెరువు కట్ట రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు మొలిచి రమదారి అధ్వానంగా తయారయ్యింది. అధికారులు పట్టించుకుని రహదారిని బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

వాట్సప్ చేయండి

మీ దృష్టికి వచ్చిన సమస్యలు.. మీ చుట్టూ జరిగే అవినీతి అక్రమాలు.. ఆసక్తికర విశేషాలు ఏవైనా సరే... లక్షలాది మందితో పంచుకోవాలనుకుంటున్నారా? అయితే వాటిని మాకు పంపండి. దీనికోసం మీరు చేయాల్సిందల్లా మీరు గమనించిన అంశాల్ని మీ ఫోన్‌లో బంధించి మాకు వాట్సప్ చేయడమే. ప్రాధాన్యతను బట్టి వాటిని మేం ప్రచురిస్తాం. మరెందుకాలస్యం క్లిక్‌మనిపించండి.. వాట్సప్ చేయండి.

మా ఫోన్ నెంబర్ : 8790811433

సేవాగుణం అలవర్చుకోవాలి


దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

కోటపల్లి: విద్యార్థులు చదువుకునే వయసులోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని చదివి అభివృద్ధి చెందాలని ఎస్సై వెంకన్న అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చెన్నూర్ పట్టణానికి చెందిన మార్వాడీలు ఓంప్రకాశ్ గిల్డా, సవితా గిల్డా దంపతులు, దుర్గా శంకర్ సోమాని, బన్సీలాల్ జ్ఞాపకార్థంగా విద్యార్థులకు 80 దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ దాతలను అభినందించారు. విద్యార్థుల కష్టాలను గుర్తించి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు దాతలు స్పందించడం చాలా సంతోషదాయకం అన్నారు. ప్రతి విద్యార్థి ఎంత ఎత్తు ఎదిగినా సేవ గుణాన్ని అలవర్చుకుని తోటి వారికి సేవ చేయాలని దాతలు పేర్కొన్నారు. ముందు ముందు ఇలాంటి కార్యక్రమాలు ఇంకా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నీల మనోహర్, ఉపాధ్యాయులు బాలకృష్ణ, మ్యాట్రీన్ సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులపై శ్రద్ధ వహించండి

కోటపల్లి: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ద చూపాలని, పదిలో వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని ఎంఈవో జగన్ ఆన్నారు. మండలంలోని కోటపల్లి, మల్లంపేట, శెట్‌పల్లి, బమన్‌పల్లి గ్రామాల్లోని పాఠశాలలను మంగళవారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలుసూచనలు చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆన్నారు. అనంతరం కోటపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీ సంపత్ పాల్గొన్నారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో

ఎస్‌ఎన్‌టీ రిజర్వేషన్లు పునరుద్ధరించాలి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నగేశ్ యాదవ్

చెన్నూర్: ప్రభుత్వం గొల్లకురుమలకు ఎస్‌ఎన్‌టీ (సెమి నొమాడిక్ ట్రైబ్స్) రిజర్వేషన్లను పునరుద్ధరించాలని గొల్లకురుమ నవ నిర్మాణ సమితి రాష్ట్ర అధ్యక్షులు దాసరి నగేశ్‌యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన గొల్లకురుమల జిల్లా స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్‌ఎన్‌టీ రిజర్వేషన్ల సాధన కోసం ఫిబ్రవరి 25న హైదరాబాద్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు సిద్ది రమేశ్‌యాదవ్, మండల నాయకులు నరిగె లింగయ్య, ఎదండ్ల బాలేశ్, ఎలుకుచ్చి రాజబాపు, జీర్ల మధూకర్, మేకల రాజు, మద్దూరి రమేశ్, మహేశ్, బుసరి రమేశ సంతోశ్, వినోద్, రాజుకుమార్, మల్లేశ్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

చెన్నూర్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం 2018 క్యాలెండర్లను ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఇన్నారెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల కోసం పీఆర్టీయూ పోరాడుతుందని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గోల మనోహర్, ఎంఈవో రాధాకృష్ణ మూర్తి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మైదం రవి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు దుద్దిళ్ల శంకర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు కొట్టె శంకర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి హస్మత్ అలీ, జిల్లా ఉపాధ్యక్షులు జోడు మధు, తోకల శ్రీధర్, చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మూడు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు బిల్లా తిరుపతయ్య, రషీద్, అంజన్ కుమార్, వరప్రసాద్, భూమేశ్ పాల్గొన్నారు.

సామాజిక స్థితిగతులపై సర్వే


మాట్లాడుతున్న టీమాస్ నాయకుడు

మందమర్రి: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని మండలాల్లో టీమాస్ ఆధ్వర్యంలో సామాజిక సర్వే నిర్వహిస్తున్నామని సంఘం నాయకులు దుర్గం గోపాల్ వెల్లడించారు. సీఐటీయూ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో ఈ సర్వే నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. మందమర్రిలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు సర్వే జరపనున్నట్లు చెప్పారు. సమావేశంలో సభ్యులు జలమొద్దిన్, బాలాజీ, పోషం, బుచ్చయ్య, కాసర్ల రాయలింగు, బీరవేని రవీందర్ తదితరులు పాల్గొన్నారు.





మంచిర్యాలలో..
శ్రీవెంకటేశ్వర–
హలో
ఏషియన్ శ్రీనివాస –
ఎంసీఏ, (మిడిల్ క్లాస్ అబ్బాయి)
లక్ష్మి – టైగర్ జిందా హై
మయూరి – విక్రం 10
తిరుమల(స్ర్కీన్–1)(సీసీసీ)–
హలో
దేవి(స్ర్కీన్–2)(సీసీసీ) –
ఎంసీఏ, (మిడిల్ క్లాస్ అబ్బాయి)



నిరుపయోగంగా సోలార్ దీపాలు

భీమారం: ఒకప్పుడు వ్యవసాయ రంగానికి కేవలం 7 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయడంతో రాత్రి వేళ వెలుగుల కోసం ఏర్పాటు చేసుకున్న సోలార్ లైట్లు కనుమరుగు కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 1 నుంచి వ్యవసాయ రంగానికి 24 గంటల పాటు కరెంట్ ఇస్తామని చెప్పి ముందస్తు గానే గత నాలుగు రోజుల నుంచి సరఫరా చేస్తుంది . ఈ నేపథ్యంలో వేలాది రూపాయలు ఖర్చు చేసి పెట్టిన సోలార్ లైట్లు వృథా కానున్నాయి.

గొర్రెలను అడవుల్లోకి అనుమతించాలి

భీమారం: ప్రభుత్వం యాదవులకు పెద్ద ఎత్తున పంపిణీ చేసిన గొర్రెలను మేత కోసం సమీప అడవుల్లోకి అనుమతి ఇవ్వాలని గొర్రె, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం (జీఎంపీవీఎస్) జిలా అధ్యక్షులు కొమ్ము అశోక్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ ప్రస్తుతం అడవుల్లో కందకాలు తవ్వుతూ పశువులు, గొర్రెలు అడవుల్లోకి వెళ్లకుండా అటవీ శాఖ నిర్బంధం అమలు చేస్తుందని అన్నారు. దీంతో గొర్రెలను మేత కోసం ఎక్కడకు తీసుకెళ్లాలనేది అర్థం కాని విధంగా తయారయిందని అన్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా వేలాది గొర్రెలను ప్రభుత్వం యాదవులకు పంపిణీ చేసిందని అన్నారు. ఈవిషయంలో సంతోష పడ్డ యాదవులకు ఇప్పుడు అటవీ శాఖ తీసుకున్న నిర్ణయాలతో ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో రైతులు సాగు చేస్తున్న భూముల కన్నా అధిక మొత్తంలో అడవులు విస్తరించి ఉన్నాయని చెప్పారు. పురాతన కాలం నుంచి మేత కోసం పశువులు, గొర్రెలు అడవుల్లోకి వెళ్లాయని అన్నారు. ఇప్పుడు ఆంక్షలు విధించడం ద్వారా ఇబ్బంది ఏర్పడుతుందని అన్నారు. ప్రభుత్వం మేత కోసం భూములు కేటాయించనంత వరకు అడవుల్లోకి అనుమతి ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మెండె మల్లేశ్, కొమ్ము తిరుపతి, దారవేని రాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అశోక్ యాదవ్

నేతకానిలపై అణచివేత ధోరణి

భీమారం: స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు దాటుతున్నా నేతకాని కులస్తులు ఇంకా బానిసల్లా జీవిస్తున్నారని తెలంగాణా నేతకాని పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు దుర్గం అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ జాతిలో మెజార్టీ ఉన్న నేతకానిలను అన్ని రంగాల్లో ఇతరులు అణిచి వేస్తున్నారని తెలిపారు. కొత్తపల్లి గ్రామ యూత్ కమిటీని ఎన్నుకున్నారు అధ్యక్షులుగా ఆకుదారి యాదగిరి, ఉపాధ్యక్షులుగా సాగర్, ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా సెగ్యం సందీప్, కార్యదర్శిగా కావేరి ఆనంద్, కోశాధికారిగా సంజీవ్ ఎన్నియ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీరాములు, మండల అధ్యక్షులు అనపర్తి తిరుపతి. ఉపాధ్యక్షులు మాడెం శ్రీనివాస్, మీసాల రాజబాపు, బొడికె కిషన్ పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న అశోక్

గ్రామీణులకు వైద్యసేవలు అందించాలి

జైపూర్: గ్రామీణప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ ఆస్పత్రిలో కల్పిస్తున్న వైద్యసౌకర్యాలపై అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి తెలిపారు. జైపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏఎంఎన్లు, ఆశకార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, హెచ్ఈవో శ్రీనివాస్, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి

జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలి

మందమర్రిరూరల్: అందుగుల పేట గ్రామ పంచాయతీకి చెందిన చిప్పకుర్తి స్వదేశ్ రాజ్ ఐదో రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ దక్కించుకుని జాతీయ పోటీలకు ఎంపిక య్యాడని ఈ నెల 16నుంచి 21 వరకు జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో రాణించి రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు ఆకాంక్షించారు. మంగళవారం సాయంత్రం అందుగుల పేట గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రభుత్వ విప్ నల్లా ఓదెలు స్వదేశ్ రాజ్‌ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సర్పంచ్ లింగాల మల్లయ్య, ఉప సర్పంచ్ లక్ష్మన్ పాల్గొన్నారు.



స్వదేశ్‌రాజ్‌ను సన్మానిస్తున్న విప్ ఓదెలు

కరాటే శిక్షణ తరగతులు ప్రారంభం

చెన్నూర్‌రూరల్: ఆర్ఎంఎస్ఏ ఆధ్వర్యంలో బాలికలకు ఆత్మ రక్షణలో భాగంగా మండలంలోని దుగ్నెపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మంగళవారం కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించారు.ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం బానయ్య మాట్లాడుతూ బాలికలకు కరాటే ఎంతగానో ఉపయోగ పడుతుందని, ఆత్మ రక్షణగా తోడుంటుందని తెలిపారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి రోజు క్రీడల సమయంలో కరాటేలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందులో పాఠశాల హెచ్ఎం బానయ్య, కరాటే ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మార్సీలో సావిత్రిబాయి పూలే జయంతి

చెన్నూర్: పట్టణంలో మండల వనరుల కేంద్రంలో బుధవారం 3 గంటలకు డీటీఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు డీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పత్తి సంతోష్, పోలాస సత్యనారాయణ తెలిపారు. జయంతి వేడుకలకు మహిళ ఉపాధ్యాయురాళ్లు, ప్రజా సంఘాల నాయకులు, నాయకురాళ్లు హాజరు కావాలని కోరారు.

అనుమానితులపై నిఘా ఉంచాలి

భీమారం: గ్రామాల్లో అనుమానాస్పద వక్తులపై కన్నేసి ఉంచాలని ఎస్సై పాడి రాజిరెడ్డి ప్రజలను కోరారు. సోమవారం భీమారం మండలం బూర్గుపల్లిలో నిర్వహించిన జనమైత్రి పోలీస్ కార్యక్రమంలో ఎస్సై రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రజలను రక్షించేందుకే పోలీస్ శాఖ పనిచేస్తుందని అన్నారు. ఇందులో సర్పంచ్ కొత్తకాపు తిరుపతి, పోలీసులు సంప, రవి, జీవన్ ఉన్నారు.

రచయితకు ఘన సన్మానం

చెన్నూర్: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పట్టణానికి చెందిన రిటైర్ట్ ఉపాధ్యాయులు, కవి, రచయిత జక్కెపల్లి నాగేశ్వర్‌రావును పాఠశాల ప్రధానాచార్యులు సద్దనపు సుధాకర్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెన్నూర్ పట్టణానికి చెందిన కవి కుసుమం నాగేశ్వర్‌రావును సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల పోషక కమిటీ అధ్యక్షులు శ్యాంసుందర్ బజాజ్, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కసోజ్జుల కమలాకర్‌రావు, ఉపాధ్యాయులు, మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

రామకృష్ణాపూర్: మండలంలోని శేషపల్లి గ్రామంలో క్రీడాకారుడు ఎం.రమేశ్ స్మారక క్రికెట్ పోటీలను మంగళవారం జెడ్పీటీసీ కంభగోని సుదర్శన్ గౌడ్, కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లాల క్రాంతి ప్రారంభించారు. కార్యక్రమంలో క్యాతనపల్లి సర్పంచ్ జాడి శ్రీనివాస్, వైస్ఎంపీపీ గోపతి రాజయ్య, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాండ్ల సమ్మయ్య, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు మిట్టపల్లి శ్రీనివాస్, రామడుగు లక్ష్మణ్, టీఆర్ఎస్ నాయకులు కుమ్మం సురేందర్, జిలకర మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా మాధవరెడ్డి

భీమారం: వయోవృద్ధుల సంక్షేమ సంఘం భీమారం మండల కమిటీ అధ్యక్షుడిగా రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు గంట్ల మాధవరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షులు బొలిశెట్టి రాజలింగు సోమవారం తెలిపారు. ఈమేరకు రాజలింగు మాట్లాడుతూ వయోభారంతో బాధ పడుతున్న వారిని ఒక వేదిక పైకి తెచ్చి వారికి ప్రభుత్వం కల్పిస్తున్న బస్‌పాస్, రైల్వే పాస్ ఇప్పించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందించడం జరుగుతుందని తెలిపారు. సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

సీసీ రోడ్డుకు క్యూరింగ్ చేపట్టాలి





వేమనపల్లి: గొర్లపల్లిలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డుకు వాటర్ క్యూరింగ్ చేపట్టడం లేదు. డబుల్ రోడ్డు పనుల్లో భాగంగా గ్రామంలో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. రోడ్డు నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాల్సి ఉన్నా కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదు. ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారు. కనీసం వాటర్ క్యూరింగ్ కూడా చేపట్టడం లేదు. ఇక రోడ్డు నాణ్యంగా ఎలా ఉంటుందో తెలపాలి.

- కోడూరి దుర్గయ్య, కేతనపల్లి

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9701909596

న్యూస్ బాక్స్

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

తాండూర్: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష పడ్డట్లు ఎస్సై రవి మంగళవారం విలేకరులతో తెలిపారు. డిసెంబర్ 31న రాత్రి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా మద్యం తాగి వాహనం నడుపుతున్న తాండూర్‌కు చెందిన నల్ల రాజయ్య, మహారాష్ట్రకు చెందిన కినికె అతుల్ పట్టుబడ్డట్లు తెలిపారు. వీరిని బెల్లంపల్లి కోర్టులో హాజరుపరచగా జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రసాద్ ఇరువురికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వెల్లడించారు.

పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్

కాసిపేట: ఉపాధ్యాయ సంఘం పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా స్థానిక జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు సంబరం శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి ప్రకటించారు. తనపై నమ్మకంతో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోవడం పట్ల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కంది కరుణకర్‌రెడ్డి, దామోదర్, శ్రీనివాస్, అరవింద్ కుమార్ తదితరులున్నారు.

పీఆర్టీయూ నుంచి టీయూటీఎఫ్‌లో చేరిక

కాసిపేట: మండలంలోని తాటిగూడ హెచ్ఎం భీంరావు మంగళవారం పీఆర్టీయూ నుంచి టీయూటీఎఫ్‌లో చేరారు. ఆయనకు సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రేంరావు సభ్యత్వం అందజేసి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం టీయూటీఎఫ్‌తోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సీపీఎస్ రద్దుకు పూర్తిస్థాయిలో ఉద్యమించనున్నట్లు తెలిపారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో రోడ్ల విస్తరణపై అధికారుల శ్రద్ధ ఆరంభ శూరత్వంలాగే మిగిలింది. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రజల కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. బెల్లంపల్లి పట్టణంలోని ప్రధాన రహదారిని విస్తరించడానికి చూపించిన శ్రద్ధాసక్తులు అంతర్గత రోడ్ల విషయంలో కనబర్చడం లేదు. నాన్చుడు ధోరణి ప్రదర్శిస్తూ మీనమేషాలు లెక్కిస్తున్నారు.



ఆంధ్రాబ్యాంకు లైన్‌లోని ఓ వీధిలో కూల్చివేసిన కట్టడాలు

ఆరంభశూరత్వం..

రోడ్ల విస్తరణపై హడావుడితోనే సరి

- ప్రధాన రహదారితోనే డీలా
- అంతర్గత రోడ్లపై దృష్టి ఏదీ?



ఇరుకుగా బుధాకుర్దుకు వెళ్లే రోడ్డు

మున్సిపాలిటీలో ఆరునెలల క్రితం రోడ్ల వెడల్పు పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న అక్రమ కట్టడాలను తొలగించారు. కాంటా చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు రోడ్డుకిరువైలా మురుగు నీటి కాలువల మీద ఉన్న షెడ్లు, గద్దెలను బలవంతంగా తొలగించారు. ఇందుకు ఎంతో ఆర్భాటం ప్రదర్శించారు. వీధులను మూసివేసి నిర్మాణం చేసిన కట్టడాలను పడగొట్టించారు. ఆంధ్రా బ్యాంకు లైన్‌లో ఉన్న ఓ వీధిలో నిర్మించిన కట్టడాలను పడగొట్టించి అంతర్గత రోడ్డును ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

కాల్‌టెక్స్ ఏరియా రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి ఏఎంసీ ఏరియా మీదుగా పాత బస్టాండ్ వరకు సర్వే చేశారు. అడ్డుగా ఉన్న నిర్మాణాలను పడగొడతామని స్పష్టం చేశారు. ఈ మేరకు కొన్ని చోట్ల కూల్చివేతలను నిర్వహించిన అధికారులు ఆ తర్వాత నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారు.

మార్కింగ్ వేసినా...

రోడ్ల విస్తరణ కోసం మున్సిపల్ అధికారులు ఆదిలో ఎంతో హడావుడి చేశారు. అక్రమంగా రోడ్లను ఆనుకుని నిర్మించిన కట్టడాలను తీసివేస్తామని ప్రకటించి మార్కింగ్ కూడా చేశారు. కాంటా చౌరస్తా నుంచి బెల్లంపల్లి బస్తీ మీదుగా పోశమ్మ గడ్డకు వెళ్లే రోడ్డు, పాత బస్టాండ్ నుంచి బుధాకుర్దు వెళ్లే రోడ్డును, బజారు ఏరియా ప్రాంతంలో రాంమందిర్ ఏరియా, డబ్బుసెట్ లైన్‌లో అంతర్గత రోడ్లను విస్తరించేందుకు అప్పట్లో సన్నద్ధమయ్యారు. కానీ ఆ తర్వాత యత్నాలను అర్ధాంతరంగా విరమించుకున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు..

రోడ్ల విస్తరణ జరగకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రధాన రహదారిపై పలు చోట్ల ఫౌంటెన్లను నిర్మించారు. ఏఎంసీ ఏరియా, మున్సిపల్ కార్యాలయం ఎదుట, చౌడేశ్వరి, పాత బస్టాండ్, పాత జీఎం కార్యాలయం క్రాస్ రోడ్ వద్ద రోడ్డుకు ఇరువైపుల అడ్డంకిగా ఉన్న నిర్మాణాలను తొలగించలేదు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మరోవైపు కాంటా చౌరస్తా నుంచి బెల్లంపల్లి బస్తీకి వెళ్లే మార్గం, పాత బస్టాండ్ నుంచి బుధాకుర్దుకు వెళ్లే మార్గాల్లో, బజారు ఏరియా నుంచి వీధులలో వెళ్లే రోడ్లు ఇరుకుగా ఉండి సరుకులు రవాణా చేసే వాహనాలు లోనికి సరిగా వెళ్ల లేకపోతున్నాయి. ఇప్పటికైనా రోడ్ల వెడల్పు పనులు ప్రారంభించి అసౌర్యం కలగకుండా చూడాలని పుర ప్రజలు కోరుతున్నారు.

గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

కాసిపేట: గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. మండలంలోని ఎమ్మెల్యే దత్తత గ్రామం మల్కేపల్లిలో యువకులు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసిన కమాన్, రూ.5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో అంతర్గత రోడ్లు, ఆలయ నిర్మాణం, క్రీడాకారులకు మైదానం, చెరువులకు కాలువలు, కమ్యూనిటీహాల్ తదితర సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి రూ.40లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నర్సింగం, జెడ్పీటీసీ సభ్యుడు రౌతు సత్తయ్య, పీఏసీఎస్ చైర్మన్ వంశీధర్‌రావు, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణరెడ్డి, ఎంపీడీవో అబ్దుల్ హై, సర్పంచ్ ప్రభాతరావు, నాయకులు పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ..

ఉపాధ్యాయ సంఘం టీయూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే మల్కేపల్లిలో విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రేంరావు, కార్యదర్శి శంకర్, ఎం.లక్ష్మణ్, మండలాధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి మల్లేష్, నాయకులు లక్ష్మారాం, రాజ్‌కుమార్, మాంతయ్య, భూమయ్య, సత్తయ్య, రాజేశ్వర్‌రావు తదితరులున్నారు.

సుప్రియకు ఆర్థిక సహాయం

బెల్లంపల్లి: జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన మండలంలోని చాకేపల్లికి చెందిన జాడి సుప్రియకు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆర్థిక సహాయం చేశారు. మంగళవారం మంచిర్యాలలోని ఆయన స్వగృహానికి ఆహ్వానించి రూ.20 వేల నగదు అందజేశారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. పట్టణానికి చెందిన టీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ బడికెల శ్రావణ్ సుప్రియకు రూ.5వేల నగదు అందజేశారు. సుప్రియ ఈనెల 13, 14 తేదీల్లో కోల్‌కత్తాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందని కరాటే మాస్టర్ ఆవుల రాజనర్సు తెలిపారు.

లోకల్ వాయిస్

మెడికల్ కళాశాల కావాలి



బెల్లంపల్లిలో ప్రభుత్వం వెంటనే మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలి. గతంలో మంజూరు చేసిన మెడికల్ కళాశాలను రద్దు చేశారు. జిల్లా కోసం పోటీ పడిన బెల్లంపల్లిని ప్రభుత్వం విస్మరించింది. కనీసం మెడికల్ కళాశాలనైన మంజూరు చేసి బెల్లంపల్లికి భవిష్యత్ కల్పించాలి.

- కె.శ్రీనివాస్, బెల్లంపల్లి

తిరుపతి రైలు ప్రారంభించాలి



బెల్లంపల్లి నుంచి తిరుపతికి ఐదేళ్ల క్రితం సూపర్‌ఫాస్ట్ రైలు ఏర్పాటుకు సన్నాహాలు జరిగాయి. ఆ తర్వాత ఆ ప్రక్రియ నిలిచిపోయింది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఆగిపోయిన యత్నాలను పునః ప్రారంభించాలి. తిరుపతికి రైలు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇప్పించాలి.

- ఆర్.రాజం, బెల్లంపల్లి



హలో
రామకృష్ణ (బెల్లంపల్లి)
11.15, 2.15, 6.15, 9.15
ఎంసీఏ
బాలాజీ (బెల్లంపల్లి)
11.15, 2.15, 6.15, 9.15
ఎంసీఏ
వెంకటరమణ
(కాగజ్‌నగర్)11.00,2.00, 6.00, 9.00



నెలకొరుగుతున్న భారీ వృక్షాలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి చౌడేశ్వరి ఏరియాలో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న భారీ వృక్షాలు నేలకొరుగుతున్నాయి. మంగళవారం పలు భారీ వృక్షాలు నరికి వేతకు గురయ్యాయి. ఏపుగా ఎదిగిన వృక్షాలను సంరక్షించాల్సింది పోయి పట్టపగలు నిర్దాక్షిణ్యంగా నరికి వేయించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా విస్తారంగా మొక్కలు నాటాలని సూచించిన అధికారులు పెరిగిన చెట్లు నరికివేతకు గురైన పట్టింపు చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా భారీ చెట్లను నరికి వేయించడం పట్ల పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీపీఎస్ రద్దు సామాజిక అంశం



క్యాలెండర్ విడుదల చేస్తున్న నాయకులు

కాసిపేట: ఉద్యోగులకు సంబంధించి కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను ప్రభుత్వం సామాజిక సమస్యగా చూడాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి కోరారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. సీపీఎస్ రద్దు కోసం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి కమిటీలతో పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు కంది కరుణాకర్‌రెడ్డి, నాయకులు జీదుల దామోదర్, శ్రీనివాస్, అరవిందకుమార్ ఉన్నారు.

టీయూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

నెన్నెల: టీయూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో శ్రీధర్‌స్వామి, మైలారం పాఠశాల హెచ్‌ఎం లింగయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు పద్మారావు, ప్రధాన కార్యదర్శి డి.స్వామి, జిల్లా కార్యదర్శి దేవదాస్, స్వప్న, శారద, నాయకులు రవీందర్, కిషోర్, సునీల్ పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లు తొలగింపు



జేసీబీతో కాలువను చెరుపుతున్న దృశ్యం

బెల్లంపల్లి: మున్సిపాలిటీ కాల్‌టెక్స్ ఏరియాలో అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌ను మున్సిపల్ అధికారులు మంగళవారం తొలగించారు. అనుమతి లేకుండా లే అవుట్ ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయాలు చేస్తున్నారనే సమాచారంతో మున్సిపల్ కమిషనర్ ఆర్.రాజు, టీపీఎస్ సంపత్, రెవెన్యూ అధికారి జి.మల్లారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శంకర్ లేఅవుట్ ప్రాంతంలో మురుగు నీటి కాలువలు, హద్దురాళ్లను జేసీబీతో తొలగించారు. ఇంటి నిర్మాణం కోసం తవ్విన పునాదిని పూడ్చి వేశారు. సమాచారం అందుకున్న వెంచర్ నిర్వహకులు శివ, సత్యనారాయణ ,హానీఫ్, మాజీ కౌన్సిలర్ నెల్లి రమేశ్ తదితరులు అక్కడికి చేరుకుని కమిషనర్ రాజు, టీపీఎస్ సంపత్‌తో వాగ్వివాదం చేశారు. నిబంధనల ప్రకారమే లేఅవుట్ చేశామని, కేవలం అడిగిన డబ్బులు ఇవ్వనందుకే కూల్చివేత చర్యలకు పాల్పడుతున్నారని అధికారులతో తేల్చి చెప్పారు. లేఅవుట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ అధికారులు సూచించారు. దీంతో కూల్చివేత పనులను ఆపి అధికారులు అక్కడి నుంచి వెళ్లి పోయారు. కాగా సింగరేణి ఏరియా ఆస్పత్రి ఎదుట భూమిలో అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారని మున్సిపల్ అధికారులు అక్కడికి వెళ్లి కూల్చివేత చర్యలకు సిద్ధపడ్డారు. నిర్మాణదారులు అడ్డుకున్నారు. కొంతమంది కౌన్సిలర్లు గడువు కోరడంతో అక్కడి నుంచి అధికారులు వెనుదిరిగారు.

విద్యార్థులకు దోమ తెరలు పంపిణీ

నెన్నెల: మండల కేంద్రంలోని కస్తూరిబా విద్యార్థినులకు మంగళవారం సర్పంచ్ ఆస్మా దోమ తెరలు పంపిణీ చేశారు. జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈ తెరలు పంపిణీ చేసినట్లు హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ తెలిపారు. మొత్తం 161 మంది విద్యార్థులకు తెరలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, ప్రిన్సిపాల్ పద్మజా, సూపర్‌వైజర్ మేర్సీ, ఏఎన్‌ఎం ఇందిరా, మల్లేశ్వరి, లలిత, హెల్త్ అసిస్టెంట్లు రాజ్‌కుమార్, ప్రభాకర్, ఆశ కార్యకర్తలు విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

గిరిపుత్రులకు పోలీసుల సహకారం

- ఏసీపీ బాలుజాదవ్



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఏసీపీ, పోలీసులు, సింగరేణి అధికారులు

తాండూర్: గిరిజనులకు పోలీసుల సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని ఏసీపీ బాలుజాదవ్ పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ అబ్బాపూర్, బెజ్జాల గిరిజన గ్రామాల నుంచి బీర్సాయిగూడకు తాండూర్ సీఐ జనార్దన్‌రెడ్డి, మాదారం ఎస్సై రాములు ఆధ్వర్యంలో సింగరేణి సహకారంతో నూతనంగా వేస్తున్న రోడ్డు పనులను ఏసీపీ ప్రారంభించారు. పనుల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అబ్బాపూర్‌లో మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. తమ పరిధిలో లేని వాటిని కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామన్నారు.

పోలీసు కమిషనర్ రాకతో...

రామగుండం పోలీసు కమిషనర్ విక్రమ్‌జిత్ దుగ్గల్ గత డిసెంబర్ 28న అబ్బాపూర్ గ్రామంలో పర్యటించడంతో ఆ గిరిజనుల రోడ్డు సమస్య పరిష్కారానికి నోచుకుంది. కమిషనర్ పర్యటన సందర్భంగా గిరిజనులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఇబ్బందులను పరిష్కరించాలని కమిషనర్ కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కదిలిన యంత్రాంగం బెజ్జాల గ్రామం నుంచి బీర్సాయి గూడెం వరకు 4 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు ప్రారంభించింది. కార్యక్రమంలో తహసీల్దార్ రామచంద్రయ్య, ఎంపీడీవో భాస్కర్, ఎస్సై రవి, ఓసీ -2 మేనేజర్ రమేశ్, రక్షణాధికారి జనార్దన్, తదితరులున్నారు.

'మిషన్'తో భూములు సస్యశ్యామలం

- ఎమ్మెల్యే చిన్నయ్య



మట్టి తవ్వుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: మిషన్‌కాకతీయ పథకంలో భాగంగా చెరువుల పునరుద్ధరణతో బీడు భూములు సస్యశ్యామలంగా మారుతాయని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. మండలంలోని బుధాకుర్దులో రూ.31 లక్షల అంచనాతో అక్కాచెల్లెళ్ల చెరువు పునరుద్ధరణ పనులను మంగళవారం ఎమ్మెల్యే భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏళ్ల తరబడి ఆదరణకు నోచుకోకుండా ఉన్న చెరువులను గుర్తించి పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. సాగుతో పాటు చెరువులపై ఆధారపడ్డ జాలరులు, బెస్త కులస్తులకు చేపల పెంపకంతో ఉపాధి లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుభాష్‌రావు, సర్పంచ్ వి.కృష్ణమూర్తి, మాజీ జెడ్పీటీసీ సత్యనారాయణ, టీఆర్‌ఎస్ నాయకులు కొమ్మెర లక్ష్మణ్, దుర్గం గోపాల్, భాగ్యలక్ష్మీ, రఘు, అధికారులు పాల్గొన్నారు.

గుడుంబా తయారు చేస్తే చర్యలు

తాండూర్: గ్రామాల్లో నాటుసారా, గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ దీపక్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కిష్టంపేట, తంగళ్లపల్లి గ్రామాల్లో నాటుసారా తయారు చేసే అనుమానితులు సుకన్య, సాగర్, చిన్నక్క, శంకర్, లింగయ్యను అదుపులోకి తీసుకుని తహసీల్దార్ రామచంద్రయ్య ఎదుట బైండోవర్ చేశారు. ఇకపై నాటుసారా, గుడుంబా తయారీ మానుకోవాలని సూచించారు. అనంతరం రూ. లక్ష పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు నర్సింహాచారి, ప్రభాకర్, సిబ్బంది రాజేంద్రప్రసాద్, సతీష్, మహేష్, దిలీప్, శిరీష, తదితరులున్నారు.

ఇంటర్వ్యూ

అర్హులైన మహిళలకు రుణాలు ఇస్తాం

అంశం : స్వయం సహాయక సంఘాలు
కోనయ్య, ఐకేపీ ఏపీఎం, భీమిని



భీమిని: స్వశక్తి సంఘాలను ప్రోత్సహిస్తూ అర్హులైన ప్రతి మహిళకు రుణాలు అందజేస్తామని ఐకేపీ ఏపీఎం కోనయ్య తెలుపుతున్నారు. భీమిని, కన్నెపల్లి మండలాల్లో సంఘాలు, రుణాల పై 'సాక్షి' ఆయనను పలకరించింది.

సాక్షి: రెండు మండలాల్లో సంఘాలు ఎలా పనిచేస్తున్నాయి.?

ఏపీఎం: భీమిని మండలంలో 13 వీఓఏ సంఘాలకు గాను 246 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో 3270 మంది సభ్యులున్నారు. కన్నెపల్లి మండలంలో 19 వీఓఏలకు గాను 387 స్వయం సహాయక సంఘాలలో 3,933 మంది సభ్యులున్నారు.

సాక్షి: ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ లక్ష్యం.?

ఏపీఎం: 2017- 18 సంవత్సరంలో స్వయం, సహాయక సంఘాలకు భీమిని మండలంలో 171 సంఘాలకు గాను రూ.4.26 కోట్లు రుణాలు ఇవ్వాల్సి ఉంది. వీటిలో 75 సంఘాలకు రూ.2.14 కోట్లు ఇచ్చాం. కన్నెపల్లి మండలంలో 324 సంఘాలకు రూ.7.60 కోట్లు రుణాలు ఇవ్వాల్సి ఉండగా 52 సంఘాలకు గాను రూ.1.31 కోట్లతో రుణాలు అందించాం.

సాక్షి: రుణాల రికవరీ ఎలా ఉంది.?

ఏపీఎం: భీమిని మండలంలో 21 సంఘాలకు గాను రూ.46 లక్షలు, కన్నెపల్లి మండలంలో 32 సంఘాలకు గాను రూ.23 లక్షలు రికవరీ చేయాల్సి ఉంది. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ అర్హులైన మహిళలందరిని సంఘాల్లో చేర్పాలనే లక్ష్యంగా పెట్టుకున్నాం. కొత్త సంఘాలు కూడా ఏర్పాటు చేస్తున్నాం.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ప్రదర్శన అంశంతో విద్యార్థులు, సింగరేణి పాఠశాల ఉపాధ్యాయులు(ఫైల్)

- సైన్స్‌ఫేర్‌లో రాణిస్తున్న సింగరేణి విద్యార్థులు
- వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

వినూత్న ఆలోచనలకు శ్రీకారం

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్నారు. ఓ వైపు చదువులు మరో వైపు క్రీడలతో పాటు కొత్త కొత్త ఆలోచనలకు పదును పెడుతూ సైన్స్‌ఫేర్, సైన్స్ ఎగ్జిబిషన్‌లలో పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. గత నెల జిల్లా కేంద్రంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మాథ్స్, సైన్స్ టాలెంట్ టెస్టులో పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాఠశాల విద్యార్థి ఏ. ప్రశాంత్ మొదటి స్థానంలో నిలిచి శెభాశ్ అనిపించుకున్నాడు.

నీటి సంరక్షణపై ఆకట్టుకునే ప్రదర్శన..

డిసెంబర్ 5, 6వ తేదీల్లో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి మ్యాథ్స్, సైన్స్, ఎన్విరాన్‌మెంట్ ఎగ్జిబిషన్‌లో నిర్వహించారు. ఇందులో గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి పాఠశాలలో పదోతరగతి విద్యార్థి ప్రశాంత్ 'మన ఊరు మన చెరువు నీటి సంరక్షణ' అనే అంశంపై నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈప్రదర్శన మొదటి బహుమతిని సాధించిపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో పాటు నీటి వనరుల లభ్యత, వినియోగంపై ఆకట్టుకునే రీతిలో ప్రదర్శనను అందించాడు. వర్షపు నీటిని సక్రమంగా ఉపయోగించుకుంటే ప్రాణకోటికి కలిగే ఉపయోగాలతో పాటు పర్యావరణ పరిరక్షణను ఎలా కాపాడుకోవాలో చక్కగా వివరించాడు. కొండకోనల్లో కురిసే వర్షం నీరు కాలువలు, వాగులు వంకల్లో పడి వృథా పోకుండా కొండలు, అడవుల్లో చెక్‌డ్యాంలను నిర్మించడంతో భూగర్భ జలాలు వృద్ధి చెందడంతో పాటు అడవుల్లోని వన్యప్రాణులకు సైతం తాగేందుకు పుష్కలంగా నీరు లభిస్తుంది. అంతరించిపోతున్న అడవుల వల్ల వర్షపాతం తగ్గుతుందని హరితహారంలో మొక్కలు నాటాలని ప్రశాంత్ వివరించాడు. కురిసిన వర్షపు నీటిని కుంటలు, చెరువులకు మళ్లించి పంట పొలాలకు నీరందించే పద్ధతిని వివరించాడు. మరోవైపు ప్రాజెక్టు ద్వారా మిషన్ భగీరథ ద్వారా గ్రామాలకు, ఇంటిమీద పడ్డ వర్షపు నీరు వృథా పోకుండా ఇంకుడు గుంతలు, పంట పొలాల్లో వ్యర్థాలను కాల్చడంతో కలిగే కాలుష్యాన్ని నివారించడం, అవే వ్యర్థాలతో సేంద్రియ ఎరువుల్ని తయారు చేసి పంటలు పండించే పద్ధతిని ప్రదర్శించి శెభాష్ అనిపించాడు. 250కి పైగా ఇచ్చిన ప్రదర్శనలో ప్రశాంత్ ఇచ్చిన ప్రదర్శన మొదటి స్థానంలో నిలవడంతో వరంగల్‌లో డిసెంబర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం పాల్గొని ప్రతిభ కనబర్చాడు.

ఆసక్తిని బట్టి ప్రోత్సహిస్తున్నాం

పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఆసక్తిని బట్టి వారిని ఆయా రంగాల్లో రాణించేందుకు మావంతుగా ప్రోత్సాహాన్ని అందిస్తున్నాం. ఇప్పటికే పాఠశాలకు చెందిన అనేక మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడల్లో పతకాలు సాధించగా, జిల్లా స్థాయి సైన్స్ ఫేర్ పోటీల్లోనూ విజేతలుగా నిలిచారు. రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో పాల్గొన్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు మావంతు కృషిని అందజేస్తున్నాం.

- వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం, సింగరేణి పాఠశాల

పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు

సరైన ఆలోచనా విధానాలతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు. అవే అంశాలను ప్రాజెక్టు ద్వారా వివరించాం. అన్ని విధాలా వర్షపు నీటిని ఎలా ఉపయోగించుకోవచ్చో తెలపడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన వి ధానాన్ని వివరించాం. వరంగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా విద్యార్థి ప్రతి భకనబర్చాడు.

- మనోహర్ గైడ్, టీచర్



నీటి వృథాను అరికట్టాలనే లక్ష్యంతో..

అన్ని జీవరాశులకు నీరు ఎంతో అవసరం. కానీ సరైన ఉపయోగం లేక వర్షపు నీటిని వృథా చేసుకుంటున్నాం. అలాంటి వర్షపు నీటిని ఒడిసి పట్టుకుంటే మనుషులతో పాటు జంతువులకు ఎంతో ఉపయోగాలున్నాయి. భూగర్భ జలాలు సైతం వృద్ధి చెందుతాయి. ప్రాజెక్టు కోసం ఉపయోగించిన వస్తువులన్నీ భూమిలో కలిసిపోయే వాటితోనే తయారు చేశా. దాంతో జిల్లా స్థాయిలో మొదటి బహుమతి వచ్చింది. గత నెలలో వరంగల్‌లో సైతం ప్రదర్శన ఇచ్చాను.

- ప్రశాంత్, విద్యార్థి



- ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తున్న మహిళా టీచర్లు
- పేదరికాన్ని జయించి జ్ఞానం పంచుతూ..
- వినూత్నంగా బోధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న టీచర్లు
- నేడు సావిత్రిబాయి ఫులే జయంతి

ఆదిలాబాద్ టౌన్: అజ్ఞాన చీకటిని పారద్రోలి విజ్ఞాన కాంతులు వికసింప జేసే వారే ఉపాధ్యాయులు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఉన్న విలువ మరో వృత్తికి లేదు. డాక్టర్, లాయర్, ఇంజినీర్, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కావాలన్నా గురువుల బోధన తప్పనిసరి. అలాంటి విద్యను బోధించే వారే ఉపాధ్యాయులు. ఉపాధ్యాయులే లేని సమాజంలో గుర్తింపు, సమాజంలో రాజకీయ నాయకులకు కూడా గురువు బోధన అండగా ఉండాల్సిందే. అంతటి ప్రాధాన్యం ఉపాధ్యాయులది. తెల్లకాగితంలాంటి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసి వారు ఉన్నత స్థాయికి చేరుకునేలా తీర్చిదిద్దుతారు. విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారంటే కుటుంబీకుల తర్వాత సంతోషించేది గురువులే. బుధవారం మొదటి మ హిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి.. మహిళా టీచర్స్‌డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

అంధ ఉపాధ్యాయురాలు సాధనరెడ్డిని ఇంటికి తీసుకెళ్తున్న విద్యార్థులు



వనితా లోకానికి ఆదర్శం

బోధన స్ఫూర్తిదాయకం..



విద్యార్థులను ప్రేమగా, ఆప్యాయంగా పలకరిస్తూ, మంచి మాటలతో ఆకట్టుకుంటూ, వారికి అర్థమయ్యే రీతిలో పాఠాలను బోధిస్తున్నారు ఆదిలాబాద్‌కు చెందిన ఫిజిక్స్ ఉపాధ్యాయురాలు సునిత. ఈమె ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. 1996లో ఎస్జీటీగా ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. మొదట ఆదిలాబాద్ మండలంలోని లోకారి పాఠశాలలో విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత 2002లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది పట్టణంలోని బాలికల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో సమయపాలన, విద్యార్థులకు అర్థమయ్యేలా వినూత్న బోధన చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఉత్తీర్ణత శాతం పెంచడంలోనూ ఎంతగానో కృషి చేస్తున్నారు. విద్యార్థులకు సైన్స్ పట్ల మక్కువ పెంచుతూ విద్యార్థులకు ఫిజిక్స్ అంటే భయం లేకుండా బోధన చేపడుతున్నారు. విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహిస్తూ సునిత ముందుకు సాగుతున్నారు.

చూపులేకున్నా.. దారిచూపుతూ..



తనకు కంటి చూపు లేకపోయినా ఎందరో మంది విద్యార్థులకు చదువు నేర్పుతూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తోంది ఈ ఉపాధ్యాయురాలు. సకలాంగులకు ఏ మాత్రం తీసిపోని విధంగా విద్య బోధన చేస్తుంది. వైకల్యాన్ని జయించి ఆత్మస్థైర్యంతో ఉన్నత చదువు చదివి ఉపాధ్యాయురాలిగా ఎదిగింది. తలమడుగు మండలం సుంకిడి గ్రామానికి చెందిన అల్లూరి సుదర్శన్‌రెడ్డి– చంపావతి దంపతుల కూతురు సాధన రెడ్డికి పుట్టుకతో కంటిచూపు లోపం ఉంది. అయినప్పటికీ మనోధైర్యం కోల్పోకుండా చదువును కొనసాగించింది. హైదరాబాద్‌లోని బ్లయిండ్ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివారు. ఆ తర్వాత అక్కడే నోబెల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్, కోఠి ఉమెన్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి ఆతర్వాత టీపీటీ చేశారు. 2002లో డీఎస్సీ ద్వారా సాధనరెడ్డి ఉపాధ్యాయ కొలువును సాధించారు. ప్రస్తుతం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గ్రేడ్–2 తెలుగు పండితురాలుగా పని చేస్తున్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు తెలుగు బోధన చేస్తున్నారు. తాను ఇంటి వద్ద బ్రెయిలీ లిపిలో పాఠాలను చదువుకొని పాఠశాలలో బోధన సాగిస్తున్నారు. అందరు గురువులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కంటిచూపు లేనప్పటికీ ఎందరో మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఈమెను పలువురు అభినందిస్తున్నారు. సంవత్సరంలో ఒక్కరోజు కూడా పాఠశాలకు సెలవుపెట్టి గైర్హాజరు కాలేదంటే ఆమెకు వృత్తి పట్ల ఎంత నిబద్ధత ఉందో ఇట్టే అర్థమవుతోంది. సమయపాలన పాటించడంలోనూ ఆమె ముందుంటారు. ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆమె సోదరుడు సందీప్‌రెడ్డి కూడా అంధుడే ఆయన కూడా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న మక్కువతోనే ఈ వృత్తిని ఎంచుకున్నానని సాధనరెడ్డి తెలిపారు. ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ అలుపెరగని దీక్షతో తల్లిదండ్రుల సహకారంతో ముందుకు సాగుతున్నానని ఆమె చెప్పారు.

బోధనలో వినూత్నం



తరగతి గదిలో విద్యార్థులకు బోధిస్తున్న మమత



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న రామగిరి మమత విద్యార్థులకు తనదైన రీతిలో విద్యను బోధిస్తున్నారు. వాంకిడి మండల కేంద్రానికి చెందిన రామగిరి దయాకర్, పార్వతి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. మొదటి కుమార్తె మమత చిన్ననాటి నుంచి చదువులో ముందుండేవారు. ఆమె ప్రాథమిక విద్య వాంకిడిలోని ప్రభుత్వ పాఠశాలలో, ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు కాగజ్‌నగర్ నవోదయ పాఠశాలలో చదివారు. గణితంలో ముందున్న మమత ఇంటర్ తర్వాత హైదరాబాద్‌లో బీఎస్సీ డిగ్రీ, ఆసిఫాబాద్‌లో బీఎడ్ పూర్తి చేశారు. 2008 డీఎస్సీలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం ఆసిఫాబాద్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా తనదైన శైలిలో విద్యాబోధన చేస్తూ విద్యార్థుల్లో దాగున్న లెక్కల భయాన్ని తొలగిస్తున్నారు. చదువుకు పేదరికం అడ్డు రాదని, విద్యార్థులను ఉన్నతులుగా తీర్చి దిద్దడమే తన లక్ష్యమని మమత పేర్కొంటున్నారు.

హిందీ బోధనలో దిట్ట ఉర్మిళ



విద్యార్థులకు బోధిస్తున్న ఉర్మిళ



ఆసిఫాబాద్: చదువుకు పేదరికం అడ్డు రాదని నిరూపించారు జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పని చేసే హిందీ ఉపాధ్యాయురాలు రత్నం ఉర్మిళ. వాంకిడి మండలం ఖమాన గ్రామానికి చెందిన రైతు రాము, సుందరబాయి దంపతుల కుమార్తె ఉర్మిళ. బీఏ హిందీ లిటరేచర్ పట్టా సాధించారు. 2012 డీఎస్సీలో హిందీ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించారు. విద్యార్థులకు ఆట పాటల ద్వారా విద్యాబోధన చేస్తున్నారు. మహిళల ఉన్నతికి చదువే ఆయుధమని, సమస్యలకు చదువే పరిష్కారమని, ప్రతీ బాలిక విద్యావంతురాలు కావాలని ఆమె పేర్కొంటున్నారు. నేటి విద్యార్థులు టీవీ, ఇంటర్నెట్‌కు దూరంగా ఉండాలని, జీవితంలో స్థిరపడ్డాకే వివాహం చేసుకోవాలని ఆమె సూచిస్తున్నారు.

పేదరికాన్ని జయించి..



చెన్నూర్: మండలంలోని ఆస్నాద గ్రామానికి చెందిన గజ్జెల శ్రీరాములు, సునీతకు నాలుగు కుమార్తెలు. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీరాములు ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ అష్టకష్టాలు పడి నాలుగురు కుమార్తెలను చదివించాడు. పెద్ద కుమార్తె శ్రావణి 1 నుంచి 5 వరకు ఆస్నాద జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యాభ్యాసం చేసింది. 6 నుంచి 10 వరకు నిర్మల్ గురుకుల పాఠశాలలో చదివింది. 2008 లో ఏపీ ఆర్‌జేసీ పరీక్షలు రాసి వరంగల్ ఇంటర్ పూర్తి చేసింది. టీటీసీ పూర్తి చేసి 2012లో నిర్వహించిన డీఎస్సీ పరీక్ష పాసై టీచర్ ఉద్యోగాన్ని సంపాదించింది. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధిస్తూ శ్రావణి ఆదర్శంగా నిలుస్తోంది.

ఐఏఎస్‌ను కావాలనుకున్నా..

మాది నిరుపేద కుటుంబం ఇంటి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని విద్యాభ్యాసం కొనసాగించా. అన్ని తరగతుల్లో ప్రథమ స్థానంలో వచ్చా. ఐఏఎస్ కావాలని అనుకున్నా. ఇంటి ఆర్థిక ఇబ్బందులు నన్ను ముందుకు వెళ్లనీయలేదు. ప్రస్తుతం ఇంటికి ఆసరాగా నిలువాల్సిన బాధ్యత నాపై ఉంది. నాబాధ్యతను తీర్చేందుకు ఉన్నత చదువుల గురించి ఆలోచించ లేదు. ఐఏఎస్ కావాలన్న నా ఆకాంక్షను పక్కకు పెట్టా. నా ముందు ఉన్న బాధ్యతను నేరవేర్చేందుకు ఉపాధ్యాయురాలి ఉద్యోగంలో చేరాను. ఇంకా ఉన్నత చదువులు చదవాలనుకుంటున్నా.

- గజ్జెల శ్రావణి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు, పొక్కూర్

అర్థమయ్యే రీతిలో బోధన



నిర్మల్‌రూరల్: తరగతిలోని విద్యార్థులందరికీ అర్థమయ్యే రీతిలో బోధన చేస్తున్నారు చిట్యాల్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కె. సుజాత. గణితం అంటే విద్యార్థులకు భయం పోయేలా ప్రత్యేకంగా చార్ట్‌లను రూపొందించారు. ఆ చార్టులతో విద్యార్థులకు వివరణలు ఇస్తూ బోధిస్తున్నారు. గణిత ఒలంపియాడ్, క్విజ్‌పోటీల్లోనూ విద్యార్థులు విజయం సాధించేలా వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వస్తున్న విద్యార్థులు జాతీయస్థాయి పోటీపరీక్షల్లో రాణించేలా బోధించడమే తన లక్ష్యమని పేర్కొంటున్నారు.

ఆటలతో ఆరోగ్యం



నిర్మల్‌రూరల్: విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు కూడా ముఖ్యమే అంటున్నారు బీరవెల్లి ఉన్నత పాఠశాల పీఈటీ వెన్నెల. ప్రతీరోజు విద్యార్థులు తప్పనిసరిగా ఆటలు ఆడేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ సంవత్సరం పాఠశాల నుంచి ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థులు వివిధ పోటీల్లో రాష్ట్రస్థాయిలో రాణించేలా వెన్నెల కృషి చేస్తున్నారు. భవిష్యత్‌లో జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించేలా విద్యార్థులకు తగిన శిక్షణను అందజేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.